పద్నాలుగు వందల
నలభై రెండు నిమిషాలు
రూ॥100/- పేజీలు:96


నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్),
హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(అబిడ్స్),హిమాయత్‌నగర్,
కొండాపూర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

ప్రపంచ ఆర్థిక వేదికకు ట్రంప్ ఎజెండా

నేడు ఎసిబి విచారణకు హాజరుకానున్న గ్రీన్ కో సిఇఒ

బందీల విడుదలపై అవగాహన కుదిరింది : ఇజ్రాయెల్

లోపలి పేజీల్లో

సంపుటి 08, సంచిక: 50 | శనివారం | 18-01-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12 | వెల రూ. 5.00

## సింగపూర్ ఐటిఇతో స్కిల్స్ వర్సిటీ ఎంఒయు

- నైపుణ్యాల అభివృద్ధికి పరస్పర సహకారం
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటన తొలి రోజే కీలక ఒప్పందం
- సింగపూర్ విదేశాంగ మంత్రితో భేటీ





ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి విదేశీ పర్యటనకు తొలిరోజే విశేష స్పందన లభించింది. నైపుణ్యాల అభివృద్ధిలో కలిసి పనిచేసేందుకు తెలంగాణలోని ప్రతిష్టాత్మక 'యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, సింగపూర్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐటిఇ) పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. త్వరలోనే ఐటిఇ ప్రతినిధి బృందం హైదరాబాద్‌ను సందర్శించనున్నట్లు వెల్లడించింది. 'తెలంగాణ రైజింగ్ టీమ్' శుక్రవారం సింగపూర్‌లో పర్యటించింది. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి వెంట ఐటి పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్‌బాబు, పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్, టిజిఐఐసి మేనేజింగ్ డైరెక్టర్ విష్ణువర్ధన్, సిఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ విఎల్‌విఎస్ఎస్ సుబ్బారావు ఈ బృందంలో ఉన్నారు. తొలి రోజునే తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం సింగపూర్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐటిఇ) క్యాంపస్‌ను సందర్శించింది. అక్కడ నిర్వహిస్తున్న స్కిల్ డెవెలప్‌మెంట్ కోర్సులు, అధునాతన సదుపాయాలను పరిశీలించింది. అక్కడ శిక్షణను అందిస్తున్న దాదాపు 20 రంగాలకు చెందిన నిపుణులు,

తరువాయి 2లో

## వ్యవసాయంపై కార్పొరేట్ పడగ

ఊతమిస్తున్న మోదీ సర్కార్

కుట్రలో భాగమే నూతన ఒప్పందాలు

రైతాంగ ఉద్యమాలతోనే వ్యవసాయ రంగ పరిరక్షణ



ప్రజాపక్షం/ఖమ్మం

యావత్ దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను కబళించిన కార్పొరేట్ సంస్థల కన్ను ఇప్పుడు వ్యవసాయ రంగంపై పడింది. సాగు భూమిని తమ ఆక్రమణలోకి తెచ్చుకోవడం ద్వారా ఈ దేశాన్ని శాసించాలని ఊహాత్మక ఎత్తుగడతో ముందుకు సాగుతున్నాయి. ఈ ఎత్తుగడకు కార్పొరేట్ల చుట్టం కేంద్రంలో మోదీ సర్కార్ యథాశక్తి సహకరిస్తుంది. కేంద్ర ప్రభుత్వ విధానాలతో వ్యవసాయ రంగం సంక్షోభంలోకి కూరుకుపోతున్నది. జాతీయ స్థూల ఉత్పత్తి గణనీయమైన వాటా కలిగిన వ్యవసాయ రంగం క్రమేపి తన వాటాను కోల్పోతూ వస్తుంది. 1980 దశకం ప్రారంభంలో జాతీయ స్థూల ఉత్పత్తి (జిడిపి)లో 36శాతం వాటా కలిగిన వ్యవసాయ రంగం 1990 నాటికి 29.6 శాతానికి పడిపోయింది. 2022–23లో వ్యవసాయ రంగ వాటా కనిష్ట స్థాయికి 21.1 శాతానికి పడిపోయింది. దేశ జనాభాలో సగానికి పైగా ప్రజలు ఆధారపడిన వ్యవసాయ రంగం వాటా తగ్గుదల దేశ ఆర్థిక రంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతూ వచ్చింది. పాలకులు వ్యవసాయ రంగానికి కేటాయింపులు తగ్గించడం, సబ్సిడీలను ఎత్తివేయడంతో పాటు గిట్టుబాటు ధరలు కల్పించడంలో ఘోరంగా వైఫల్యం చెందారు. వ్యవసాయేతర రంగాల్లో వస్తువును ఉత్పత్తి చేసిన వారు ఖర్చు, పెట్టుబడి, లాభం ఆధారంగా వస్తువు ధర నిర్ణయించుకునే అవకాశం కల్పించిన పాలకులు రైతుకు మాత్రం ఆ అవకాశం ఇవ్వలేదు. పెట్టుబడి ఆధారంగా మద్దతు ధరను నిర్ణయించాలని రైతులు ఎన్నో ఆందోళనలు చేసినా ఫలితం దక్కలేదు. జయతి ఘోష్, స్వామినాథన్ సహా పలు కమిషన్‌లు వ్యవసాయ రంగంపై అధ్యయనం చేసి ప్రభుత్వానికి ఇచ్చిన నివేదికలు, సిఫారసులలో ఏ నివేదికను పట్టించుకోలేదు. ఏ సిఫారసును అమలు చేయలేదు. గత పాలకులు వ్యవసాయ రంగాన్ని విస్మరించారు కాని వ్యవసాయ రంగాన్ని మరొకరికి అప్పగించే పని చేయలేదన్నది వాస్తవం. ఆ పనిని ఇప్పుడు మోదీ సర్కార్ చేస్తున్నది. దేశంలో రైతులను భూమి నుంచి తరిమేసే కుట్రకు తెరలేపింది. వ్యవసాయోత్పత్తులకు సంబంధించి స్వేచ్ఛ వాణిజ్యం, అపరిమిత నిల్వలు, వ్యవసాయ రంగంలో సాగు ఒప్పందాలు భారతదేశ వ్యవసాయ రంగంపై తీవ్ర ప్రభావాన్ని చూపడంతో పాటు రైతులను కుదేలు చేస్తుంది. అందువల్ల దేశ వ్యాప్తంగా రైతాంగం నూతన సాగు చట్టాలకు వ్యతిరేకంగా పోరాడుతుంది. స్వేచ్ఛా వాణిజ్యం, నిల్వలు, ఒప్పందాలు వ్యవసాయ రంగాన్ని శాసించే ప్రక్రియలు. వ్యవసాయ రంగానికి ప్రోత్సాహకాలు ఇచ్చి ఆదుకోవాల్సిన పాలకులు తద్విరుద్ధంగా వ్యవహరిస్తున్నారు. వ్యవసాయానికి ప్రకృతి సహకరించడం లేదు. అతివృష్టి అనావృష్టి నడుమ పంటలు ఎండిపోవడమో, కొట్టుకుపోవడమో జరుగుతుంది. గడిచిన దశాబ్ద కాలంలో నియంత్రణ లేని తెగుళ్ల వ్యవసాయ రంగ సగటు ఉత్పత్తిని తగ్గించడమే గాక క్రిమిసంహారక, రసాయనిక ఎరువుల వాడకం పెరిగి పెట్టుబడి రెట్టింపు అయ్యింది. దశాబ్ద కాలంగా ప్రభుత్వం ఇచ్చిన ఏ నినాదం, ఏ విధానం వ్యవసాయ రంగాన్ని

తరువాయి 2లో

## క్యూబాపై ఆంక్షల సడలింపును స్వాగతించిన సిపిఐ

**న్యూఢిల్లీ :** క్యూబాపై ఆంక్షలను సడలించాలని అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ ఇటీవల తీసుకున్న నిర్ణయాన్ని సిపిఐ స్వాగతించింది. ఈ నిర్ణయం సరైన దిశలో తీసుకున్న ఒక ముందడుగు అని వ్యాఖ్యానించింది. కానీ, ఒక దశాబ్దకాలంపాటు అమెరికా ఆంక్షల కారణంగా జరిగిన లోతైన అన్యాయాలను పరిష్కరించడంలో ఇది చాలా స్వల్పమేనని సిపిఐ అభిప్రాయపడింది. ఏమాత్రం బాహ్య పరిమితులు లేకుండా క్యూబా అభివృద్ధి చెందడానికి ఈ చర్యలను మరింత విస్తృతపరచాలని ఆకాంక్షించింది. క్యూబా ప్రజల స్వీయనిర్ణయాధికార హక్కును అమెరికా గౌరవించాలని, క్యూబా స్వాతంత్ర్యాలను క్యూబా ప్రజలకు భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తన సంఘీభావాన్ని పునరుద్ఘాటించింది. ఈ మేరకు

తరువాయి 2లో

## ఎసిబికి చిక్కిన ఆర్ఐ

రూ.5వేలు లంచం తీసుకుంటుండగా పట్టుబడిన శ్యాంనాయక్



ప్రజాపక్షం/డిండి

నల్లగొండ జిల్లా డిండి మండలం పడమటి తండాకు చెందిన ఓ వ్యక్తి తన కూతురుకు సంబంధిం చిన కళ్యాణ లక్ష్మీ ఫైల్ విషయంలో లంచం డిమాండ్ చేయడంతో బాధితుడు ఈనెల 9వ తేదిన నల్గొండ ఎసిబి అధికారులను ఆశ్రయించారు. కళ్యాణ లక్ష్మీ జారీ కావాలంటే

తరువాయి 2లో



## గర్భిణులకు రూ.21వేల సాయం

ప్రతినెలా మహిళలకు రూ. 2500

రూ. 500లకే గ్యాస్ సిలిండర్, పేదలకు రూ.5కే పోషకాహారం

ఢిల్లీలో మేనిఫెస్టో విడుదల చేసిన బిజెపి

**న్యూఢిల్లీ :** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల కోసం బిజెపి 'సంకల్ప్ పత్ర' పేరుతో మేనిఫెస్టోను శుక్రవారం బిజెపి ఢిల్లీ శాఖ కార్యాలయం వేదికగా బిజెపి జాతీయ అధ్యక్షుడు జెపి నడ్డా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మేనిఫెస్టోలోని కీలక వివరాలను వెల్లడించారు. తమ సంకల్ప పత్రం వికసిత ఢిల్లీకి పునాదులు వేస్తుందని నడ్డా తెలిపారు. ప్రస్తుతం ఢిల్లీలో అమల్లో ఉన్న అన్ని సంక్షేమ పథకాలను కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. 'ఎన్నికల్లో బిజెపి గెలిస్తే గర్భిణులకు రూ. 21వేల ఆర్థిక సాయం, 'మహిళా సమృద్ధి యోజన' ద్వారా ఢిల్లీ మహిళలకు ప్రతి నెలా రూ.2,500 ఆర్థిక సాయం. ఢిల్లీలో 'ఆయుష్మాన్ భారత్' అమలు. అదనంగా రూ.5 లక్షల హెల్త్ కవర్. ఆప్ హయాంలో అమలైన సంక్షేమ పథకాల్లో జరిగిన అవినీతిపై దర్యాప్తు. పేద వర్గాలకు చెందిన మహిళలకు రూ.500కే ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్

తరువాయి 2లో

## సకాలంలో నిధులు ఖర్చు

ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ చట్టం ప్రకారం శాఖల వారీగా ప్రతినెలా ఖర్చు వివరాలు వెల్లడించాలి : సమీక్షా సమావేశంలో డిప్యూటీ సిఎం భట్టి



ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రతి శాఖలో ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ చట్టం ప్రకారం నిధులు సకాలంలో ఖర్చు చేయాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సబ్ ప్లాన్ చట్టం ప్రకారం అందుబాటులో ఉన్న నిధులను సంపూర్ణ స్థాయిలో వినియోగించాలని, చేస్తున్న వ్యయం వివిధ వర్గాల్లో ఆదాయం బాగా పెరిగేలా, ఆస్తులు మరింత సమర్థవంతంగా నిర్వహించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించాలని డిప్యూటీ సిఎం అధికారులను ఆదేశించారు. వీటికి సంబంధించిన పూర్తి వివరాలతో ఈనెల 23న నిర్వహించనున్న సమావేశానికి రావాలని అధికారులను కోరారు. డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ సచివాలయంలో శుక్రవారం ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ చట్టం అమలు తీరుపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో డిప్యూటీ సిఎం సమీక్ష సమావేశం నిర్వహించారు. సబ్ ప్లాన్ చట్టం ప్రకారం శాఖల వారీగా చేసిన ఖర్చు వివరాలను ప్రతి నెలరోజులకు ఒకసారి వెల్లడించాలని అధికారులను ఆయన ఆదేశించారు. సబ్ ప్లాన్ చట్టం కోటా ప్రకారం ఇప్పటివరకు నిధులు ఖర్చు చేయని శాఖల అధికారులు రానున్న రెండు నెలల్లో లక్ష్యాన్ని చేరుకునేందుకు ఎటువంటి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారని వివిధ శాఖల అధికారులను డిప్యూటీ సిఎం ప్రశ్నించారు. బడ్జెట్ యేతర నిధులు ఖర్చు చేసే సమయంలోనూ ఎస్‌సి, ఎస్‌టి సబ్ ప్లాన్ చట్టం ప్రకారం జనాభా


తరువాయి 2లో

## ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల బరిలో సిపిఐ ఆరు స్థానాల్లో పోటీ

**న్యూఢిల్లీ:** ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) పోటీ చేయనుంది. మొత్తం ఆరు అసెంబ్లీ స్థానాల్లో అభ్యర్థులను నిలపనున్నట్లు సిపిఐ వెల్లడించింది. ఈ మేరకు అభ్యర్థుల జాబితాను ప్రకటించింది. ఢిల్లీ ఉత్తర జిల్లా ఆదర్శ్‌నగర్ నియోజకవర్గం నుంచి సంజీవ్‌కుమార్ రాణా, వాజిపూర్ నుంచి దేవేంద్రకుమార్, ఢిల్లీ పశ్చిమ జిల్లా వికాస్‌పురి నియోజకవర్గం నుంచి షిజో వర్గీస్, ఢిల్లీ నైరుతి జిల్లా పాలం నియోజకవర్గం నుంచి దిలీప్‌కుమార్, ఢిల్లీ దక్షిణ జిల్లా మెహ్రౌలీ నియోజకవర్గం నుంచి ఎర్షద్‌ఖాన్, ఓఖ్లా నుంచి ఎండి.ఇంజమాముల్ హసన్ పోటీ చేయనున్నట్లు వివరించింది. వీరంతా ఇప్పటికే తమ నామినేషన్లు దాఖలు చేశారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ఫిబ్రవరి 5వ తేదీన ఒకే విడతలో జరుగుతుంది. మొత్తం 70 స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. ఫిబ్రవరి 8వ తేదీన ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

## 31 నుంచి పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు

ఫిబ్రవరి 1న బడ్జెట్



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ తొలి విడత బడ్జెట్ సమావేశాలు ఈ నెల 31వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు జరిగే అవకాశాలున్నాయి. కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ఫిబ్రవరి 1వ తేదీన 8వ సారి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. సంప్రదాయం ప్రకారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఈ నెల 31వ తేదీన లోక్‌సభ, రాజ్యసభ సంయుక్త సమావేశంలో ప్రసంగించడంతో బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతాయి. అదే రోజున ఆర్థిక సర్వేను కూడా ప్రవేశపెట్టనున్నారు. అదే విధంగా రెండవవిడత బడ్జెట్ సమావేశాలు మార్చి రెండవ వారం, ఏప్రిల్ తొలి వారంలో జరగనున్నాయి. మార్చి 10వ తేదీ నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరిగే అవకాశాలు ఉన్నాయి. తొలి విడత బడ్జెట్ సమావేశాల్లో భాగంగా రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యనాదాలు తెలిపే తీర్మానంపై ఉభయసభల్లో చర్చ జరగనుంది. లోక్‌సభ, రాజ్యసభలోనూ ప్రధాని సమాధానంతో ఈ సమావేశాలు ముగియనున్నాయి.

**బడ్జెట్‌పై సామాన్యుల ఆశలు :** కేంద్ర బడ్జెట్‌పై సామాన్యుల్లో, వేతన జీవుల్లో అంచనాలు భారీగా పెరుగుతున్నాయి. అందుకనుగుణంగా

తరువాయి 2లో

## తప్పించుకున్న హిడ్మా

ఎన్‌కౌంటర్లో 12 మంది మృతి

భారీగా ఆయుధాలు స్వాధీనం

ప్రజాపక్షం/భద్రాచలం

భద్రతా బలగాలు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎన్‌కౌంటర్‌లో మోస్ట్ వాంటెడ్ మావోయిస్టు అగ్రనేత హిడ్మాతో పాటు మరో మావోయిస్టు నాయకుడు బార్సే దేవా కాల్పుల ధాటికి తాళలేక అడవుల్లోనికి జారుకుని తప్పించుకున్నారని ఛత్తీస్‌గఢ్ బస్తర్ రెంజ్ ఐజి సుందర్ రాజ్.పి తెలిపారు. గురువారం చోటు చేసుకున్న ఎన్‌కౌంటర్‌పై ఆయన శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఐజి మాట్లాడుతూ దక్షిణబస్తర్ రేంజ్‌లోని పామేడు బాసగూడ ఉసర్

తరువాయి 2లో

## భవిష్యత్ చలనశీలత 'భారత్‌దే'




'భారత్ మొబిలిటీ గ్లోబల్ ఎక్స్‌పో-2025'ను ప్రారంభించిన ప్రధానమంత్రి మోదీ

కేవలం 4ఏళ్లలో 36బిలియన్ అమెరికన్ డాలర్ల విదేశీ ప్రత్యక్షపెట్టుబడులను ఆకర్షించిన ఘనత మనదేనని వెల్లడి

**న్యూఢిల్లీ :** ఒక ఏడాదికి 2.5 కోట్ల వాహనాలను ఊహించనిరీతిలో విక్రయించి కేవలం 4 ఏళ్లలో 36బిలియన్ల అమెరికన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను ఆకర్షించిన భారత్‌దే భవిష్యత్ చలనశీలత (ఫ్యూచర్ మొబిలిటీ) అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. శుక్రవారం నాడు ఇక్కడి భారత్ మండపం వద్ద 'భారత చలనశీలత అంతర్జాతీయ ప్రదర్శన2025'ను ప్రారంభించిన అనంతరం ప్రధానమంత్రి మోదీ మాట్లాడుతూ మొబిలిటీ రంగంలో తమ భవిష్యత్‌ను రూపొందించుకోవాలని చూస్తున్న ప్రతీ పెట్టుబడిదారుడికి భారతదేశం ఒక అత్యుత్తమ గమ్యస్థానంగా నిలుస్తుందని తెలిపారు. 5 రోజుల పాటు దేశరాజధానిలో జరుగనున్న ఈ అంతర్జాతీయ ఎక్స్‌పో మూడు వేదికలలో నిర్వహించబడనుంది. భారత్ మండపం, యశోభూమి, గ్రేటర్ నోయిడాలోని ఇండియా ఎక్స్‌పో సెంటర్, మార్ట్ వేదికలుగా ఈ అంతర్జాతీయ ఎక్స్‌పో నిర్వహించబడుతుంది. 100 నూతన ఆటోమొబైల్స్ ప్రారంభాలు, కాంపోనెంట్ ఉత్పత్తులు, సాంకేతికతలలో 100కు పైగా కొత్త లాంచ్‌లను చూసే అవకాశం ఉందని భావిస్తున్నారు. జనవరి 1722 వరకు షెడ్యూల్ చేయబడిన భారతదేశపు

తరువాయి 12లో

## విశాఖ ఉక్కుకు రూ.11,440 కోట్లు



గట్టెక్కించేందుకు కేంద్రం ప్యాకేజీ

త్వరలో రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌ల ప్రారంభం

కేంద్రప్రభుత్వ అధికార ప్రకటన

**న్యూఢిల్లీ:** విశాఖ ఉక్కును ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కించి పునరుజ్జీవింప చేయడానికి రూ. 11,440 కోట్ల ప్యాకేజీ అందించనున్నట్లు కేంద్రప్రభుత్వం తెలిపింది. దీనిపై ఈమేరకు కేంద్ర సమాచార, ప్రసారశాఖమంత్రి అశ్వినీ వైష్ణవ్ శుక్రవారం అధికారిక ప్రకటన విడుదల చేశారు. ప్యాకేజీకి గురువారమే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్వర్యంలో జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ సమావేశం ఆమోదముద్ర వేసినట్లు కేంద్ర మంత్రి పేర్కొన్నారు.''ఇది భారీ రివైవల్ ప్యాకేజీ. స్టీల్ రంగంలో విశాఖ ఉక్కు ప్రధానమైన సంస్థ. విశాఖ ఉక్కు...పోర్టు ఆధారిత స్టీల్ ప్లాంట్. ఈ పరిశ్రమను ఏళ్ల తరబడి సమస్యలు వేధిస్తున్నాయి. విశాఖ ఉక్కుకు ప్రకటించిన ఆర్థిక ప్యాకేజీ తక్షణం అమల్లోకి వస్తుంది. త్వరలో రెండు బ్లాస్ట్ ఫర్నేస్‌లు ప్రారంభమవుతాయి. ఆగస్టు నాటికి 3 బ్లాస్ట్ ఫర్నేస్‌లు అందుబాటులోకి వస్తాయి. ముడి సరకు సరఫరా కోసం ఎన్ఎండీసీతో చర్చిస్తున్నాం. ఆత్మనిర్భర్ భారత్‌లో విశాఖ ఉక్కు కీలక పాత్ర పోషిస్తుంది. దేశ ఉక్కు అవసరాలు తీర్చడంలో విశాఖ స్టీల్ ప్లాంట్‌ది కీలక పాత్ర. స్టీల్ ప్లాంట్ యాజమాన్యం, కార్మికులకు శుభాకాంక్షలు'' అని ఈ విషయాన్ని కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి, కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించారు.

**హామీ నిలబెట్టుకున్నాం : రామ్మోహన్ నాయుడు**

విశాఖ ఉక్కు పరిరక్షణకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నామని కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. విశాఖ ఉక్కుకు కేంద్రం రూ.11,440 కోట్ల ప్యాకేజీ ప్రకటించడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామి,

తరువాయి 12లో



పారా ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన తెలంగాణకు చెందిన వరంగల్ జిల్లా కల్లెడ వాస్తవ్యురాలు జీవాంజి దీప్తికి శుక్రవారం అర్జున అవార్డును అందజేస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

# స్పేస్‌ఎక్స్ ప్రయోగం విఫలం



అంతరిక్షంలోనే పేలిపోయిన స్టార్‌షిప్

**టెక్సాస్:** స్పేస్‌ఎక్స్ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భారీ రాకెట్ ప్రయోగం విఫలమైంది. స్టార్‌షిప్ అంతరిక్షంలోనే పేలిపోయింది. టెక్సాస్‌లోని బొకాచికా వేదికగా, భారత కాలమానం ప్రకారం శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు, రాకెట్‌ను ప్రయోగించారు. నింగిలోకి దూసుకెళ్లిన ఎనిమిదిన్నర నిమిషాలకే రాకెట్ అంతరిక్షంలో పేలిపోయింది. టెయిల్ ప్యాడ్‌లో పేలుడు సంభవించడం, ఆరు ఇంజిన్లు ఒకదాని తర్వాత మరొకటిగా మూతబడడంతో ఈ ప్రయోగం సఫలం కాలేదు. రాకెట్ బూస్టర్ విడిపోయి లాంచ్ ప్యాడ్‌కి తిరిగి చేరుకుంది. అయితే, రాకెట్‌లోని ఆక్సిజన్ లీక్ కావడంతోనే పేలిపోయినట్లు ప్రాథమిక అంచనా. రాకెట్ పేలిపోయిన తరువాత శకలాలు కరేబియన్ సముద్రంలో పడ్డాయి. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతుంది. మొత్తం పది డమ్మీ ఉపగ్రహాలను తీసుకెళ్లిన ఈ వ్యోమనౌక, తిరిగి లాంచింగ్ ప్యాడ్‌కు తిరిగిరావాల్సి ఉంది. గతంలో ఒకసారి మాత్రమే స్పేస్‌ఎక్స్ ఈ ప్రయత్నంలో సఫలమైంది. మరోసారి అలాంటి ప్రయోగాన్ని చేపట్టినప్పటికీ, సాంకేతిక వైఫల్యాల కారణంగా రాకెట్ పేలిపోయింది. ఈ ఘటనలపై స్పేస్‌ఎక్స్ ప్రతినిధి డాన్ హౌట్ స్పందిస్తూ, ప్రయోగం విఫలం కావడానికి దారితీసిన పరిస్థితులు, కారణాలను సేకరిస్తున్నట్టు తెలిపారు. ప్రయోగం విఫలమైనప్పటికీ, స్టార్‌షిప్ విశ్వసనీయత పెరిగిందని వ్యాఖ్యానించారు. కారణాలను కనుగొని, సమీక్షించి, మరోసారి ఇలాంటి వైఫల్యాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. ఇవుంటే, స్టార్‌షిప్ రాకెట్ పేలిపోయిన తర్వాత, మండుతున్న దాని శకలాలు సముద్రంలో పడిన వీడియోను స్పేస్‌ఎక్స్ సంస్థ అధినేత, ప్రపంచ కుబేరుడు ఎలాన్‌మస్క్ తన 'ఎక్స్' ఖాతాలో షేర్ చేశారు. ఈ ఘటనను విజయం కాకపోయినా, వినోదాన్ని అందించిందని వ్యాఖ్యానించారు.



లెబనాన్ పర్యటన కోసం శుక్రవారం బీరూట్ చేరుకున్న ఫ్రెంచ్ అధ్యక్షుడు ఇమాన్యుయెల్ మక్రాన్. బీరూట్ అంతర్జాతీయ విమానాశ్రయంలో లెబనాన్ తాత్కాలిక ప్రధాని నజీబ్ మికాటీ ఆయనకు స్వాగతం పలికారు. ఈ పర్యటనలో భాగంగా, లెబనాన్‌లో కొత్తగా ఎన్నికైన నేతలతో మక్రాన్ చర్చలు జరుపుతారు. 14 నెలల పాటు కొనసాగిన ఇజ్రాయెల్–హిజ్బొల్లా యుద్ధం కారణంగా లెబనాన్ అన్ని రకాలుగానూ తీవ్రంగా నష్టపోయింది. ఆ లోటును భర్తీ చేసుకోవడానికి, దేశంలో స్థాపనకు కొత్త నాయకత్వం ప్రయత్నిస్తున్నది. ఈ కీలక సమయంలో మక్రాన్ పర్యటన ప్రాధాన్యతను సంతరించుకుంది.



రష్యాతో పరస్పర సహకారం, అభివృద్ధిలో భాగస్వామ్యం, వాణిజ్యం తదితర ఒప్పందాల కోసం శుక్రవారం మాస్కో విమానాశ్రయం చేరుకున్న ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్. ఆయనకు రష్యా సైనికాధికారులు ఘనంగా స్వాగతం పలికారు.



అనంతరం రష్యా అధ్యక్షుడు వ్లాదిమీర్ పుతిన్‌ను ఆయన నివాసంలో పెజెష్కియాన్ మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఇరు దేశాల మధ్య మైత్రీ సంబంధాలు మరింత మెరుగవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.


# తగ్గుతున్న చైనా జనాభా





## భవిష్యత్తులో సమస్యలు తప్పవంటున్న పరిశీలకులు

**బీజింగ్:** ఒకప్పుడు ప్రపంచంలోనే అత్యధిక జనాభా గల దేశంగా పేరొందిన చైనాలో ఇప్పుడు తగ్గుదల నమోదవుతున్నది. జనాభా విషయంలో చైనాను అధిగమించి భారత్ నంబర్‌వన్ స్థానానికి చేరిన విషయం తెలిసిందే. కాగా, వివిధ కారణాలతో వరుసగా మూడో ఏడాది కూడా చైనా జనాభాలో తగ్గుదల నమోదైంది. దీని వల్ల భవిష్యత్తులో సమస్యలు తప్పవని పరిశీలకులు స్పష్టం చేస్తున్నారు. చైనా ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన అధికారిక ప్రకటనను అనుసరించి, 2023 సంవత్సరంతో పోలిస్తే, 2024 చివరి నాటికి జనాభా 13.90 లక్షలు తగ్గి, 140.8 కోట్లుగా నమోదైంది. ఇప్పటికే చైనాలో వృద్ధుల సంఖ్య పెరగడం ఆందోళన కలిగిస్తున్నది. జనాభాలో 22 శాతం మంది వృద్ధులే. 2035 నాటికి ఈ సంఖ్య 30 శాతం మించిపోతుందని అంచనా. పట్టణాలు, నగరాలకు వలసలు విపరీతంగా పెరుగుతున్నాయి. ఈ సమస్యలకు తోడు జనాభా తగ్గడం చైనా ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం చూపడం ఖాయమని విశ్లేషకులు అంటున్నారు. ఒకవైపు వృద్ధుల వల్ల ఉత్పత్తి లేకపోగా, వారి ఆరోగ్యం, సంక్షేమం కోసం భారీ మొత్తాలను ఖర్చు చేయాల్సి వస్తుందని, మరోవైపు పనిచేయగల యువ జనాభా తగ్గడం వల్ల ఉత్పత్తి భారీగా కుంటుపడుతుందని అంటున్నారు. చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ కూడా దేశంలో వృద్ధుల సంఖ్య పెరగడాన్ని ప్రస్తావిస్తూ, వారికి అన్ని రకాల సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యతను సక్రమంగా నెరవేర్చాలని అధికారులను ఆదేశించారు. జపాన్, దక్షిణ కొరియా, హాంకాంగ్‌తోపాటు కొన్ని ఐరోపా దేశాల్లో జనాభా తగ్గుతున్నది. ఆ జాబితాలోకే చైనా కూడా చేరింది. పెరుగుతున్న ఖర్చుల కారణంగా యువతీయువకులు వివాహంపై ఆసక్తి చూపడం లేదు. దంపతులు కూడా ఆర్థికపరమైన అంశాలను దృష్టిలో ఉంచుకొని, పిల్లలను కనడానికి వెనుకాడుతున్నారు. దీనితో జననాల రేటు తగ్గిపోయింది. అదే సమయంలో దేశంలో వృద్ధుల ఆయుర్ధాయం పెరిగింది. వెరసి వృద్ధుల సంఖ్య పెరుగుతుండగా, జనాభా తగ్గుతున్నది. ప్రస్తుతం ప్రతి 104.34 మంది పురుషులకు, 100 మంది మహిళలే ఉన్నారు. ఈ వ్యత్యాసం కూడా భవిష్యత్ జనాభా లెక్కలపై ప్రభావం చూపడం ఖాయం. వివాహాలను, జననాలను ప్రోత్సహించడానికి చైనా ప్రభుత్వం వ్యూహరచన చేస్తున్నది.




# బందీల విడుదలపై అవగాహన కుదిరింది

### గాజాలో కాల్పుల విరమణ నేపథ్యంలో ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ప్రకటన



**టెల్ అవీవ్:** గాజా స్ట్రిప్‌లో కాల్పుల విరమణ ఆదివారం నుంచి అమల్లోకి వస్తుందని, తదనంతరం ఇరువైపులా బందీల విడుదల ప్రారంభమవుతుందని వచ్చిన వార్తలు నిజమేని ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు తాజా ప్రకటన స్పష్టం చేస్తున్నది. అమెరికా, ఖతార్ మధ్యవర్తిత్వంతో ఇజ్రాయెల్–హమాస్ మధ్య సయోధ్య కుదిరిన విషయం తెలిసిందే. బందీలను విడుదల చేయడానికి ఇరువర్గాల మధ్య ఒప్పందం ఖాయమైందని నెతన్యాహు శుక్రవారం తెల్లవారుజామున విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. కాల్పుల విరమణ ఒప్పందానికి అడ్డుగా మారిన చిక్కులను మధ్యవర్తులు తొలగించినట్లు పేర్కొన్నారు. ఇజ్రాయెల్‌కు చెందిన బందీలను విడిచిపెట్టడానికి హమాస్ అంగీకరించినట్టు సమాచారం. నెతన్యాహు కూడా దాదాపు ఇలాంటి ప్రకటనే చేయడంతో గాజాలో శాంతి స్థాపనపై ఆశలు పెరుగుతున్నాయి. తమ వద్ద ఉన్న పాలస్తీనా యుద్ధ ఖైదీలను విడిచిపెట్టడానికి వీలుగా ఇజ్రాయెల్ ప్రభుత్వం సమావేశమై నిర్ణయం తీసుకోవడం ఇక లాంఛనం కానుంది. ఈ నిర్ణయాలు అమల్లోకి వచ్చిన తర్వాత, గాజాలో యుద్ధానికి తెర పడుతుంది. ఇలావుంటే, గతంలోనూ కాల్పుల విరమణను ప్రకటించిన తర్వాత కూడా గాజాపై ఇజ్రాయెలీ దళాలు దాడులు చేసిన సంఘటనలు ఉన్నాయి. మరోసారి నెతన్యాహు అలాంటి తప్పిదానికే పాల్పడే అవకాశాలు లేకపోలేదన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఆయితే, జో బైడెన్ స్థానంలో అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ ఎన్నిక కావడం నెతన్యాహు దూకుడుకు కళ్లెం వేయనుంది. ఇజ్రాయెల్–పాలస్తీనా యుద్ధానికి తెరదించుతానని ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని నిలబెట్టుకోవడానికి ట్రంప్ ప్రయత్నించడం ఖాయంగా కనిపిస్తున్నది. ఇలాంటి పరిస్థితుల్లో ఇజ్రాయెల్ మొండి వైఖరిని ప్రదర్శించకుండా, కాల్పుల విరమణకు అంగీకరించడమేగాక, ఒప్పందాన్ని పాటిస్తుందన్న వాదన బలంగా వినిపిస్తున్నది. ఏం జరుగుతుందనేది ప్రస్తుతానికి సస్పెన్స్.

## ఎసిబికి చిక్కిన ఆర్ఐ

(మొదటి పేజీ తరువాయి)

రూ.10వేలు ఇవ్వాలని సదరు వ్యక్తిని డబ్బుల కోసం డిమాండ్ చేయగా ఎసిబిని ఆశ్రయించిన సదరు బాధితుడు రూ.5వేలు శుక్రవారం హైదరాబాద్‌లోని శ్యాంనాయక్ నివాసానికి వెళ్ళి డబ్బులు ఇస్తుండగా రెడ్ హ్యాండ్‌డెగా ఎసిబి అధికారులు పట్టుకున్నారు. గతంలో కూడా పిఏపల్లి ఆర్ఐగా పనిచేస్తున్న సమయంలో సస్పెండ్ అయినట్లు సమాచారం. కళ్యాణ లక్ష్మి ఫైల్‌పై సంతకం పెట్టకుండా రెండు సంవత్సరాలుగా వేధిస్తున్న శ్యాంనాయక్ బాధితుడి నుండి లంచం తీసుకుంటుండగా నల్గొండ ఎసిబి డిఎస్‌పి జగదీష్ చందర్ ఆధ్వర్యంలో ఉదయం పట్టుకున్నారు. అనంతరం డిండి తహశీల్దార్ కార్యాలయానికి ఆర్ఐ శ్యాంనాయక్‌కు సంబంధించిన ఫైల్స్, ల్యాప్‌టాప్ వివరాలు సేకరించి, తహశీల్దార్ కార్యాలయంలోనే ఆర్ఐ శ్యాంనాయక్‌కు మండల వైద్యాధికారి డా.శైలి వైద్య పరీక్షలు నిర్వహించి నాంపల్లి మెజిస్ట్రేట్ ముందు హాజరుపరిచినట్లు నల్గొండ ఎసిబి డిఎస్పి జగదీష్‌చందర్ తెలిపారు. ఈ సోదాల్లో నల్గొండ ఎసిబి ఇన్‌స్పెక్టర్‌లు వెంకట్‌రావు, రామారావు, రంగారెడ్డి, ఎసిబి ఇన్‌స్పెక్టర్ సుజిత పాల్గొన్నారు.

## స్కిల్స్ వర్సిటీ ఎంఒయు

(మొదటి పేజీ తరువాయి)

కాలేజీ సిబ్బందిని కలిసి మాట్లాడారు. అనంతరం ఐటిఇ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి బృందం చర్చలు జరిపింది. హైదరాబాద్‌లోని ఫోర్త్ సిటీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. వివిధ రంగాల్లో యువతకు ఉపాధి కల్పించేందుకు మార్కెట్ డిమాండ్‌కు అనుగుణంగా వివిధ కోర్సులు నిర్వహిస్తున్న తీరును ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. నైపుణ్యాల అభివృద్ధి (స్కిల్ డెవలప్‌మెంట్) శిక్షణలో భాగస్వామ్యం కోసం పరస్పర సహకారం అందించాలని కోరారు. ఐటిఇ ప్రతినిధి బృందం సానుకూలంగా స్పందించింది. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీతో కలిసి పనిచేసేందుకు సంసిద్ధతను వ్యక్తం చేసింది. చర్చల అనంతరం నైపుణ్యాల అభివృద్ధిలో కలిసి పనిచేసేందుకు ఐటిఇ, స్కిల్ యూనివర్సిటీ పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ ఒప్పందంపై యూనివర్సిటీ విసి సుబ్బారావు, సింగపూర్ ఐటిఇ ప్రతినిధి బృందం తరపున అకడిమిక్, అడ్మిన్ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ పర్వేందర్ సింగ్, ఐటి ఎడ్యుకేషన్ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ ఫాబియన్ చియాంగ్ సంతకాలు చేశారు.

**'తెలంగాణ రైజింగ్ టీమ్'కు ఘన స్వాగతం**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు రాష్ట్ర ప్రతినిధి బృందానికి శుక్రవారం ఉదయం సింగపూర్ విమానాశ్రయంలో తెలంగాణ ప్రవాసులు ఘన స్వాగతం పలికారు. పుష్పగుచ్ఛాలు, శాలువాలతో బృందాన్ని తెలంగాణ ప్రవాసులు సన్మానించి శుభాకాంక్షలు తెలుపుతూ సందడి చేశారు. సిఎం బృందం పర్యటన విజయవంతం కావాలని వారు ఆకాంక్షను వ్యక్తం చేశారు.

**సింగపూర్ విదేశాంగ మంత్రితో సిఎం రేవంత్‌రెడ్డి బృందం భేటీ**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలో ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఉన్నతాధికారుల బృందం శుక్రవారం ఉదయం తొలి రోజు పర్యటనలో భాగంగా సింగపూర్ విదేశాంగ మంత్రి వివియాన్ బాలకృష్ణన్‌తో భేటీ అయ్యారు.

వివియాన్ బాలకృష్ణన్‌తో సిఎం బృందం విస్తృత చర్చలు జరిపింది. మౌలిక సదుపాయాల అభివృద్ధి, నదుల పునరుజ్జీవనం, నీటి వనరుల నిర్వహణ, హరిత ఇంధనం, పర్యాటకం, విద్య, నైపుణ్యాల అభివృద్ధి, ఐటి పార్కుల అభివృద్ధి అంశాలపై చర్చలు జరిపారు. విస్తృత సహకారంతో పాటు పలు అంశాల్లో దీర్ఘకాలిక భాగస్వామ్యాలపై ముఖ్యమంత్రి ఈ చర్చల్లో ప్రధానంగా దృష్టి సారించారు. మూడు రోజుల సింగపూర్ పర్యటన అనంతరం స్విట్జర్లాండ్‌లోని దావోస్ వేదికగా జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సులో ముఖ్యమంత్రి బృందం పాల్గొంటుందని ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది.

## స్వాగతించిన సిపిఐ

(మొదటి పేజీ తరువాయి)

సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం శుక్రవారం ప్రకటన విడుదల చేశారు. సిపిఐ క్యూబా ప్రజలకు తిరుగులేని సంఘీభావాన్ని పునరుద్ఘాటిస్తున్నదని, ఆదేశ సార్వభౌమాధికారం, నిలదొక్కుకొనేందుకు సంబంధించిన కీలకమైన అంశాలలో నిరంతర మద్దతును కొనసాగిస్తుందని పేర్కొంది. క్యూబా చాలా కాలంగా సామ్యవాద సూత్రాలకు దిక్సూచిగా నిలిచింది. దశాబ్దాలుగా విదేశీదురాక్రమణ, ఆర్థిక దిగ్బంధనాలు, సామ్రాజ్యవాదుల జోక్యాలకు వ్యతిరేకంగా క్యూబా ధైర్యంగా ఎదురొడ్డి పోరాడిందని సిపిఐ ప్రశంసించింది. అణగదొక్కే అన్ని రకాల చర్యలను అమెరికా వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేసింది. సామ్రాజ్యవాద ఆధిపత్యాన్ని శాశ్వతం చేసే ఎలాంటి ఎత్తుగడలనైనా సిపిఐ తీవ్రంగా ఖండిస్తుందని పేర్కొంది. క్యూబాకు సంఘీభావంగా నిలబడాలని ప్రపంచవ్యాప్తంగా ఉన్నటువంటి అభ్యుదయశక్తులకు పార్టీ పిలుపునిచ్చింది.

సార్వభౌమాధికారం, సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న దేశాలకు నష్టం కలిగించే విధానాలను అమలు చేస్తున్న అమెరికాను అంతర్జాతీయ సమాజం జవాబుదారీ చేయాలని కోరింది. సామ్రాజ్యవాద దురాక్రమణను వ్యతిరేకించడంలో, ప్రతిఘటించడంలో క్యూబాకు ప్రజాస్వామ్య, ప్రగతిశీల వ్యక్తులు, శక్తులు సంఘటితమై ఎల్లప్పుడూ అండగా నిలబడాలని సిపిఐ పిలుపునిచ్చింది.

## గర్భిణులకు రూ.21వేల సాయం

(మొదటి పేజీ తరువాయి)

పంపిణీ. హోలీ, దీపావళి పండుగల సందర్భంగా ఒక్కో ఉచిత గ్యాస్ సిలిండర్ పంపిణీ. 60 నుంచి 70 ఏళ్లలోపు సీనియర్ సిటిజెన్లకు ప్రతినెలా రూ.2,500 పింఛను. 70 ఏళ్లకుపైబడిన వారికి రూ.3వేల పింఛను. ఢిల్లీలోని 'ఝుగ్గిఝోప్డీ' (జెజె) క్లస్టర్లలో అటల్ క్యాంటీన్ల ఏర్పాటు. అక్కడి పేదలకు రూ.5కే పోషకాహారం. జెజె క్లస్టర్లు అంటే అనధికారిక సెటిల్‌మెంట్లు/ మురికివాడలు' వంటి హామీలను మేనిఫెస్టోలో పొందుపరిచారు. కాగా, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వంపై బిజెపి చీఫ్ జెపి నడ్డా విమర్శలు గుప్పించారు. ఆప్ హయాంలో ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమలు చేయకపోవడం వల్ల ఢిల్లీలోని 51లక్షల మంది ప్రజానీకం ప్రయోజనాలను పొందలేకపోయారని ఆరోపించారు.

ఎన్నికల్లో గెలిచిన వెంటనే ఢిల్లీలో ఆయుష్మాన్ భారత్ పథకాన్ని అమల్లోకి తెస్తామని ఆయన వెల్లడించారు. తొలి కేబినెట్ సమావేశంలోనే అమలుపై నిర్ణయాన్ని ప్రకటిస్తామని నడ్డా తెలిపారు. 'ఆప్ హయాంలో మొహల్లా క్లినిక్‌లు అవినీతికి నిలయాలుగా మారాయి. ల్యాబ్ టెస్టుల పేరుతో మోసానికి పాల్పడ్డారు. దాదాపు రూ.300కోట్ల ప్రజల సొమ్మును లూటీ చేశారు. బిజెపి గెలిస్తే దీనిపై దర్యాప్తు చేయిస్తాం' అని నడ్డా చెప్పారు. 'మహిళలకు ప్రతినెలా రూ.2,100 ఇస్తామని ఆప్ చెబుతోంది. ఆ పార్టీ అధికారంలో ఉన్న పంజాబ్‌లో మహిళలకు ఎలాంటి ఆర్థిక సాయమూ అందడం లేదు. కనీసం ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్లపై రాయితీని కూడా ఆప్ సర్కారు అందించడం లేదు' అని బిజెపి చీఫ్ విమర్శించారు.

**మేనిఫెస్టోకు 1.80 లక్షల సలహాలు, సూచనలు**

వేలాది పార్టీ సమావేశాల్లో జరిగిన మేధోమథనం, ప్రజల నుంచి అందిన సూచనలు, నియోజకవర్గాల వారీగా సేకరించిన ఆలోచనల ప్రాతిపదికన బిజెపి సంకల్ప పత్రాన్ని రూపొందించామని నడ్డా వెల్లడించారు. మేనిఫెస్టో రూపకల్పనపై తమకు దాదాపు 1.80 లక్షల సలహాలు, సూచనలు అందాయన్నారు. దాదాపు 12వేల చిన్నా, పెద్ద సమావేశాలలో ఎన్నికల ప్రణాళికపై చర్చ జరిగిందని తెలిపారు. 41 ఎల్‌ఇడి వ్యాన్ల ద్వారా ప్రజల నుంచి ఆలోచనలను సేకరించినట్లు నడ్డా పేర్కొన్నారు.

## తప్పించుకున్న హిడ్మా

(మొదటి పేజీ తరువాయి)

ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుందన్నారు. మావోయిస్టుల కదలికలు ఉన్నాయనే పక్కా సమాచారం మేరకు సుక్మ, దంతెవాడ, బీజాపూర్, బాసగూడ పిఎస్ పరిధిలోని డిఆర్‌జి, ఎస్‌టిఎఫ్, కోబ్రా బలగాలు సంయుక్త ఆపరేషన్ నిర్వహిస్తుండగా మావోయిస్టుల బృందం తారసపడిందన్నారు. గురువారం ఉదయం 9 గం. ప్రారంభమైన ఎన్‌కౌంటర్ చీకటిపడేంత వరకు కొనసాగిందన్నారు. అనంతరం కొందరు మావోయిస్టులు భయంతో అడవుల్లోనికి పారిపోయారని, పారిపోయిన వారిలో అగ్రనేతలు ఉన్నారని చెప్పారు. ఎన్‌కౌంటర్ అనంతరం సంఘటనా స్థలంలో పరిశీలించగా, ఐదుగురు మాహిళా మావోయిస్టులతో పాటు 12 మృతదేహాలు లభ్యమయ్యాయని, మృతదేహాలతో పాటు 303 రైఫిల్స్ 2, 12బోర్ తుపాకి 1, 315 బోర్ తుపాకి 1, కొన్ని రాకెట్ లాంఛర్లు, నోస్ మజికల్ లోడింగ్ రైఫిల్, వైర్‌లెస్ కిట్లు, టిఫిన్ బాంబులు, నక్సల్స్ సాహిత్యం, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మృతులను గుర్తించే పనిలో ఉన్నామని, త్వరలో మృతుల వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. 2024 నుండి మావోయిస్టుల ఏరివేత పురోగతి కొనసాగుతోందని, 2025లో 16 రోజుల్లోనే 25 మంది మావోయిస్టులను హతమార్చినట్లు చెప్పారు.

అడవుల్లోనికి తప్పించుకుని పారిపోయిన మావోయిస్టుల కోసం వేట కొనసాగుతోందని, ప్రభుత్వ నిర్ధేశానుసారం బలగాలు పెద్ద ఎత్తున గాలింపు చర్యలో నిమగ్నమై ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వ వ్యతిరేక మావోయిస్టు కార్యకలాపాలకు పాల్పడే వారు జనజీవన స్రవంతిలో కలిసేందుకు ప్రభుత్వం మార్గం సుగుమం చేసిందని, స్వచ్ఛందంగా వచ్చి పోలీసుల ఎదుట లొంగిపోతే వారికి ప్రభుత్వపరంగా పునరావాసం కల్పిస్తామని ఐజి సుందర్ రాజ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ రాకేష్ అగ్రవాల్, డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ కమ్లేచన్ కశ్యప్, బీజాపూర్ ఎస్‌పి జితేందర్ కుమార్, ఎస్‌టిఎఫ్ ఎస్‌పి విజయ్ పాండేతో పాటు తదితర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ పడగ

(మొదటి పేజీ తరువాయి)

ఆదుకోలేకపోయాయి. గతంలో వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు రైతుకు ఆర్థికంగా దన్నుగా నిలిచేవి. ఇప్పుడు అప్పటి వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు ఇప్పుడు ప్రధాన పరిశ్రమలుగా మారాయి. పాడి, కూరగాయల సాగు, కోళ్లు, పశు పెంపకం నుంచి రైతులు క్రమేపి వైదొలుగుతున్నారు. వ్యవసాయంపై ఆధారపడిన రైతు ఆర్థికంగా బలహీనపడుతుండగా అదే సమయంలో భూమి ధర రికార్డు స్థాయిలో పెరుగుతుంది. ప్రస్తుత ధరల నేపథ్యంలో లక్షలు పోసి భూమి కొనే స్థితిలో రైతులు లేరు. వ్యవసాయానికి లాకీ అయిన భూమి వ్యవసాయేతర రంగాలకు చెందిన సంపన్న వర్గాల చేతుల్లోకి వెళ్తుంది. ఇప్పుడు పెద్ద పెద్ద భూ కమతాలు వెలుస్తున్నాయి. వందల ఎకరాల వైపు కార్పొరేట్లు ఆలోచన చేస్తున్నారు. కార్పొరేట్ వ్యవసాయాన్ని పాలకులు ప్రోత్సహిస్తున్న పరిస్థితి రైతులకు శాపంగా మారింది. కార్పొరేట్ వ్యవసాయ రంగం అత్యంత ప్రమాదకరంగా మారే ప్రమాదం ఉంది. ప్రధానంగా ఆహార పదార్థాల ధరలపై నియంత్రణను ప్రభుత్వం కోల్పోయి దాసోహం అనే పరిస్థితి దాపురిస్తుంది. పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడతారు. కార్పొరేట్ సాగులో యంత్రాలే ప్రధానం కావడంతో గ్రామీణ ప్రాంతంలో సాగుపై ఆధారపడిన వారు ఉపాధి కోల్పోతారు. ఇది దేశ భవిష్యత్తుకు అత్యంత ప్రమాదకరం. ఇంత ముప్పు ఉందని తెలిసినా బిజెపి కార్పొరేట్ శక్తులను ప్రోత్సహించడం వెనక ఆ పార్టీ స్వార్థం, మోదీ మిత్రుత్వం తప్ప మరొకటి కాదు. తన మిత్రులకు నష్టం వాటిల్లరాదనే దేశ వ్యాప్తంగా రైతులు ఆందోళన చేస్తున్నా కేంద్రం పట్టించుకోవడం లేదు. ఆమరణ దీక్షలు ఈ ప్రభుత్వం దృష్టిలోకి రావడం లేదు. బలమైన రైతాంగ ఉద్యమాలే వ్యవసాయ రంగాన్ని కార్పొరేట్ పడగ నుంచి కాపాడతాయి.

## బడ్జెట్ సమావేశాలు!

(మొదటి పేజీ తరువాయి)

ఈసారి పన్ను చెల్లింపుదారులకు ఊరటనివ్వాలని కేంద్రం భావిస్తున్నట్లు సమాచారం. ఇలా చేయడం వల్ల సామాన్యుల కొనుగోలు శక్తి పెరిగి, వృద్ధికి ఊతం లభిస్తుందని ప్రభుత్వం యోచిస్తోంది. ఫలితంగా ప్రత్యక్ష పన్నులు, జిఎస్టీ వసూళ్లు పెరిగి, ఖజానాకు పెద్ద మొత్తంలో రాబడి వస్తుందని ప్రభుత్వం ఆశిస్తోంది. వేతన జీవులకు ఎలా ఊరట కల్పించాలనే అంశంపై కేంద్రం చాలా విషయాలను పరిశీలనలో ఉన్నట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. కొత్త పన్ను విధానాన్ని మరింత ఆకర్షణీయంగా మార్చడం ఇందులో ఒకటి. గతేడాది బడ్జెట్‌లో కొత్త పన్ను విధానంలో రూ.50,000గా ఉన్న స్టాండర్డ్ డిడక్షన్‌ను రూ.75,000కు కేంద్రం పెంచింది. ఈ మొత్తాన్ని మరింత పెంచడం కేంద్రం ముందున్న ఎంపికల్లో ఒకటి. ప్రస్తుతం రూ.15 లక్షల పైబడి వార్షికాదాయం పొందుతున్న వారికి 30 శాతం పన్ను వర్తిస్తోంది.

ఈ మొత్తాన్ని రూ.18 లక్షలు, రూ.20 లక్షలు పైన సంపాదిస్తున్న వారికి మాత్రమే వర్తింపజేయాలని కేంద్రం ఆలోచనగా ఉందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. కాగా, 202324 ఆర్థిక సంవత్సరంలో 8.2 శాతం వృద్ధిని నమోదు చేసిన భారత ఆర్థిక వ్యవస్థ... 202425లో 6.4 శాతం మాత్రమే వృద్ధిని నమోదు చేయొచ్చని కేంద్ర గణాంక కార్యాలయం అంచనాలను వెలువరించింది. ఆర్‌బిఐ కూడా 6.6 శాతం వృద్ధిని అంచనా వేసింది. ఈ నేపథ్యంలో 2025 బడ్జెట్‌లో వృద్ధికి ఊతమిచ్చే చర్యలు చేపట్టొచ్చన్న అంచనాలు పెరుగుతున్నాయి.

## సకాలంలో నిధులు ఖర్చు

(మొదటి పేజీ తరువాయి)

దామాషాలో నిధుల ఖర్చు జరిగిందా? లేదా? అందుకు సంబంధించిన సంపూర్ణ సమాచారం అందించాలని అధికారులను డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క ఆదేశించారు. అమలుకు సంబంధించి గత ఎనిమిది సంవత్సరాలుగా క్షేత్రస్థాయిలో వివిధ శాఖల్లో అధ్యయనం చేసిన సెస్ నివేదికను సమావేశంలో సంబంధిత అధికారులు ప్రదర్శించారు. సెస్ అధికారులు పరిశీలించిన అంశాలు, ఆ అంశాల విషయాల్లో అధికారులు సాధించిన ఫలితాలను డిప్యూటీ సిఎం ఆరా తీశారు. ఇకనుంచి సెస్ అధికారులు తమ నివేదికలను ఫైనాన్స్, ప్లానింగ్ శాఖ అధికారులకు అందజేసి వారితో తరచూ సమావేశం కావాలని సెస్ అధికారులను ఆదేశించారు. అటవీ భూముల్లో సోలార్ పవర్ ద్వారా మోటార్లు వినియోగించడం. వివిధ భూముల్లో వెదురు, అవకాడో, పామాయిల్ వంటి వాటితోపాటు అంతర పంటల సాగు ప్రాజెక్టులు డిజైన్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఉపాధి హామీ పథకం పనులను అనుసంధానం చేసుకోవాలని డిప్యూటీ సిఎం సూచించారు. ఈ ప్రయత్నం ద్వారా అడవులను సంరక్షించడంతో పాటు ఆదివాసి, గిరిజన రైతులకు ఆదాయాలు పెరుగుతాయని తెలిపారు. మూసీ పునరుజ్జీవనం కార్యక్రమంలో నిర్వాసితులవుతున్న ఎస్‌సి, ఎస్‌టి మహిళలను గుర్తించి స్వయం సహాయక సంఘ సభ్యులుగా చేర్పించి వారికి వడ్డీలేని రుణాలు అందించి వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. పట్టణ ప్రాంతాల్లో ఎస్‌సి, ఎస్‌టి స్వయం ఉపాధి పథకాలు విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీలు, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రవాణా వాహనాలు, క్లీనింగ్ యంత్రాలు వివిధ వర్గాలకు అందించాలని సూచించారు. ఇందిర జల ప్రభ, మరమ్మతులకు గురైన ఎత్తిపోతల పథకాలను పునరుద్ధరించి ఎస్‌సి, ఎస్‌టి రైతులకు ఆర్థిక చేయూతను అందించాలని డిప్యూటీ సిఎం అధికారులను ఆదేశించారు.

ఆర్థిక సంవత్సరంలో సబ్ ప్లాన్ చట్టం ప్రకారం నిధులు ఖర్చు చేసేందుకు వివిధ శాఖల ప్రిన్సిపల్ సెక్రెటరీలతో ఎస్‌సి, ఎస్‌టి శాఖల ప్రిన్సిపల్ సెక్రటరీలు సమావేశమై ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీలు రామకృష్ణారావు, వికాస్‌రాజ్, మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ దానకిషోర్, ఎస్‌సి సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, ఎస్‌టి సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శరత్, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, పంచాయతీరాజ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన కందులు తెచ్చి
# మద్దతు ధర పొందాలి



బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్

**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** రైతులు నాణ్యమైన కందులను తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సూచించారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో కందుల కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ మనుచౌదరితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కందులకు మద్దతు ధర రూ.7550 నిర్ణయించిందని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయించి లబ్ధిపొందాలన్నారు. గతంలో వడ్లు, పత్తి, సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రాలను సమర్థవంతంగా నిర్వయించినట్లు తెలిపారు. వడ్లు కొనుగోలు చేసిన 48 గంటల్లోనే డబ్బులను రైతుల ఖాతాలో జమచేసినట్లు తెలిపారు. సన్నవడ్లకు 500 రూపాయలు బోనస్ ఇచ్చినట్లు తెలిపారు. జనవరి 26 నుండి వ్యవసాయ యోగ్యమైన భూములకు రైతుభరోసా ఇస్తున్నట్లు తెలిపారు. రైతు భరోసాను 10 వేల నుండి 12 వేల రూపాయలకు పెంచినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వే జరుగుతుందని, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపు పారదర్శకంగా జరుగుతుందన్నారు. నియోజక వర్గానికి 3500 ఇళ్లు కేటాయించనున్నట్లు తెలిపారు. గత 10 సంవత్సరాలుగా రేషన్‌కార్డులు లేవన్నారు. కొత్తగా రేషన్‌కార్డులను అర్హులకు పంపిణీ చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. పేర్లు మార్పిడి చేసుకోవాలనుకునేవారు చేసుకోవచ్చునన్నారు. రేషన్‌కార్డులను ఎవరికి తొలగించమని, అర్హులకు మాత్రం కొత్తగా జారీ చేస్తామన్నారు. 2 లక్షల వరకు రుణమాఫీ చేశామని, సాంకేతిక కారణాలతో మిగిలిపోయిన వారికి సైతం రుణమాఫీ చేస్తామన్నారు. త్వరలోనే రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఇక్కడ పర్యటించి ఆయిల్‌ఫామ్‌పై రైతులకు అవగాహన కల్పిస్తారన్నారు. అన్ని వర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ సర్కార్ కట్టుబడి ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మనుచౌదరి, అసిస్టెంట్ కలెక్టర్ అబ్దుల్ హమీద్, ఆర్డీఓ సదానందం, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ లింగమూర్తి, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, మార్కెట్ కమిటీ కార్యదర్శి వెంకటయ్య, కాంగ్రెస్ నాయకులు తాడూరి శ్రీనివాస్‌గౌడ్, అత్తుఇమామ్, నాయిని నర్సింహారెడ్డి, తిరుపతిరెడ్డి, జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు

### పారదర్శకంగా గ్రామసభల్లో ఇందిరమ్మ లబ్ధిదారుల జాబితాలు : మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణం నిరంతర ప్రక్రియ అని, అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లను నిర్మించి ఇచ్చే బాధ్యత ఈ ప్రభుత్వానిదేనని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. మొదటి విడతలో ఇళ స్థలం ఉన్నవారికి, రెండవ విడతలో ఇంటి స్థలంతో పాటు ఇందిరమ్మ ఇల్లును నిర్మించి ఇస్తామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు గ్రామాలలో రెవెన్యూ వ్యవస్థ, సర్వేయర్ల నియామకం తదితర అంశాలపై శుక్రవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలోని తన కార్యాలయంలో చీఫ్ సెక్రటరీ శాంతికుమారితో కలిసి సమీక్షించారు. ఈ సమావేశంలో రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, హౌసింగ్ సెక్రటరీ జ్యోతి బుద్ధ ప్రకాష్, హౌసింగ్ కార్పొరేషన్ ఎంబి వి.పి.గౌతమ్,జిహెచ్ ఎంసి కమిషనర్ ఇలంబర్తి, సిఎంఆర్‌ఓ డైరెక్టర్ మకరంద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇంజనీరింగ్ విభాగాన్ని సమకూర్చుకోవడం, ప్రతి రెవెన్యూ గ్రామానికి రెవెన్యూ అధికారి నియామకం, సర్వేయర్ల నియామకం తదితర అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్లకు అర్హులైన లబ్దిదారులకు సంబంధించిన ఇంటి స్థలం ఉన్నవారి జాబితతోపాటు, నివాస స్థలం లేని వారి జాబితాను గ్రామసభల్లో పెట్టాలని అధికారులకు సూచించారు. అర్హులైన వారందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి ఇవ్వనున్నామని, తెలిపారు. ప్రస్తుతం హౌసింగ్ కార్పొరేషన్‌లో 274 మంది ఇంజనీర్లు మాత్రమే ఉన్నారని రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, పర్యవేక్షణకు మరో 400 మంది ఇంజనీర్లు అవసరమని ఈ సందర్భంగా అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. ఇతర ప్రభుత్వ విభాగాలలో ఇంజనీరింగ్ సిబ్బంది సేవలను ఏ విధంగా ఉపయోగించుకోవచ్చో పరిశీలించాలని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి సూచించారు.గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని అధికారులకు సూచించారు. విలేజీ రెవెన్యూ వ్యవస్థకు సంబంధించి ప్రతి రెవెన్యూ గ్రామానికి ఒక రెవెన్యూ అధికారిని నియమిస్తామని ఇందుకోసం విఆర్‌ఓ, విఆర్‌ఎ నుంచి అర్హులైన వారిని ఎంపిక చేసి ప్రత్యేకంగా పరీక్ష నిర్వహించాలని, ఈ పరీక్షకు సంబంధించిన విధి విధానాలను తక్షణమే రూపొందించి పరీక్ష నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ప్రస్తుతం 450 మంది సర్వేయర్లు ఉన్నారని అదనంగా మరో 1000 మంది సర్వేయర్లు అవసరమున్న నేపథ్యంలో సర్వేయర్ల ఎంపికకు సంబంధించి పూర్తి పాదర్శకంగా ఉండేలా ప్రణాళిక సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు.

## కుష్టు వ్యాధి సర్వే పకడ్బందీగా నిర్వహించాలి : డాక్టర్ పద్మావతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 20 తేదీ నుంచి ఫిబ్రవరి 2 వరకు కుష్టు వ్యాధి నిర్ధారణ లెప్రసి కేస్ డిటెక్షన్ క్యాంపైన్ (ఎల్‌సిడిసి) ఇంటింటి సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ప్రజా ఆరోగ్య, కుటుంబ సంక్షేమం సంచాలకులు డాక్టర్ కె.పద్మావతి సంబంధింత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ఏరియా, గిరిజన ప్రాంతాలు, గ్రామీణ ప్రాంతాలు అని తేడా లేకుండా ప్రతి ఒక్కరిని ఆశా, ఎఎన్‌ఎం పరీక్షించి అనుమానిత కేసులను పరీక్ష నిమిత్తం దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి వద్దకు పంపించాలని సూచించారు. శరీరంపై స్పర్శ లేని రంగు మారిన మచ్చలు , కళ్ళు, కాళ్ళు చేతులు అంగ వైకల్యం ఉన్నచో ఆశా, ఎఎన్‌ఎం దగ్గరలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి రెఫర్ చేసి వైద్య అధికారి నిర్ధారణ తర్వాత ఎండిటి మందులు ఉచితంగా ఇస్తారని తెలిపారు. మొదటి మచ్చ రూపంలో ముందుగా గుర్తించగలిగితే కుష్టు వ్యాధి పూర్తిగా నయం అవడమే కాకుండా, అంగవైకల్యం రాకుండా అరికట్టవచ్చే విషయాన్ని కరపత్రాల ద్వారా ప్రతి ఇంటికి చేరేలా, అలాగే ప్రధాన కూడళ్ల వద్ద బ్యానర్లను ప్రదర్శించే విధంగా ఏర్పాటు చేసి ప్రజల్లో అవగాహన కల్పించాలని డాక్టర్ కె.పద్మావతి అధికారులకు సూచించారు.

## ఇందిరమ్మ ఇళ్లకు భారీగా దరఖాస్తులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల దరఖాస్తులు పోటెత్తాయి. దీంతో ప్రజావాణి ప్రారంభమైన నాటి నుంచి రికార్డు స్థాయిలో దరఖాస్తులు అందాయి. కేవలంఇందిరమ్మ ఇళ్లకు సంబంధించే 2691 దరఖాస్తులు రాగా, మొత్తం 3053 దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 111, విద్యుత్ శాఖ 100, రెవెన్యూ పరమైన సమస్యలకు సంబంధించి 55, ఇందిరమ్మ ఇళ్ల పథకం కోసం 2691, ఇతర శాఖలకు సంబంధించి 96 దరఖాస్తులు అందినట్లు అధికారులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్.చిన్నారెడ్డి స్వయంగా దరఖాస్తులను స్వీకరించడంతో పాటు ప్రజాభవన్‌కు వచ్చిన వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.





ప్రముఖ రచయిత, అభ్యుదయ రచయితల సంఘం (అరసం) సీనియర్ నాయకులు, నవ చేతన విజ్ఞాన సమితి సంపాదకులు ఏటుకూరి ప్రసాద్‌ను నవచేతన విజ్ఞాన సమితి ఘనంగా సన్మానించింది. సిపిఐ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని 90 ఏళ్ల వయసులోనూ ఏటుకూరి ప్రసాద్ ''నూరేండ్ల నిజం పాట''ను రచించగా, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నరసింహ్ ఆలపించారు. ఈ సందర్భంగా పాట రచయిత ఏటుకూరి ప్రసాద్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో శుక్రవారం సిపిఐ జాతీయ సమితి సభ్యులు, నవచేతన విజ్ఞాన సమితి (ఎన్‌విఎస్) అధ్యక్షులు పల్లా వెంకట రెడ్డి , ఎన్‌విఎస్ కార్యదర్శి బిఎస్‌ఆర్.మోహన్ రెడ్డి, కోశాధికారి ఉజ్జిని రత్నాకర్‌రావు, జనరల్ మేనేజర్ ఎస్.మధుకర్, తెలంగాణ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ్ ఘనంగా సన్మానించారు. అదే విధంగా సిపిఐ సీనియర్ నాయకులు,

తెలంగాణ సాయుధ పోరాట యోధులు, ఉమ్మడి మెదక్ జిల్లా సిపిఐ కార్యదర్శి ఎం.కె మొహినుద్దిన్ (97 సంవత్సరాలు)ను టోలీచౌక్‌లోని ఆయన నివాసంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకటరెడ్డి, ఇటి నరసింహ, సిపిఐ సీనియర్ నాయకులు ఉజ్జిని రత్నాకర్ రావు, సంగారెడ్డి జిల్లా సిపిఐ నాయకులు వీర్ల ప్రకాష్ రావు సన్మానించారు.

# బిఎల్‌ఎస్ కోర్సుతో సులువైన సిపిఆర్

### అదనపు డిజిపి మహేష్ భగవత్



**ప్రజాపక్షం/ హైదరాబాద్:** బేసిక్ లైఫ్ సపోర్ట్ (బిఎల్‌ఎస్ )కోర్స్ ద్వారా పోలీస్ సిబ్బంది అత్యవసర సమయాల్లో ప్రజలకు సులువైన మార్గంలో సిపిఆర్ చేసి ప్రాణాలను రక్షించవచ్చని అదనపు డిజిపి మహేష్ భగవత్ అన్నారు. శుక్రవారం డిజిపి కార్యాలయంలో జరిగిన బిఎల్‌ఎస్ కోర్సు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన మహేష్ భగవత్ మాట్లాడుతూ బేసిక్ లైఫ్ సపోర్ట్ ఆరోగ్యం, అత్యవసర పరిస్థితుల నిర్వహణలో కీలకమైన అంశాలపై అవగాహన పెంపొందించడమే బిఎల్‌ఎస్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం అని సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో యశోద ఆసుపత్రి వైద్య నిపుణులు డాక్టర్ సురేష్ కుమార్, డాక్టర్ స్నేహ, డాక్టర్ సుజిత్‌ల బృందం సిపిఆర్ (కార్డియోపల్మనరీ రెససిటేషన్) చేసే విధానం, అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారు డిజిపి కార్యాలయ సిబ్బందికి వివరించారు. ఎమర్జెన్సీ పరిస్థితుల్లో మనుషులను కాపాడేందుకు అవసరమైన నైపుణ్యాలను ఈ కోర్సులో భాగంగా నేర్పించారు. సిబ్బంది ఈ బేసిక్ లైఫ్ సపోర్ట్ (బిఎల్‌ఎస్) కోర్సులో అందించిన జ్ఞానాన్ని సక్రమంగా ఆచరించాలని, అత్యవసర సమయాల్లో సిపిఆర్ వంటి మెడికల్ సాయాన్ని ఎలా అందించాలో తెలుసుకోవడం ఎంతో ముఖ్యం అని మహేష్ భగవత్ పేర్కొన్నారు. అదేవిధంగా తమ కుటుంబ సభ్యులకు కూడా ఈ నైపుణ్యాలను నేర్పించి, తక్షణ సహాయం అందించగలిగే విధంగా సన్నద్ధం కావాలని సూచించారు. ఈ విషయానికి సంబంధించిన వీడియోలు, పుస్తకాలు, ఇతర సమాచార వనరులు అందుబాటులో ఉన్నాయని, వాటిని చదివి , చూసి తమ సాంఘిక బాధ్యతగా ఇతరులకు తెలియజేయాలని ఆయన పిలుపునిచ్చారు. మన యొక్క చిన్న ప్రయత్నం ద్వారా కూడా ప్రాణాలను కాపాడగలమని, ప్రతి ఒక్కరూ ఈ విధమైన అత్యవసర వైద్య పద్ధతులపై అవగాహన కలిగి ఉండటం చాలా అవసరం అని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో ఏఐజి రమణకుమార్ డిజి పికార్యాలయ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## చరిత్రను వక్రీకరిస్తున్న బిజెపి

### కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రామ మందిరం అయోధ్యలో కట్టినప్పుడు నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని మోహన్ భగవత్ అంటుండని, మహాత్మగాంధీ, భగత్‌సింగ్, వల్లబాయ్ పటేల్ లాంటివారు స్వాతంత్ర్యాన్ని తేస్తే బిజెపి వాళ్ల చరిత్రను వక్రీకరిస్తుందని కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు అన్నారు. గాంధీ భవన్‌లో శుక్రవారం ఆయన పార్టీ నాయకురాలు ఇందిరా శోభన్‌తో కలిసి మాట్లాడారు. అమిత్ షా నిండు సభలో డాక్ట ర్ బి.ఆర్.అంబేడ్కర్‌ను అవమానించాడని, ప్రస్తు తం భారతదేశాన్ని ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భగవత్ అవమానిస్తుందని విమర్శించారు. 1947లో స్వాతంత్ర్యం వస్తే, రామ మందిరం అయోధ్యలో కట్టినప్పుడు నిజమైన స్వాతంత్ర్యం వచ్చిందని మోహన్ భగవత్ వ్యాఖ్యానించడం దేశ స్వాతంత్ర్యాన్ని అవమానించడమే అన్నారు. వాళ్లలో ఇంకా మార్పు రాలేదన్నారు. వాళ్లు తప్పు చేస్తే రాహుల్ గాంధీ ప్రశ్నిస్తున్నాడని, భారతదేశాన్ని అవమానిస్తారా? అని రాహుల్ అంటే వక్రీకరిస్తున్నారని మండిపడ్డారు. సిఎం రేవంత్ రెడ్డి ఆరు గ్యారంటీలపై ఢిల్లీలో మాట్లాడారని, కెటిఆర్‌కు దమ్ముంటే ఢిల్లీలో మాట్లాడాలన్నారు. ఆయన శాంతియుతంగా ధర్నా చేస్తే ఆరోగ్యం బాగుటుందన్నారు. పవర్‌లో ఉన్నప్పుడు ధర్నా చౌక్ గుర్తుకు రాలేదన్నారు. తాము కాపాడిన ధర్నా చౌక్‌లో కెటిఆర్ రోజు ధర్నా చేసినా తమకు అభ్యంతరం లేదన్నారు.

## కెటిఆర్ స్కాములన్నీ త్వరలో బయటపడతాయ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ మంత్రి కె.తారకరామారావు చేసిన స్కాములన్నీ త్వరలోనే బయటకు రానున్నాయని కాంగ్రెస్ ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. బిఆర్‌ఎస్ హయాంలో పనికిరాని రాజకీయాలతో పనికిమాలిన పరిపాలన చేశారని ఆయన ఆరోపించారు. అధికారం కోల్పోవడంతో కెటిఆర్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని, ఆయన పిచ్చాసుపత్రికి వెళ్లడం ఖాయమన్నారు. 2014, 2018 బిఆర్‌ఎస్ ఎన్నికల ప్రణాళికలో పొందుపర్చిన హామీలో కనీసం 20 శాతం కూడా అమలు చేయలేదని, పదేళ్ల పరిపాలనలో వారు రైతుల కోసం రూ.84 వేల కోట్లు ఖర్చు చేస్తే అదే కాంగ్రెస్ ఏడాది కాలంలోనే రూ. 50 వేల కోట్లకు పైగా ఖర్చు చేసిందన్నారు. రైతుబంధు పేరుతో రోడ్లు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, గుట్టలకు దోచి పెట్టడమే కాకుండా హెచ్‌ఎండిఎ నిధులను మిత్రుల కోసం కెటిఆర్ ఖర్చు చేశారని కిరణ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. తెలంగాణను ఇచ్చింది యుపిఎ ప్రభుత్వమని, కెటిఆర్ కుటుంబమంతా ఢిల్లీ వెళ్ళి కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ కాళ్లు మొక్కిన ఫోటోలు ఇంకా ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. ఇదంతా మర్చిపోయిన కెటిఆర్ యువరాజుగా, కెసిఆర్ రాజుగా నియంతలా వ్యవహరిస్తూ రాష్ట్రాన్ని పూర్తిగా అప్పుల ఊబిలోకి నెట్టారని కిరణ్‌కుమార్‌రెడ్డి ధ్వజమెత్తారు. తమ ప్రభుత్వం ఇచ్చిన ప్రతి హామీని ఖచ్చితంగా నేరవేర్చి తీరుతుందని, లేకపోతే ప్రజలే మాకు బుద్ధి చెబుతారని, ప్రతిపక్షపార్టీ నాయకులు వాస్తవాలు మాట్లాడాలని ఆయన హితవు పలికారు.

### నేడు ఎసిబి విచారణకు హాజరు కానున్న
## గ్రీన్ కో కంపెనీ సిఇఒ



**ప్రజాపక్షం/ హైదరాబాద్ :** ఫార్ములా ఈ కార్ రేస్ కేసులో సోమవారం ఎసిబి విచారణకు గ్రీన్‌కో కంపెనీ సిఈఓ కొల్లి మహేష్ అలియాస్ చిట్టి నాయుడు హాజరు కానున్నారు. ఇప్పటికే ఈ కేసులో టిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్, ఐఎఎస్ అధికారి అరవింద్ కుమార్, హెచ్‌ఎండిఎ మాజీ చీఫ్ ఇంజనీర్ బిఎల్‌ఎన్ రెడ్డిలను ఎసిబి విచారించిన విషయం తెలిసిందే. వారం రోజుల క్రితం ఎసిబి అధికారులు మాదాపూర్‌లోని గ్రీన్ కో సంస్థలతో పాటు మచిలీపట్నంలో ఉన్న దాని అనుబంధ సంస్థలపై కూడా సోదాలు నిర్వహించి, కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలోనే ఈనెల 15న విచారణకు హాజరు కావాలని ఎసిబి అధికారులు సిఈఓ కొల్లి మహేష్‌కు నోటీసులు జారీ చేశారు. అయితే తాను 18వ తేదీన హాజరవుతానని గ్రీన్ కో సంస్థ సిఈఓ ఎసిబి అధికారులకు తెలిపారు. దీంతో శనివారం జరగాల్సిన విచారణ సోమవారానికి వాయిదా పడింది. ఫార్ములా ఈ కార్ రేస్‌పై గ్రీన్ కో సంస్థ చేసుకున్న ఒప్పంద పత్రాలను కూడా తీసుకురావాలని ఎసిబి అధికారులు ఆ సంస్థ సిఈఓకు తెలిపినట్లు సమాచారం. ఒప్పందంలో ఉన్న అంశాలపై అతన్ని మరింత లోతుగా విచారించనున్నారు. గ్రీన్ కో సంస్థ ఇచ్చే వాంగ్మూలమే ఈ కేసులో కీలకంగా మారనుందని తెలుస్తోంది.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
కూకట్‌పల్లి సర్కిల్-24

Lr No: 30/GHMC/KPC-24/EE/2024-25, తేది: 17.01.2025

NIT No. 30/GHMC/KPC-24/EE/2024-25, తేది: 17.01.2025, **పని పేరు:** అభివృద్ధి పనులు, **అంచనా విలువ / ఇసివి:** 115.90, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 18.01.2025న ఉ.11.30గం.ల నుండి 25.01.2025న ఉ.11.30గం.ల వరకు, **అధికారి పేరు & చిరునామా:** శ్రీ డి.గోవర్ధన్ గౌడ్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, జిహెచ్‌ఎంసి, కూకట్‌పల్లి సర్కిల్-24, సెల్: 9154299633. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://tender.telangana.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, కూకట్‌పల్లి సర్కిల్-24, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 9177-PP/CL/ADVT/1/2024-25, Date: 17-01-2025


# రుణమాఫీ పూర్తిగా చేస్తే రాజకీయ సన్యాసం



రైతు నిరసన దీక్షలో పాల్గొన్న కెటిఆర్

**ప్రజాపక్షం/షాబాద్ :** ఢిల్లీలో ఉద్దేర మాటలు మాట్లాడకుండా తెలంగాణలో ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసెడెంట్ తారక రామరావు అన్నారు. శుక్రవారం షాబాద్ రైతు నిరసన దీక్షకు వస్తున్న క్రమంలో చేవెళ్ల మండల పరిధిలోని ముడిమ్యాల్ స్టేజి దగ్గర బిఆర్‌ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికి 200 మంది వరకు పార్టీలో చేరారు. అక్కడ నుండి బయలుదేరిన కెటిఆర్ షాబాద్ మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో రైతు నిరసన దీక్షలో పాల్గొన్నారు. రైతు దీక్ష కార్యక్రమానికి సభ అధ్యక్షతన మాజీ జడ్‌పిటిసి పట్నం అవినాష్ రెడ్డి, బిఆర్‌ఎస్ యువ నాయకులు కార్తీక్ రెడ్డి ఆధ్వర్యంలో రైతు దీక్ష కార్యక్రమం నిర్వహించారు. అనంతరం షాబాద్ జాతీయ రహదారిపై ధర్నా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కెటిఆర్ మాట్లాడుతూ.. రైతులకు పూర్తిగా రుణమాఫీ చేసినట్లు నిరూపిస్తే బిఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేసి రాజకీయ సన్యాసం తీసుకుంటామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సవాల్ చేశారు. ఎన్నికల ముందు రైతులకు రైతు పెట్టుబడిని ఆపేసి ఇప్పటి వరకు రైతుల ఖాతాలో పెట్టుబడి డబ్బులు జమ చేయలేదని విమర్శించారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా నిరుపేదలను మోసం చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జైలుకు పంపాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ప్రతి సంవత్సరం వచ్చే పంట రుణాలు, రైతు భీమా అనేక పథకాలను ఆపేసి ఇష్టానుసారంగా పరిపాలన కొనసాగిస్తున్నాడని పేర్కొన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఓట్ల కోసం వచ్చినప్పుడు తెలంగాణ రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేసిన తరువాత ఓట్లు వేస్తామని తిట్టి పంపించాలని వివరించారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం హయాంలో 44 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ రెడీ చేస్తే కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 44 వేల ఉద్యోగాలను నిరుద్యోగులకు ఇచ్చాడు. బిఆర్‌ఎస్ పాలనలో చేసిన పథకాలను అమలు చేస్తు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందని గొప్పలు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఉచిత బస్సు ప్రయాణంతో మహిళలకు గౌరవం లేకుండా పోయిందని బస్సు స్టేజీ దగ్గర బస్సు డ్రైవర్లు బస్సులు నిలపడం లేదని కొందరు మహిళలు కెటిఆర్‌కు వివరించారు. దీంతో కెటిఆర్ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కంటే వడ్డీలేని రుణాలు అందిస్తే మంచిదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రులు మహముద్ అలీ, సబితా ఇంద్రా రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్, క్యామ మల్లేష్, నాగేందర్ గౌడ్, స్వప్న, మహేశ్వర్ రెడ్డి, శంభీపూర్ రాజు, షాబాద్ మండల పార్టీ అధ్యక్షుడు నర్సింగ్‌రావు, నాయకులు నక్క శ్రీనివాస్ గౌడ్, వెంకటయ్య, ఈదుల నర్సింలు గౌడ్ పార్టీ నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.


**దక్షిణ మధ్య రైల్వే**
Follow us on @SCRailwayindia దక్షిణ మధ్య రైల్వే టెండర్ నోటీస్ వివరాలను మా వెబ్‌సైట్ www. scr.indianrailways.gov.inలో చూడగలరు.

PUB/0052

**నమూనా 10-01**
**బహిరంగ ప్రకటన**

దక్షిణమధ్య రైల్వేలో గుర్తించబడిన సెక్షన్లలోని పూర్తి విభాగంలో ఉన్న రైల్వే లైన్లు మరియు ప్రాంగణాల వినియోగదారులు అందరికీ తెలియజేయునది ఏమనగా..25000 వోల్ట్స్, 50హెర్ట్జ్,, ఏసి ఓవర్‌హెడ్ ట్రాక్షన్ వైర్లు నిర్దేశిత సెక్షన్‌లో ప్రకటించిన తేదీ లేదా ఆ తర్వాత శక్తివంతం చేయబడతాయి. అదే తేదీనుంచి ఓవర్‌హెడ్ ట్రాన్సాక్షన్ లైన్ అన్ని సమయాలలో లైవ్‌గా పరిగణించబడుతుంది మరియు ఎలాంటి అనధికారిక వ్యక్తి చెప్పబడిన ఓవర్ హెడ్‌లైన్‌కు సమీపంలో ఉండరాదు మరియు పనిచేయకూడదు.

| విభాగం | తేది |
|---|---|
| సికింద్రాబాద్ డివిజన్ పరిధిలోని కాజీపేట నుండి విజయవాడ సెక్షన్ పరిధిలోని డోర్నకల్ జంక్షన్ నుండి గార్ల జంక్షన్ మధ్యలో గల OHE మాస్ట్ లొకేషన్ 459/11 & 12 (కి.మీ / చ : 459 /378.28) నుండి 460/11 కి.మీ /చ : 460 / 330.00) & 460/12 (కి.మీ/చ 460/339.00) వరకు గతంలో మళ్లించిన లైన్లు శాశ్వత పునరుద్ధరణ యొక్క విద్యుద్దీకరణకు. | 17.01.2025 |

**నమూనా 10-02**
**ప్రతిపాదిత ఏసి 25కెవి ట్రాక్షన్ రోడ్డు వినియోగదారులకు హెచ్చరిక**

OHE మాస్ట్ లొకేషన్ 459/11 & 12 (కి.మీ / చ : 459 /378.28) నుండి 460/11 కి.మీ /చ : 460 / 330.00) & 460/12 (కి.మీ/చ 460/339.00)వరకుడోర్నకల్ జంక్షన్ మరియు గార్ల స్టేషన్ల మధ్య ఇంతకుముందు మళ్లించిన లైన్ల శాశ్వత పునరుద్ధరణపై 25కెవి ఎలక్ట్రిక్ ట్రాక్షన్‌ను ప్రవేశపెట్టడానికి సంబంధించి ప్రజల సమాచారం కోసం తెలియజేయబడింది. దక్షిణ మధ్య రైల్వేలోని కాజీపేట/విజయవాడ సెక్షన్లలో అన్ని లెవల్ క్రాసింగ్‌ల వద్ద లోడ్లను నివారించడానికి రహదారి స్థాయికి పైభాగాన 4.78మీటర్ల స్పష్టమైన గరిష్ట ఎత్తుతో, ఎత్తైన గేజ్‌లు ఏర్పాటు చేయబడ్డాయి. లైవ్ ట్రాక్షన్ వైర్‌కు సమీపంలో లేక ప్రమాదకర సామీప్యత నుండి అధిక ఎత్తులో ఉంచబడింది.
వాహనాలను లోడ్ చేయడం కోసం పైన పేర్కొన్న ఎత్తును గమనించాలని మరియు రోడ్డు వాహనాలలో మోసుకెళ్లే లోడ్లు ఎట్టిపరిస్థితులలోనూ ఎత్తు గేజ్‌లను ఉల్లంఘించకుండా చూడాలని ప్రజలకు ఇందుమూలంగా తెలియజేయడమైంది.
అధిక ఎత్తు యొక్క లోడ్ యొక్క ప్రమాదాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి :
i) హైట్ గేజ్‌కు ప్రమాదం మరియు తత్ఫలితంగా రహదారికి అలాగే రైల్వేలైన్‌కు ఆటంకం కలుగవచ్చు.
ii) తీసుకెళ్లే పదార్థాలు లేదా సామాగ్రికి లేదా వాహనానికే ప్రమాదం సంభవించవచ్చు.
iii)కండక్టర్లతో సమీపించినప్పుడు లేదా ప్రమాదకరమై సామీప్యత కారణంగా అగ్నిప్రమాదం లేదా ప్రాణహాని కలుగవచ్చు.
తేదీ : 17.01.2025
A0066 సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ /టిఆర్‌డి / సికింద్రాబాద్ .



**శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానము**
గూడెం గ్రామము, దండేపల్లి మండలము, మంచిర్యాల జిల్లా.

Rc.No.SSSD/01/2025 **సీల్డ్ కొటేషన్స్ టెండర్ ప్రకటన** తేది: 16.01.2025

ఇందుమూలముగా యావన్మందికి మరియు వ్యాపారస్తులకు తెలియజేయునది ఏమనగా! మంచిర్యాల జిల్లా దండేపల్లి మం॥, గూడెం గ్రామము యందలి శ్రీ సత్యనారాయణ స్వామి దేవస్థానము నందు **కళ్యాణ, బ్రహ్మోత్సవములు-2025** సందర్భముగా భక్తుల సౌకర్యార్థం ఈ క్రింద తెలిపిన వాటికి కొటేషన్స్ కోరబడుచున్నవి. తేది: 18.01.2025 నుండి తేది: 23.01.2025 వరకు షెడ్యుల్స్ ఇవ్వబడును. అసక్తిగల వారు అప్లికేషన్‌తో పాటు ఆధార్ జిరాక్స్ మరియు ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, శ్రీ సత్యనారాయణస్వామి దేవస్థానము పేరున రూ. 5000/- బ్యాంక్ డి.డి. తీసి, షెడ్యుల్ ధర రూ.100/- లు చెల్లించి తీసుకోగలరు. పూర్తి చేసిన షెడ్యూల్‌ను **తేది: 24.01.2025 రోజున ఉదయం 11 గంటలకు కార్యాలయములో ఏర్పాటు చేసిన టెండర్ బాక్స్ నందు వేయగలరు.** అదే రోజు మధ్యహ్నం 2 గంటలకు హాజరు సభ్యులు మరియు అధికారుల సమక్షంలో టెండర్ షెడ్యూల్స్‌ను విప్పబడును. టెండర్ బాక్స్‌నందు వేయగలరు. **1. కళ్యాణ వేదిక & దేవాలయము ఇతర చోట్ల పూల దండలతో అలంకరణ, 2. విద్యుత్ దీపాలంకరణ లైటింగ్ & సౌండ్ సిస్టం ఏర్పాటు, 3. కళ్యాణ వేదిక, అన్నదానం & దేవాలయములకు ఇతర చోట్ల గ్రీన్ మ్యాట్స్, వంట పాత్రలు సప్లయ్, 4.కలర్స్, సున్నం సప్లయ్ చేయుట, 5. కలర్స్, సున్నం వేయుటకు లేబర్ చార్జిలు, 6. కళ్యాణోత్సవము రోజున LED స్క్రీన్స్ ఏర్పాటు చేసి, ఫోటోలు & వీడియో తీయుట** ఇతర వివరములకు కార్యాలయము నందు సంప్రదించగలరు.

DIPR R.O. No. : 9168-PP/CL/ADVT/1/2024-25, Date: 17-01-2025 సం/- కార్యనిర్వహణాధికారి



తెలంగాణ ప్రభుత్వం
**అటవీ శాఖ, జిల్లా అటవీ అధికారి కార్యాలయం, పెద్దపల్లి.**

Rc No: 70/S4/2025 షార్ట్ టెండర్ ప్రకటన తేది: 17.01.2025

2024-25 సంవత్సరానికిగాను పెద్దపల్లి జిల్లాలో అవెన్యూ తోటల కోసం ఒక్కొక్కటి ఆకుపచ్చ రంగుగల 6.50 మి.మీ. జాయింట్ మందం, 1200 మి.మీ. వెడల్పు, 1830 మి.మీ. పొడవు మరియు 1.5 కిలోల బరువు నమూనాలతో స్వీయ సహాయక హెచ్‌డిపిఇ ప్లాస్టిక్ ట్రీ గార్డులు (అవసరం ప్రకారం) సరఫరా కోసం తయారీ సంస్థలు / సంస్థలు మరియు వ్యక్తుల నుండి వ్యక్తిగత సీల్డ్‌కొటేషన్లు ఆహ్వానించడమైనవి. 1. టెండర్ పత్రాలు మరియు షరతులతో కూడిన పనుల వివరాలను డిఎఫ్ఒ, పెద్దపల్లి నుండి ఏ పని దినం నాడు అయినా, **తేదీ: 18.01.2025 నుండి తేదీ: 22.01.2025 వరకు మధ్యాహ్నం 2:00 గంటల వరకు, ప్రతి షెడ్యూల్‌కు రూ. 1000/-** చొప్పున పొందవచ్చు. 2. టెండర్ ఫారములు, ఇఎండి **రూ.50,000/- తో సహా డిడి రూపంలో స్వీకరించడానికి చివరి తేదీ: 22.01.2025 నుండి మధ్యాహ్నం 3.00 గంటల వరకు.** 3. సీల్డ్ కొటేషన్లు / టెండర్లను తెరిచే **తేదీ: 22.01.2025 సాయంత్రం 4.00 గంటలకు** పెద్దపల్లి జిల్లా అటవీ అధికారి కార్యాలయంలో టెండర్ కమిటీ సమక్షంలో ఉంటుంది. 4. ఇతర వివరాల కోసం దయచేసి 9381348380 నంబర్‌ను సంప్రదించండి.

**సం/- జిల్లా అటవీ అధికారి. పెద్దపల్లి జిల్లా.**

DIPR R.O. No. : 9234-PP/CL/ADVT/1/2024-25, Date: 17-01-2025

ప్రజాపక్షం
శనివారం, జనవరి 18

# గాజా యుద్ధానికి విరామం

పశ్చిమాసియాలోని గాజా ప్రాంతంపై 15 మాసాలుగా ఇజ్రాయెల్ సాగిస్తున్న యుద్ధం నిలుపుదలకు ఎట్టకేలకు హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందం జరిగింది. దీన్ని ప్రపంచ వ్యాప్తంగా శాంతికాముకులందరూ స్వాగతిస్తున్నారు. దీన్ని సాధించటానికి కృషిచేసిన వారందరూ అభినందనీయులు. అమెరికా, ఈజిప్టు, టర్కీ, కతార్ సూత్రధారులుగా మొత్తం 85 దేశాల ప్రతినిధులు ఇజ్రాయెల్–హమాస్ మధ్య చర్చలకు, అంతిమంగా ఒప్పందం సాధనకు అనేక మాసాలుగా కృషి చేస్తున్నారు. అయితే అంతిమంగా ఈ ఘనత అమెరికా 47వ అధ్యక్షునిగా ఈనెల 20న పదవీబాధ్యతలు స్వీకరించబోతున్న పచ్చి మితవాది డోనాల్డ్ ట్రంప్ ఖాతాలోకి వెళ్లింది. గత 15మాసాల్లో జో బైడెన్ ప్రభుత్వం సాధించలేనిదాన్ని ట్రంప్ నవంబర్ 4 ఎన్నికల్లో విజేత అయిన తదుపరి కొద్ది వారాల్లోనే సాధించారు. తాను పదవీ ప్రమాణం చేసేలోపు కాల్పుల విరమణ జరగకపోతే తీవ్ర పర్యవసానాలుంటాయని – ముఖ్యంగా అమెరికా మద్దతును ఇజ్రాయెల్ కోల్పోతుందన్న ట్రంప్ హెచ్చరిక పనిచేసింది. పాలస్తీనియన్‌ల నరమేధాన్ని కొనసాగించి గాజాను మొత్తంగా స్వాధీనం చేసుకోవాలని కోరుకుంటున్న ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుపై తీవ్రమైన ఒత్తిడి చేయాల్సి వచ్చింది. ట్రంప్ సలహాదారులు గత వారం రోజుల్లో నెతన్యాహు మెడలు వంచేందుకు కృషి చేశారు. మధ్య ప్రాచ్యానికి ట్రంప్ ప్రత్యేక దూత స్టీవ్ విట్‌కోఫ్ గత శుక్రవారంనాడు దోహనుంచి నెతన్యాహుకు ఫోన్ చేసి శనివారం ఉదయం కలుస్తానని చెప్పారు. కొద్ది రోజుల తర్వాత రావొచ్చునని ప్రధాని కార్యాలయం చెప్పినా, తాను ఉదయాన్నే వస్తున్నానని, నెతన్యాహు సిద్ధం గా ఉండాలని విట్‌కోఫ్ తెగేసి చెప్పారట. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఈ వారంలో ఆమోదించాలని ట్రంప్ మాటగా విట్‌కోఫ్ నెతన్యాహుకు అల్టిమేటం జారీచేశారని ఇజ్రాయెల్ మీడియా రిపోర్టు చేసింది. బైడెన్ బృందం కూడా విదేశీ వ్యవహారాల కార్యదర్శి ఆంటోనీ బ్లింకెన్ నాయకత్వంలో ఈజిప్టు, టర్కీ, కతార్‌లతో ఇదే వారంలో కాల్పుల విరమణ ఒప్పందంపై చర్చలు జరుపుతున్నారు.

> 6 వారాలు కాల్పుల విరమణ కాలంలో యుద్ధాన్ని పూర్తిగా ముగించటంపై చర్చలు జరగాలి. కాల్పుల విరమణ ఒప్పందంతో యుద్ధ విస్తరణ ప్రమాదం నివారించబడింది. రెండు రాజ్యాల – ఇజ్రాయెల్, పాలస్తీనా – పరస్పర గుర్తింపు ప్రాతిపదికపై అంతిమ పరిష్కారం జరిగేవరకు ఈ సమస్య రావణాసుర కాష్టంలా రగులుతూనే ఉంటుంది.

గాజాను పరిపాలిస్తున్న పాలస్తీనియన్ తీవ్రవాద సంస్థ హమాస్ 2023 అక్టోబర్ 7 వ తేదీన ఇజ్రాయెల్‌పై ఆకస్మిక దాడిచేసి 251మంది ఇజ్రాయెలీలను బందీలుగా తీసుకెళ్లింది. ప్రస్తుత రౌండ్ యుద్ధానికి ఆ ఘటన ఆజ్యం పోసింది. ఈ 15మాసాల యుద్ధం అనేది దాదాపు ఏకపక్షమే. ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు హమాస్ స్థావరాలు లక్ష్యంగా నిత్యం బాంబులు వేస్తూ నివాస ప్రాంతాలు, స్కూళ్లు, ఆసుపత్రులు ధ్వంసం చేశాయి. లక్షలాదిమంది నగరం విడిచి వెళ్లిపోయారు. దరిమిలా 48589మంది పాలస్తీనియన్‌లు హతులైనారు. మహిళలు, పిల్లలు వారిలో అత్యధికులు. గాజాకు ఐరాస, రెడ్‌క్రాస్ ఆహార సహాయాన్ని, ఔషధాలను అడ్డుకున్న ఇజ్రాయెల్, ప్రాణాలతో ఉన్నవారిని అమానుషంగా ఆకలిదప్పులకు గురిచేసింది. మరోవైపు చర్చల పర్యవసానంగా దఫదఫాలుగా అనేకమంది బందీలు విడుదల జరిగింది; పలువురు ఇజ్రాయెల్ బాంబుదాడుల్లో చనిపోయారు. ఇంకా 60మంది ఇజ్రాయిలీలు హమాస్ బందీలుగా ఉన్నట్లు అంచనా. 1000మందికి పైగా పాలస్తీనియన్‌లు ఇజ్రాయెలీ జైళ్లలో మగ్గుతున్నారు. తాజా కాల్పుల విరమణ ఒప్పందం ప్రకారం ఆరువారాల్లో మూడు అంచెలుగా ఒప్పందం అమలు కావాలి. తొలిదశ ముగిసేసరికి పౌరబందీలందరూ విడుదల చేయబడాలి. వారిలో ఇజ్రాయెలీ లు 33మంది, పాలస్తీనియన్‌లు 50మంది ఉన్నారు. 6 వారాలు కాల్పుల విరమణ కాలంలో యుద్ధాన్ని పూర్తిగా ముగించటంపై చర్చలు జరగాలి. కాల్పుల విరమణ ఒప్పందంతో యుద్ధ విస్తరణ ప్రమాదం నివారించబడింది. రెండు రాజ్యాలు – ఇజ్రాయెల్, పాలస్తీనా – పరస్పర గుర్తింపు ప్రాతిపదికపై అంతిమ పరిష్కారం జరిగేవరకు ఈ సమస్య రావణాసుర కాష్టంలా రగులుతూనే ఉంటుంది. ఇజ్రాయెల్‌తో సహజీవనానికి అత్యధిక అరబ్ రాజ్యాలు ఇప్పుడు సుముఖంగా ఉన్నాయి.

ఇక, రష్యా–ఉక్రేన్ యుద్ధం ముగియాల్సి ఉంది. అయితే ఉక్రేన్‌ను పావుగా వాడుకుంటూ రష్యాను ఆర్థికంగా, సైనికంగా కృంగదీయటమనే విస్తృత ధ్యేయంతో అమెరికా, నాటోలు ఉక్రేన్‌కు అండగా నిలిచినందున దీని పరిష్కారం జటిలమైంది. ఉక్రేన్ యుద్ధం ముగింపు తన ప్రాధాన్యత అని, రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను తాను కలుస్తానని డోనాల్డ్ ట్రంప్ ప్రకటించి ఉన్నారు. ట్రంప్‌తో చర్చలకు రష్యా సుముఖత వ్యక్తం చేసింది. కాబట్టి ఈ యుద్ధం కూడా ముగుస్తుందని ప్రపంచం ఆశిస్తోంది. దేశంలో పచ్చి మితవాద విధానాలు అమలు జరిపే ట్రంప్, బయట సంఘర్షణల ముగింపును కోరుకోవటం అమెరికాకే కాదు, ప్రపంచానికీ ఆసక్తిదాయకం.

# ప్రపంచ ఆర్థిక వేదికకు ట్రంప్ ఎజెండా


నిత్యా చక్రవర్తి

అమెరికా అధ్యక్షుడుగా డోనాల్డ్ ట్రంప్ ప్రమాణ స్వీకారం చేస్తున్న జనవరి 20వ తేదీనాడే ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యుఇఎఫ్)55వ సమావేశాలు కూడా ప్రారంభం అవుతున్నాయి. బహుళజాతి కంపెనీల ప్రధాన కార్యనిర్వాహక అధికారుల(సిఇఓ)లతో కూడిన ఈ ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాలు ప్రతి ఏడాదీ జనవరి మూడోవారంలో స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతాయి. సాంకేతిక పరిజ్ఞానం, అభివృద్ధి వంటి అనేక ప్రపంచ సమస్యలను చర్చించే ఈ వార్షిక సమావేశాలు 2025లో మాత్రం అసాధారణ వ్యవహారాలకు ప్రత్యక్ష వేదిక కాబోతున్నాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, ఆర్థిక మార్పులు, సాంకేతిక పరిజ్ఞానంలో బ్రహ్మాండమైన పురోగతి సాధిస్తున్న ప్రపంచాన్ని రూపుదిద్దడంకోసం అత్యున్నతస్థాయీ సాంకేతికతను ఉపయోగించుకోవడానికి వీలుగా తన ఎజెండాను నిర్దేశించడానికి డోనాల్డ్ ట్రంప్ దృశ్యమాధ్యమ విధానం ద్వారా ఈ సమావేశంలోని ప్రతినిధులతో చర్చల్లో భాగస్వామ్యం కాబోతున్నారు.

విభిన్నమైన భౌగోళిక స్థితిగతులు, పారిశ్రామిక విభాగాలకు చెందిన 3,000 మంది ప్రపంచ నాయకులను ప్రపంచ ఆర్థిక వేదిక –2025 వార్షిక సమావేశాలు జనవరి 20 నుంచి 24వ తేదీ వరకూ ఐదు రోజులపాటు ఒక్కచోటకు చేరుస్తున్నాయి. ప్రపంచం ఎదుర్కొంటున్న ఉమ్మడి సవాళ్ళను చర్చించి సుస్థిరమైన పరిష్కారాలు సాధించడంలో ఉత్ప్రేరకాలుగా దోహదపడేందుకు, పరస్పర విశ్వాసాన్ని పెంపొందించుకునేందుకు సంభాషణలు నడిపించడం ఈ సమావేశాల ప్రధాన ఉద్దేశం. పేద దేశాలతోపాటు అభివృద్ధి చెందిన, పైస్థాయికి ఎదుగుతున్న ఆర్థిక వ్యవస్థలమధ్య పెరుగుతున్న అసమానతల సవాళ్ళను ఏవిధంగా ఎదుర్కోవాలన్న విషయాలపై ప్రతి సంవత్సరం ఈ ప్రపంచ ఆర్థిక వేదికపై వాడీవేడీ చర్చలు జరుగుతూ ఉంటాయి. రాబోయేకాలంలో చేపట్టాల్సిన మౌలిక విధులకు సంబంధించిన నివేదికలను ఈ వేదికద్వారా విడుదల చేస్తారు. ఐనప్పటికీ కూడా ఆచరణలో మాత్రం ఎలాంటి నిర్మాణాత్మక చర్యలూ పెద్దగా అమలు జరగడంలేదు. ప్రపంచం సాంకేతికంగా భారీఎత్తున పురోగతి సాధిస్తున్నప్పటికీ కూడా ప్రపంచంలో అసమానతలు మాత్రం మరింత ఎక్కువగా కొనసాగుతున్నాయి.

ఈ సమావేశాల ప్రారంభ దినంనాడే అమెరికా అధ్యక్షుడుగా డోనాల్ ట్రంప్ అమెరికా 48వ అధ్యక్షుడుగా ప్రమాణ స్వీకారం చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రపంచ ఆర్థిక వేదిక –2025 ఈసారి ''బుద్ధిజీవుల శకం'' అనే అంశాన్ని ఇతివృత్తంగా స్వీకరించింది. అంటే ఈ ఇతివృత్తం మేరకు 'బుద్ధిజీవులమధ్య సహకారాన్ని క్రియాశీల పద్ధతులలో ముందుకు తీసుకువెళ్ళాలి. సంక్లిష్టమైన ప్రపంచ సమస్యల పరిష్కారాలకుగాను ''ధైర్యంగా ఆలోచించి సమష్టిగా నిర్ణయాలు తీసుకుని అందరి సహకారంతో ఉమ్మడి కార్యాచరణ''చేపట్టడమే దీని అంతరార్థం. ప్రపంచవ్యాప్తంగా అన్నిదేశాల నుండీ వస్తున్న సిఇఓలతో డోనాల్డ్ ట్రంప్ సంభాషణలు జరిపి డబ్ల్యుఇఎఫ్ ఇతివృత్తంపై తన వైఖరిని వారికి వివరించి ఆధునిక సాంకేతికతను వాడుకుంటూ, అందుకు అనుగుణంగా లక్ష్యాలు సాధించడానికి ఈ వేదికను తమకు అనుకూలంగా ఉపయోగించుకుంటారని అందరూ అంచనా వేస్తున్నారు. రాబోయే అమెరికా ప్రభుత్వ కార్యకలాపాలలో అన్నివిధాలుగా చేదోడువాదోడుగా ఉండే ట్రంప్ శిష్యుడు, సహాయకుడు, టెస్లా కంపెనీ సిఇఓ ఎలాన్ మస్క్‌కు ఈ ఏడాది డబ్ల్యుఇఎఫ్ నిర్దేశించుకున్న ఇతివృత్తం ఎంతో ప్రత్యేక ప్రాధాన్యత గలది. అందరి సహకారంతో ఉమ్మడి కార్యాచరణకు బ్రహ్మాండమైన వ్యూహాన్ని రూపొందించడంలో డోనాల్‌ట్రంప్‌కు ఇప్పుడు ఎలాన్ మస్క్ అన్ని విధాలుగా సహకరిస్తున్నారు. ''అభివృద్ధి ప్రక్రియలో, పరిశ్రమలరంగంలో కృత్రిమ మేధస్సు వినియోగం'' అనేదే డబ్ల్యుఇఎఫ్ సమావేశం చర్చలలో కీలకమైన అంశం. ఈ విషయంలో ఎలాన్ మస్క్‌కు ఒక ప్రత్యేకమైన ఆసక్తి ఉంది. వీలైనంతవరకూ ఈ ఎజెండాను డోనాల్డ్ ట్రంప్ ప్రతిపాదించే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. టెస్లా సిఇఓ మస్క్ తన ఆలోచనలతో ఈ ప్రతిపాదనపై బ్రహ్మాండమైన ప్రభావం చూపించే అవకాశాలున్నాయి.

**సోషల్ మీడియా–ఆర్థిక కంపెనీలపై పట్టుకోసం ట్రంప్ తాపత్రయం**

గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్ సహా ఇతర అత్యున్నతస్థాయీ సాంకేతిక పరిజ్ఞాన కంపెనీలన్నీ దీర్ఘకాలంగా అమెరికా రాజకీయాలలో డెమోక్రటిక్‌పార్టీకే అనుకూలంగా వ్యవహరిస్తూ వస్తున్నాయి. కానీ పేరాశలు కల్పించి మభ్యపెట్టే డోనాల్డ్ ట్రంప్ సలహాదారుల విధానం కారణంగా పరిస్థితుల్లో చాలా మార్పులు సంభవించాయి. సోషల్ మీడియా సర్వీస్ ''ఫేస్‌బుక్'' సహ–వ్యవస్థాపకుడు మార్క్ ఎలియట్ జుకర్‌బెర్గ్ ఇప్పటికే పార్టీ ఫిరాయించారు. ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌లలో ఫ్యాక్ట్ చెకింగ్‌ను ఎత్తివేయడం వంటి చర్యల ద్వారా ప్రమాణ స్వీకారోత్సవానికి ముందుగానే డోనాల్డ్ ట్రంప్ శిబిరానికి జుకర్‌బెర్గ్ లొంగిపోయారు. ఇక గూగుల్ కూడా ట్రంప్ సలహాదారులు చేస్తున్న తీవ్రమైన ఒత్తిడులమధ్య నలిగిపోతున్నది. ట్రంప్ ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత గూగుల్‌పై ఈ ఒత్తిళ్ళు మరింత ఉద్ధృతంగా పెరిగిపోయే అవకాశం ఉంది. యావత్ సోషల్ మీడియా వేదికలు నడిపే కంపెనీలన్నింటితోపాటు కొత్తగా తలెత్తుతున్న ఇతర ఆర్థిక రంగ సంబంధిత కంపెనీలన్నింటిపైనా కూడా పెత్తనం చెలాయించాలని, వాటి రిమోట్ కంట్రోల్‌ను ఎలాన్ మస్క్ సహకారంతో తన చెప్పు చేతల్లో ఉంచుకోవాలని డోనాల్డ్ ట్రంప్ బలంగా కోరుకుంటున్నారు.

''ఈ ఏడాది ఆరంభంలో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాలు గతకంటే విభిన్నమైన, అద్వితీయమైన సమావేశాలు. ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలను, వ్యాపారాలనునడిపే నిర్ణయాత్మక శక్తులైన యజమానులు, పౌర సమాజ నిర్దేశకులు దాదాపుగా 3,000 మంది నాయకులను దావోస్ వేదిక ఒక్కచోటకు చేరుస్తోంది, ఎంతో లోతైన పరివర్తనకు గురవుతున్న ప్రపంచం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ఈ విధాన నిర్దేశకులంతా దావోస్ వేదిక వద్ద గుమిగూడుతున్నారు'' అని వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ వ్యవస్థాపకుడు, ట్రస్టీల బోర్డు ఛైర్మన్ క్లాస్ స్క్వాబ్ (87) అన్నారు. ''విభిన్నమైన ఆలోచనలు, విభిన్న ఆర్థిక, భౌగోళిక ప్రాంతాలనుండి వచ్చే నాయకులతోపాటు ఎన్నో అనిశ్చిత పరిస్థితులు ఈ సమావేశాలలో ఉన్నప్పటికీ, సర్వసమ్మిళితంగా అందరినీ కలుపుకుని వెళుతూ 'రాబోయే బుద్ధిజీవుల శకాన్ని మరింత సుస్థిరంగా తీర్చిదిద్దే లక్ష్యంతో సహకారం, నిర్మాణాత్మకమైన ఆశాభావ స్ఫూర్తి నింపేందుకు 2025 డబ్ల్యుఇఎఫ్ వార్షిక సమావేశాలు దోహదం చేస్తాయి'' అని క్లాస్ స్క్వాబ్ అన్నారు.




**1,600 మంది బిజినెస్ లీడర్లు హాజరు**

ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశాలకు 1,600 మందికిపైగా బిజినెస్ లీడర్లు, మరో 900 మంది ప్రపంచ అగ్రశ్రేణి కంపెనీల చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు, నవీన ఆవిష్కరణలతో ప్రపంచానికి కొత్త ఊపిరులు ఊదిన 120మంది ఆవిష్కర్తలు, సాంకేతికరంగంలో దారిదీపాలుగా చెలామణీ అవుతున్న ప్రముఖులు దావోస్‌లో ఐదురోజులపాటు మకాం వేస్తున్నారు. పౌర సమాజం, సామాజిక రంగం, కార్మిక సంఘాలు, ప్రభుత్వేతర సంస్థలు, మతసంబంధమైన, దేశీయ జాతులకు చెందిన ప్రముఖులు, నిపుణులు, ప్రపంచ ప్రముఖ విశ్వవిద్యాలయ అధిపతులు, పరిశోధనాసంస్థల అధిపతులు, బుద్ధిజీవుల బృందాలు, ప్రపంచ యువ నాయకులు, సామాజిక ఆవిష్కర్తలు, వివిధ ప్రపంచ సమస్యలకు స్థానికంగా పరిష్కారాలు చూపించే ప్రముఖులు సమావేశాలకు హాజరవుతున్నారు. ఆర్థికరంగంలో 2030 నాటికి ఏ విధంగా 17 కోట్ల (170 మిలియన్లు) కొత్త ఉద్యోగాల సృష్టించడానికి గల నూతన సాంకేతిక విజ్ఞానం, ప్రపంచ తీరుతెన్నుల్లో ఏవిధంగా మార్పులు తీసుకురావాలి అనే విషయాలపై సమావేశంలో చర్చిస్తారు. ప్రపంచవ్యాప్తంగా కార్మికుల నైపుణ్యాలను పెంపొందించడం, సమీపంలో ఉన్న, రాబోయే దశాబ్దకాలంలో ఎదురయ్యే అతిపెద్ద సంక్లిష్ట సమస్యలను గుర్తించడం, భవిష్యత్ నివేదికలు రూపొందించడం వంటి కార్యకలాపాలను ఈ సమావేశం నిర్వహిస్తుంది. సైబర్ ప్రపంచంలో భద్రత, పెరుగుతున్న సమస్యలు, దేశాలమధ్య ఉన్న పరస్పర ఆధారిత సరఫరా వ్యవస్థలు, సైబర్ నైపుణ్యంలో ఏర్పడుతున్న శూన్యత వంటి అంశాలతోపాటు కృత్రిమ మేధస్సు, కీలక పరిశ్రమల్లో దానిని చేపట్టాల్సిన అవసరం, కొత్త పరిశోధనల ఆవశ్యకత, ఆచరణాత్మక వ్యూహాలు వంటి విషయాలను చర్చిస్తుంది. వాతావరణం, ప్రకృతి, ఇంధనం వంటి విషయాలలో కాప్ సదస్సుల ఫలితాలను పరిశీలిస్తుంది. 2024లో భూమి, జీవ వైవిధ్యం, పునర్వినియోగ ఇంధన వనరులవ్యాప్తి, ఇంధన డిమాండ్, ప్రకృతి సంరక్షణ, పునరుద్ధరణ, ప్లాస్టిక్‌పై ప్రపంచం తీసుకున్న చర్యల్లో భాగస్వామ్యం వంటి విషయాలను పరిశీలిస్తుంది.

**డబ్ల్యుఇఎఫ్‌లో ఈసారి బంగ్లాదేశ్ హవా!**

ఈసారి ప్రపంచ ఆర్థిక వేదిక సమావేశంలో బంగ్లాదేశ్ ఒక ఆకర్షణ కానున్నది. అక్కడ జరుగుతున్న పరిణామాలపైన అందరి దృష్టీ కేంద్రీకృతమైం ది. ఆ దేశ తాత్కాలిక పాలకుడు మహ్మద్ యూనుస్ కూడా హాజరవుతున్నారు. ప్రపంచ నాయకులు బంగ్లాదేశ్‌పై ఇప్పుడు ఆసక్తి చూపిస్తున్నారు. యూనుస్ హయాంలో జరుగుతున్న పరిణామాల ను, భారత్–బంగ్లాదేశ్ మధ్య సంబంధాలను ప్రపంచదేశాలు గమనిస్తున్నాయి. మహ్మద్ యూనుస్ తాత్కాలిక ప్రభుత్వహయాంలో బంగ్లాదేశ్‌కు ప్రపంచవ్యాప్తంగా మంచి ప్రచారం లభించింది. తద్వారా ఈ సమావేశాలలో బంగ్లాదేశ్ లాభపడే అవకాశాలు గణనీయంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఈ సమావేశాలలో భారత్‌పై బంగ్లాదేశ్ ఎలాంటి ఆరోపణలు చేసినాగానీ తిప్పికొట్టేందుకు, దీటైన సమాధా నం చెప్పేందుకు భారత ప్రతినిధిబృందం సంసిద్ధమైంది. తగినరీతిలో అప్రమత్తంగా ఉంది.

భారతదేశం తరపున ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఈ సదస్సుకు వెళ్ళడంలేదు. ఆయన తరపున కేంద్రమంత్రి అశ్వనీ వైష్ణవ్ సారథ్యంలో ఒక ప్రతినిధి బృందం ఈ ఐదురోజుల సమావేశాల్లో పాల్గొంటున్నది. సీనియర్ మంత్రులు కూడా పాల్గొంటున్నారు. మనదేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాల ప్రతినిధులు ఈ సమావేశాల్లో పాల్గొంటున్నారు. వీరంతా పెట్టుబడులకు సంబంధించిన చర్చల్లో పాల్గొంటారు. కృత్రిమ మేధస్సు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు, స్థిరమైన పెట్టుబడుల సాధనకుగల అవకాశాలు, సవాళ్ళు వంటి విషయాలపై సదస్సులలో భారత్ ప్రతినిధులు పాల్గొంటారు. భారతదేశం నుండి 65మందికి పైగా వ్యాపార ప్రతినిధులు ఈ సమావేశాలకు హాజరవుతున్నారు. అనేక భారతీయ కంపెనీలు దావోస్‌లో తమ శాలలు ఏర్పాటు చేశాయి. భారతదేశం చక్కటి ఆర్థికవృద్ధిని సాధిస్తూ ప్రపంచం దృష్టిని తనవైపు తిప్పుకుంటోందని దోహాలో భారత వర్గాలు చెప్పాయి. 2000 సంవత్సరం నుండీ భారతదేశం ఒక ట్రిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల మైలురాయిని దాటి ముందుకు ప్రయాణించింది. ఈ ఆర్థిక సంవత్సరం తొలి అర్ధభాగంలోనే 42.1 బిలియన్ డాలర్ల ఎఫ్‌డిఐని భారత్ రాబట్టిందని భారత్ తెలిపింది.

***(ఐపిఎ సర్వీస్)***

# వ్యవసాయరంగ పరిరక్షణకు ఉద్యమ శక్తులు ఏకం కావాలి


గౌని ఐలయ్య
9490700955

మనది వ్యవసాయక దేశం. నేటికీ దేశ జనాభాలో సగం మందికి పైగా వ్యవసాయ రంగంపైనే ఆధారపడి బతుకుతున్నారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలు గడిచినా వ్యవసాయ రంగం ఇంకా దీన స్థితిలోనే కొట్టుమిట్టాడుతున్నది. మన దేశం ప్రపంచ వాణిజ్య సంస్థలో భాగస్వామిగా చేరినప్పటి నుంచి రైతాంగం, వ్యవసాయరంగం పరిస్థితి మరింత వేగంగా క్షీణించడం ప్రారంభమైంది. 2022 నాటికల్లా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని, స్వామినాథన్ సిఫారసుల ప్రకారం వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధర యిస్తామని నమ్మబలికిన నరేంద్ర మోదీ పాలనలో వ్యవసాయ రంగం అంపశయ్య పైకి చేరి, రైతు పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. గెలిచే వరకు మద్దతు ధర గురించి ఊదరగొట్టి తర్వాత C2 +50 సూత్రం ప్రకారం తాము కనీస మద్దతు ధర ఇవ్వలేమని సుప్రీంకోర్టుకు ఎన్‌డిఎ ప్రభుత్వం అఫిడవిట్ సమర్పించడం ద్వారా తమ రైతు వ్యతిరేక విధానాన్ని బయట పెట్టుకొన్నది. 2014లో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ కేంద్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుండి కార్పొరేట్లకు పెద్దపీట వేస్తూ రైతాంగాన్ని, వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేస్తూ వచ్చింది. గత పదేళ్లలో కార్పొరేట్ శక్తులకు 16 లక్షల కోట్ల రూపాయల రుణమాఫీ చేయటమేకాక వారికి ఏటా లక్షన్నర కోట్ల పన్ను రాయితీలు ఇస్తున్నారు. దేశవ్యాప్తంగా రైతులకున్న 5లక్షల కోట్ల రుణాలను మాఫీ చేయటానికి మాత్రం చేతులు రావటం లేదు. ఇప్పటికీ 52 శాతం వ్యవసాయ కుటుంబాలు అప్పుల్లో కూరుకుపోయి ఉన్నాయని, వారి నెత్తిపై సగటున 74,121 రూపాయల అప్పు వుందని అధికారిక గణాంకాలు వెల్లడిస్తున్నాయి. పాశ్చాత్య దేశాలలో 25 శాతం నుండి 60శాతం వరకు రైతులకు సబ్సిడీలు ఇస్తుంటే మనదేశంలో అవి నాలుగు శాతానికి మించడం లేదు. పైగా ప్రభుత్వానికి ఎదురు సబ్సిడీలు ఇస్తున్న దేశాల్లో మనదే అగ్రస్థానం. పంటలకు మద్దతు ధర లభించకపోవడం వల్ల ఏటా మూడు లక్షల కోట్ల రూపాయలకు పైగా రైతులు నష్టపోతున్నారు. మార్కెట్‌లో పంట ల ధరలు గిట్టుబాటుగాక పెట్టిన పెట్టుబడులు తిరిగి రాక అప్పుల సుడిగుండంలో చిక్కుకుంటున్న రైతు కుటుంబాల్లో ఆత్మహత్యల పరంపర కొనసాగుతున్నది. 2013 నుండి 2022 వరకు గత పదేళ్లలో లక్షా ఇరవై వేల మందికి పైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారంటే రైతాంగం యొక్క దయనీయ పరిస్థితి ఏ విధంగా వుందో అర్థం చేసుకోవచ్చు. రైతుల ఆదాయం రెట్టింపు చేయకపోగా ఉన్న భూములను ఊడగొట్టి, వ్యవసాయ పంటలపై కార్పొరేట్ శక్తులకు అధికారాన్ని కట్టబెట్టే విధంగా మూడు వ్యవసాయ చట్టాలను మోదీ ప్రభుత్వం తీసుకువచ్చింది. ఇవి వ్యవసాయ రంగానికి, రైతాంగానికి ఉరితాళ్ళ వంటివి. ఈ నల్ల చట్టాలకు వ్యతిరేకంగా 13 నెలల పాటు ఢిల్లీ కేంద్రంగా రైతాంగం వీరోచిత పోరాటం నిర్వహించింది. ఫలితంగా తాత్కాలికంగా వెనక్కి తగ్గిన మోదీ ప్రభుత్వం కనీస మద్దతు ధర చట్టబద్ధత అవకాశాల పరిశీలనకోసం ఉద్యమ నాయకత్వానికి రాతపూర్వక



హామీ ఇచ్చింది. మూడు సంవత్సరాలు దాటిన దీనిపై ఎలాంటి పురోగతి లేకపోగా తిరిగి దొడ్డిదారిన ఆ నల్ల చట్టాలను అమలు చేయడానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నది. దానిలో భాగంగానే కొత్త వ్యవసాయ మార్కెట్ విధానాన్ని తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నది. అటవీ సంరక్షణ నియమాల పేరుతో 2006 అటవీ హక్కుల చట్టానికి పాతరేయటానికి పూనుకున్నది. గిరిజన చట్టాలను రాజ్యాంగ రక్షణలను ఖాతరు చేయకుండా అటవీ భూములను, ఖనిజాలను కార్పొరేట్లకు కట్టబెట్టడం కోసమే ఎన్‌డిఎ ప్రభుత్వం ఈ బిల్లుని తీసుకొచ్చింది. అటవీ సంరక్షణ నియమాల బిల్లు ఆమోదం పొందితే అడవులకు, అడవుల్లో నివసించే జన సమూహాల హక్కులకు ముప్పు ఏర్పడుతుందని పార్లమెంట్ సభ్యులకు కాన్‌స్టిట్యూషనల్ కండక్ట్ గ్రూపు తరపున 155 మంది మాజీ ఐఎఎస్ అధికారుల సంతకాలతో లేఖ రాశారు. అయినా మోదీ ప్రభుత్వం వెనక్కి తగ్గకుండా ఆ బిల్లును ఆమోదింపచేసుకుంది. మరోవైపు విద్యుత్ బిల్లు 2020ని ఆమోదానికి సిద్ధం చేసుకుంది. ఇది వ్యవసాయరంగంపై పెను భారం మోపే బిల్లు. రైతు రుణ విముక్తి చట్టం, వ్యవసాయ పంటల కనీసం మద్దతు ధర చట్టం చేయాలని రైతాంగం చేస్తున్న ఆందోళనలను ప్రభుత్వం ఖాతరు చేయడంలేదు. ఎన్‌డిఎ ప్రభుత్వం వ్యవసాయరంగం నుండి రైతాంగాన్ని వెళ్ళగొట్టి దానిని కార్పొరేట్లకు కట్టబెట్టే చర్యలను చేపడుతున్నది. వ్యవసాయ పంటల సేకరణ బాధ్యత తమది కాదన్నట్టుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి. ఒకవైపు కేంద్రప్రభుత్వం రైతు వ్యతిరేక విధానాలతో వ్యవసాయ రంగాన్ని దివాలా తీయిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వాలు కూడా అదే బాటలో నడుస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం రైతాంగం నుండి బలవంతపు భూసేకరణకు పూనుకుంటున్న క్రమంలో జరిగిందే లగచర్ల ఘటన. కేంద్రం తీసుకొచ్చిన ఇథనాల్ విధానాన్ని తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్సాహంగా అమలు జరుపుతున్నది. నిర్మల్ జిల్లా దిలావర్పూర్ రైతాంగం జరిపిన సంఘటిత పోరాటంతో అక్కడ వెనక్కి తగ్గినప్పటికీ రాష్ట్రంలో మిగతా 29 ఇథనాల్ కంపెనీల విషయంలో వెనక్కి రావటానికి సిద్ధంగా లేదు.

రైతాంగం పెట్టుబడికి అవసరమైన పంట రుణాలను బ్యాంకులు అందించే స్థితి లేదు. ఫలితంగా ప్రైవేటు వ్యాపారుల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి అధిక వడ్డీలకు పంట రుణాలు తెచ్చుకుంటున్న పరిస్థితి ఉంది. అనేక వ్యయ ప్రయాసలకోర్చి పండించిన పంటలకు మార్కెట్‌లో మద్దతు ధర లభించటంలేదు. దేశానికి అన్నంపెట్టే రైతన్నలపై మొదటి నుండి పాలకులు నిర్లక్ష్య వైఖరినే ప్రదర్శిస్తున్నారు. ప్రయివేటు వ్యాపారుల దోపిడీ, మార్కెట్ మాయాజాలంలో చిక్కుకొని విలవిలలాడుతున్న రైతాంగం పరిస్థితి గత పదేళ్ల ఎన్డీఏ పాలనలో కోలుకోలేని విధంగా దెబ్బతిన్నది. రైతును, వ్యవసాయరంగాన్ని రక్షించుకోలేకపోతే దేశంలో ఆహార కొరత ఏర్పడే ప్రమాదం పొంచి వుంది. ఇప్పటికైనా రైతులు, రైతు సంఘాలు మేల్కొనాలి. ఉద్యమ శక్తుల ఐక్యత ద్వారానే రైతాంగాన్ని, వ్యవసాయరంగాన్ని రక్షించుకోగలుగుతాం.

***(ఇప్పటివరకు అఖిలభారత రైతుకూలీ సంఘం విడివిడిగా కొనసాగుతున్న రెండుసంస్థలు 19-1-2025న మహబూబాబాద్‌లో విలీనసభ జరుపుతున్న సందర్భంగా)***

# సెలబ్రిటీలు సమాజానికి ఆదర్శంగా ఉండాలి


ఎస్.బాబు, అధ్యక్షుడు
టిఎస్ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్

సినిమా రంగం ఓ అద్భుతమైన రంగుల ప్రపంచం. మానవ సంస్కృతిలో చలనచిత్రం ప్రత్యేకమైన విభాగంగా వ్యాప్తి చెందింది. ఈ మాస్ మీడియా ప్రపంచవ్యాప్తంగా సమాజాలను, అందులో ఉండేవారిని ఎంతో ప్రభావితం చేస్తుంది. మన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, నాగరికత, కట్టుబాట్లు, విద్యా వికాసం ప్రచారం చేయడానికి సినిమా శక్తివంతమైన వాహకంగా పనిచేస్తుంది. ఇటువంటి శక్తివంతమైన గ్లామర్ ప్రపంచంలోకి అనేకమంది నటీనటులు, దర్శక నిర్మాతలు, సంగీత దర్శకులు, గీత, కథా రచయితలు, సినిమాటోగ్రాఫర్స్, విజువల్ ఎఫెక్ట్స్ నిపుణులు, మేకప్ ఆర్టిస్టులు మొదలైన రంగాలలో రాణించాలని ఆశల పల్లకిలో ఊరేగుతూ వస్తుంటారు. సినిమా పరిశ్రమ కొన్ని వేలమందికి ఉపాధినిస్తోంది. మరికొన్ని కోట్ల మందికి ఆనందాన్ని కలిగిస్తోంది.1921లో రఘుపతి వెంకయ్య నాయుడు 'భీష్మ ప్రతిజ్ఞ' అనే మూకీ సినిమాను నిర్మించారు. 1930లో 'ఆలం ఆరా' అనే హిందీ చిత్రాన్ని, 1932లో 'భక్త ప్రహ్లాద' అనే తెలుగు సినిమాలతో టాకీ చిత్రాలు ప్రారంభమయ్యాయి. ఇటువంటి గ్లామర్ ప్రపంచంలోకి వచ్చిన వ్యక్తులు సెలబ్రిటీలుగా పేరు తెచ్చుకుని అనైతిక విన్యాసాలతో అమానవీయంగా ప్రవర్తిస్తున్నారు. కొరియోగ్రాఫర్ తన అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌పై చేసిన లైంగిక దాడులకు జైలు శిక్ష అనుభవించాల్సి వచ్చింది. శక్తివంతమైన సినిమా పరిశ్రమలో పనిచేస్తూ డాన్స్ మాస్టర్‌గా ఉంటూ తన ఇంద్రియాలను అదుపులో పెట్టుకోలేక స్త్రీ శీలాన్ని అపహరించి నందుకు జైలుపాలయ్యాడు. సమాజంలో సెలబ్రిటీలుగా చలామణి అవుతున్న వారిని ఆదర్శంగా తీసుకుంటారు. సినిమాలపరంగా చూస్తే గ్లామర్ హీరోయిన్‌గా వెలుగొందిన యువ సినీతార విడాకులు తీసుకోవడంతో ఆమె జీవితంలో ఎంతో అలజడి సృష్టించబడింది. విడాకులనేవి వారి పర్సనల్ మేటరే అయినా ఆమెకు ఎంతోమంది అభిమానులున్నారు. సొసైటీలో ఫాలోయర్స్ ఉన్నారు. తెలుగు, తమిళ, మళయాళ రాష్ట్రాలలో అనేకమంది ఆమె అందాన్ని ఆరాధించేవారు ఉన్నారు. సెలబ్రటీ స్థానంలో ఉన్నవారు సమాజ హితంకోసం అనేక జాగ్రత్తలు తీసుకుంటూ సంయమనం పాటించాల్సి ఉంటుంది.

బిగ్ బాస్ రియాల్టీ షో సూత్రధారి మరియు సినిమా హీరో ల్యాండ్ గ్రాబింగ్ కేసులో ఎస్.కన్వెన్షన్ ను హైడ్రా కూల్చివేసింది. 1976లో అన్నపూర్ణా స్టూడియోస్ కు 22 ఎకరాల భూమిని కేవలం లక్షా యాభై వేలకు ప్రభుత్వం ఇచ్చింది. ఇప్పుడు దాని విలువ సుమారు 700కోట్లు. ఆ సంస్థ అధినేతకు ఏం తక్కువైందని చెరువులను ఆక్రమించుకోవాలి? సినిమా ఫీల్డులో పనిచేస్తున్న కొందరిని మాదక ద్రవ్యాల వాడకం కేసులో నిందితులుగా చేస్తూ ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వం విచారణ చేపట్టింది. ఈ కేసులో నటీనటులు, దర్శక నిర్మాతలు, ఫైనాన్షియర్స్‌ని పోలీసులు 11 రోజులు విచారించారు. 12 కేసులు ఫైల్ చేశారు. 6 కేసులు కొట్టివేయబడ్డాయి, మరో 6 కేసులు పెండింగులో ఉన్నాయి. పుష్ప 2 సినిమా ప్రీ రిలీజ్ వేడుకలు హైదరాబాద్ సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ మరణించడం, ఆమె కుమారుడు ఐసియులో కోమాలో ఉండటం. ఫలితంగా ఆ సినిమా హీరో అరెస్ట్ అయి చంచల్ గూడ జైలుకు వెళ్ళటం జరిగింది. చిరంజీవి లాంటి మెగాస్టార్ ముసుగేసుకుని తనను ఎవరూ చూడకుండా థియేటర్‌లో సినిమా చూసి వెళ్ళేవారు. సామాజిక బాధ్యత అంటే అది. కాని ఈ హీరో మాత్రం సామాజిక బాధ్యత లేకుండా తొక్కిసలాటకు కారణమయ్యాడు. వారుచేసే వ్యాపారానికి సమాజాన్ని బలి చేస్తా రా? కంటెంట్ లేనివారికి వందల అడుగుల ఎత్తులో కటౌట్లా? టాలీవుడ్ నటీమణి బెంగుళూరులో జరిగిన రేవ్ పార్టీలో డ్రగ్స్ తీసుకున్న కారణంగా ఆమెపై కోర్టు కేసు నమోదయింది. 4 పదుల వయసు దాటిన ఈ తారామణికి డ్రగ్స్ వాడకమెందుకో? ఈ కేసులో విచారణ జరిపి బెంగుళూరు కోర్టు కొట్టివేయడం జరిగింది. డ్రగ్స్ అనేవి ఆడ మగ తేడా లేకుండా సినిమా ఇండస్ట్రీని ఒక కుదుపు కుదుపుతున్నాయి. సెలబ్రిటీలు సత్సంప్రదాయాన్ని పాటిస్తే సాంఘిక జీవనం పరిఢవిల్లుతుంది.

ఆయన చూస్తే ఎన్నో విద్యాసంస్థల అధినేత. నిర్మాత, హీరో. చతుర్విధ అభినయాలు చేయగల దిట్ట. వాచికాభినయంలో డైలాగ్ కింగ్. వసూళ్ళలో కలెక్షన్ కింగ్. ఇంటి తగాదాలను రచ్చకీడ్చి ఫోర్త్ ఎస్టేట్ ని చులకనగా చూసి టివి 9 విలేకరిపై దాడి చేసిన ఆజానుబాహువు. పెదరాయుడిలా సమాజ ధర్మాన్ని చెప్పిన ఆయన స్వధర్మాన్ని మరచి సంయమనం పాటించాల్సిన సమయంలో సహనం కోల్పోయిన అసహనశీలి. కోర్టు బెయిల్ తిరస్కరించిందంటే వీరుచేసిన నేరం నెక్ట్ లెవల్ అంటే అతిశయోక్తి కాదు. విలువలు సినిమాల్లోనే కాదు, నిజ జీవితంలో కూడా పాటిస్తే సమాజంలో ఉన్నతంగా ఉంటుంది. మాజీ ఎమ్మెల్యే మరియు తమిళ సినిమా నటులయిన ఎస్.వి. శేఖర్ ఓ పాత్రికేయురాలిపై అనుచితంగా వ్యవహరించినందుకు మద్రాస్ హైకోర్టు ఆయనకు సంవత్సరం జైలు శిక్ష, 15 వేల రూపాయల జరిమానా విధించటం సినిమా ఇండస్ట్రీకి ఎంత తలవంపులు? ఎంతో ప్రశస్తమైన సినిమారంగంలో సెలబ్రిటీలుగా అభిమానించబడుతున్నవారు సామాజిక బాధ్యతతో మెలగాలే తప్ప సహనం కోల్పోకూడదు. వారి నుండి సమాజం ఎంతో మంచిని గ్రహించాల్సి ఉంటుంది. ఈ సమాజానికి వారు ఆదర్శ ప్రాయమైన వ్యక్తులుగా ఉండాలి.

# సమాచార కమిషనర్లను నియమించాలి

లేఖ

సమాచార హక్కు చట్టం ప్రజల చేతిలో ఆయుధం లాంటిది. పాలనలో పారదర్శకత, జవాబుదారీతనం పెంచే సమాచార హక్కు అమలు తీరుకు సంబంధించిన రాష్ట్ర ప్రధాన సమాచార కమిషనర్, కమీషనర్ పోస్టులు ఖాళీగా ఉండటం వల్ల రాష్ట్ర సమాచార కమిషన్‌లో లక్షలాది రెండవ అప్పీలులు పెండింగ్‌లో వుండటం వల్ల ప్రజలకు కాలవసిన సమాచారం సకాలంలో రాకపోవడం వల్ల సమాచార హక్కు చట్టం అమలు సక్రమంగా లేదు. అనేక ప్రభుత్వ కార్యాలయాలలో సమాచార హక్కు చట్టం బోర్డులు కూడా లేవు. మూలకు పడవేసి వుంచారు. అధికారులకు అవగాహన లేదు. ప్రభుత్వం తక్షణమే స్పందించి సమాచార హక్కు చట్టం అమలు తీరు మెరుగు పరిచేందుకు కృషిచేస్తూ సమాచార హక్కు కమీషనర్ పోస్టులను భర్తీ చేయాలని, ప్రతీ ప్రభుత్వ కార్యాలయాల గోడల మీద బోర్డులు ఏర్పాటు చేసి అధికారులకు చట్టం అమలు తీరుమీద శిక్షణ ఇవ్వాలి.

కెఎస్.రెడ్డి

# నేర చరిత్ర అభ్యర్థుల ఎంపికను సమర్థించుకున్న రాజకీయ పార్టీలు

## ఎడిఆర్ నివేదికలో వెల్లడి




**న్యూఢిల్లీ :** గత ఏడాది మహారాష్ట్ర, జార్ఖండ్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో నేరచరిత్ర ఉన్న అభ్యర్థులను ఎంపిక చేసుకోవడానికి గల కారణాలను ఆయా రాజకీయ పార్టీలు వెల్లడించాయి. బల మైన పరిపాలన సామర్థ్యం, ప్రజాసేవ పట్ల నిబద్ధత, రాజకీయ ప్రేరేపిత కేసులు మాత్రమే ఉండడం వల్ల నేర చరిత్రగల అభ్యర్థు లను ఎంపి చేసుకున్నట్లు తెలిపాయని అసోసియేషన్ ఫర్ డెమా క్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్) తన నివేదికలో పేర్కొంది. చాలా మేరకు ఓటర్లతో సంబంధాలు పెట్టుకునే సామర్థ్యం లేకపో వడం, అనుభవం కొరవడడం వల్ల ప్రత్యామ్నాయ అభ్యర్థులను ఆయా పార్టీలు తిరస్కరించాయి. అయితే నేర చరితగల అభ్యర్థు లను ఎంచుకోవడంపై అడిగిన ప్రశ్నలను పక్కదారి పట్టించడానికి ఈ విధమైన కారణాలను చూపుతున్నాయని ఎడిఆర్ వెల్లడిం చింది. మహారాష్ట్ర, జార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన 1286 మంది అభ్యర్థుల ఫారం సి7ను ఎడిఆర్ విశ్లేషణ చేసింది. అయితే ఏదైనా నేర చరిత్ర ఉంటే అభ్యర్థులు ప్రకటించుకునేందుకు ఫారం సి7 అవసరం. నేర నేపథ్యం ఉన్న అభ్యర్థులను ఎంపిక చేయడా నికి వివరణాత్మక, మెరిట్ ఆధారిత సమర్థనలు అవసరమని సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను నెరవేర్చడంలో ఇటువంటి కారు ణాలు చూపి తరచుగా విఫలమవుతున్నారని ఎడిఆర్ నివేదిక వెల్ల డించింది. అందుకు బదులుగా అభ్యర్థి యువకుడని, చురుకుగల వారని, ప్రజా ఆందోళన కారణంగా కేసులు దాఖలు అయ్యాయి వంటి ప్రకటనలను పదే పదే ఉపయోగిస్తున్నారని పేర్కొంది. కాగా, మహారాష్ట్రలో 29 శాతం మంది అభ్యర్థులు, జార్ఖండ్‌లో 20 శాతం మంది అభ్యర్థులు తమ ఎంపికకు ఎటువంటి సమర్థ నను ప్రచురించలేదు. ఇది ఇది సుప్రీంకోర్టు ఆదేశాలను ప్రత్య క్షంగా ఉల్లంఘించడమే. ఉదాహరణకు, మహారాష్ట్రలో 35 క్రిమి నల్ కేసులు ఎదుర్కొంటున్న రాష్ట్రీయ సమాజ్ పక్షానికి చెందిన దిగంబర్ రోహిదాస్ ఆగ్వానే పేదలకు అంకితమైన ప్రభావవంత మైన నాయకుడిగా అభివర్ణించారు. నేర చరిత్రలు లేకుండా అభ్య ర్థులను దాటవేయడానికి ఎటువంటి ఆచరణీయమైన వివరణ లేదు. అదేవిధంగా, కాంగ్రెస్‌కు చెందిన సంజయ్ చందుకాక జగ్తాప్ 27, బంటీ బాబా షెల్కేల 26 కేసులు ఎదుర్కొంటున్నా అభ్యర్థులుగా ఎంపిక చేయడం వారి పరిపాలనా అనుభవమేనని సమర్థించుకున్నారు. మహారాష్ట్రలో ఎన్‌సిపి శరద్‌చంద్ర పవార్ వర్గం, శివసేన (ఉద్ధవ్ బాలాసాహెబ్ ఠాక్రే) క్రిమినల్ కేసులు ఉన్న తమ అభ్యర్థులకు సమర్థనలు అందించడంలో విఫలమ య్యాయి. జార్ఖండ్‌లో కూడా ఇలాంటి లోపాలు గుర్తించబడ్డాయి. అక్కడ జార్ఖండ ముక్తి మోర్చా (జెఎంఎం) క్రిమినల్ రికార్డులు ఉన్న తమ అభ్యర్థులను ఎంచుకోవడానికి గల కారణాలను వెల్ల డించలేదు. ఈ నేపథ్యంలో పోటీ చేయని పార్టీల రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని, తీవ్రమైన నేరారోపణలు ఉన్న అభ్యర్థులపై అన ర్హత వేటు వేయడం ఎన్నికల కమిషన్ (ఇసి) కఠినమైన పర్య వేక్షణ ఉండేలా తక్షణ సంస్కరణలు చేపట్టాలని ఎఢిఆర్ పిలుపునిచ్చింది. ఇదిలా ఉండగా, మహారాష్ట్రలో విశ్లేషించ బడిన అభ్యర్థులలో 48 శాతం మంది (1,052 మందిలో 503 మంది) తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ప్రకటిం చారు. 32 శాతం మంది తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటు న్నారు. జార్ఖండ్‌లో 45 శాతం మంది అభ్యర్థులు (234 మందిలో 105 మంది) క్రిమినల్ కేసులు ఉన్నట్లు ప్రకటిం చగా, 35 శాతం మంది తీవ్రమైన ఆరోపణలు ఎదుర్కొంటు న్నారు. 15 కేసులు ఎదుర్కొంటున్న బిజెపి అభ్యర్థి బాబులాల్ మరాండి తన సామాజిక సేవా అర్హతలకు ప్రశంసలు అందుకు న్నారు. అతనిపై వచ్చిన ఆరోపణలను రాజకీయంగా ప్రేరేపించ బడినవని కొట్టివేశారు. రాజకీయ పార్టీలు సమగ్రత కంటే 'గెలు పు'కే ప్రాధాన్యత ఇస్తున్నాయని ఈ నివేదిక విమర్శించింది. ఈ నిబంధనలను సమర్థవంతంగా అమలు చేయడంలో ఇసి విఫల మైందని ఆరోపించింది. బహిర్గతం చేయాల్సిన అవసరాలను పెద్దగా పాటించలేదని కూడా ఎడిఆర్ నివేదిక వెల్లడించింది. మహారాష్ట్రలో 83 శాతం మంది కోటీశ్వరులు అని, వారిలో బిజె పికి చెందిన ప్రశాంత్ రాంషేత్ ఠాకూర్ రూ. 475 కోట్ల ఆస్తులను ప్రకటించారని ఎడిఆర్ పేర్కొంది. జార్ఖండ్‌లో కాంగ్రెస్ అభ్యర్థులు అత్యంత సంపన్నుల జాబితాలో అగ్రభాగాన ఉన్నారు. వీరిలో కృష్ణానంద్ త్రిపాఠి రూ. 70 కోట్ల ఆస్తులను కలిగి ఉన్నారు. డబ్బు, కండబలం రాజకీయాల మధ్య లోతుగా పాతుకుపోయిన సంబంధాన్ని పరిష్కరించడానికి వ్యవస్థాగత సంస్కరణలు అవసర మని ఎడిఆర్ ఉద్ఘాటించింది.

# చైనా ప్రధానితో దిసనాయకే భేటీ



**కొలంబొ:** శ్రీలంక ప్రజలకు 'అభివృద్ధి చెందుతున్న దేశం – అందమైన జీవితం' అనే స్వప్నాన్ని సాధించేందుకు ప్రస్తుత శ్రీలంక ప్రభుత్వం చేసే కృషికి సంపూర్ణ మద్దతును అందిస్తామని చైనా ప్రధాన మంత్రి లీ క్వియాంగ్ హామీ ఇచ్చారు. చైనా పర్యటనలో భాగంగా ఆ దేశ ప్రధానితో శ్రీలంక దేశాధ్య క్షుడు అనుర కుమార దిసనాయకే శుక్ర వారం సమావేశమయ్యారు. దీర్ఘకాలిక ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకో వడం, పెట్టుబడులను కోరడం, సాంస్కృతిక మార్పిడికి సహకారం, వ్యాపారం, రాజకీయ సహకారం తదితర అంశాలపై వారిరువురి మధ్య విస్తృత స్థాయిలో చర్చ జరిగినట్లు శ్రీలంక అధ్యక్ష కార్యాలయం ఒక ప్రకటనలో తెలియజేసింది. భేటీలో శ్రీలంక ఆర్థిక అభివృద్ధికి విస్తృత సహాయాన్ని అందించేందుకు నిబద్ధతతో ఉన్నట్లు లీ పునరుద్ఘాటించారు. అవినీతి రహిత దేశాన్ని నిర్మించేందుకు శ్రీలంక ప్రభుత్వ ప్రయత్నా లకు అండగా ఉంటామని చైనా ప్రధాని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా దిసనాయకే మాట్లాడుతూ చైనా, శ్రీలంక మధ్య చారిత్రక స్నేహం బౌద్ధ సన్యాసి ఫాక్సియాన్ కాలం నుంచి ఉందని గుర్తు చేశారు. తమ దేశాభివృద్ధిలో కీలకమైన పాత్ర పోషించినందుకు చైనా ప్రభుత్వం, ప్రజల నిరంతర మద్దతుకు కృతజ్ఞతలు తెలి యజేశారు.

**కీలక రాజకీయ మలుపులో ఉన్నాం**

శ్రీలంక కీలక రాజకీయ మలుపులో ఉందని, తమ ప్రభుత్వానికి అన్ని ప్రాంతాల ప్రజలు మూడింట రెండింతల మెజారిటీని కట్టబెట్టారని శ్రీలంక అధ్య క్షుడు అనుర కుమార దిసనాయకే తెలిపారు. తమపై ప్రజలు పెట్టుకున్న ఆకాంక్షలను నెరవేర్చేందుకు తమ ప్రభుత్వం సంపూర్ణంగా కట్టుబడి ఉందని చెప్పారు. చైనా కమ్యూనిస్టు పార్టీ సిచువాన్ ప్రావిన్స్ కార్యదర్శి వాంగ్ జియోహుయితో శుక్రవారం జరిగిన సమావే శంలో ఆయన ఈ వ్యాఖ్య చేశారు. ప్రస్తుతం తమ దేశం పారదర్శకమైన పెట్టుబడుల అనుకూల ప్రభు త్వంతో ఆర్థిక స్థిరత్వ మార్గంలో పయనిస్తుందని దిస నాయకె వెల్లడించారు. ఈ సమావేశాలలో శ్రీలంక మంత్రులు విజిత హెరాత్, బిమల్ రత్ననాయకె తదిత రులు పాల్గొన్నారు.

# ఢిల్లీ మెట్రోలో విద్యార్థులకు 50 శాతం రాయితీ ఇవ్వాలి

## ప్రధాని నరేంద్రమోదీకి ఆప్ కన్వీనర్ కేజ్రీవాల్ లేఖ



**న్యూఢిల్లీ :** మెట్రో రైల్ టిక్కెట్లలో విద్యార్థులకు 50 శాతం రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో అధికార ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ప్రధాని నరేంద్రమోడీకి లేఖ రాశారు. అసెంబ్లీ ఎన్నికల వేళ శుక్రవారం బిజెపి ఎన్నికల మేనిఫెస్టోను విడు దల చేసిన కొన్ని గంటల తరువాత ఆప్ మోదీకి లేఖ రాయడం గమ నార్హం. కాగా, ఫిబ్రవరి 5వ తేదీన జరిగే ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ తిరిగి అధికారాన్ని చేపడితే పురుష విద్యార్థులకు ఉచితంగా బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని మీడియా సమావేశంలో కేజ్రీ వాల్ ప్రకటించారు. ఇప్పటికే దేశ రాజధానిలో మహిళలకు ఆప్ ప్రభుత్వం ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్న విషయం తెలిసిందే. ఢిల్లీలో మహిళలు ఇప్పటికే బస్సుల్లో ఉచితంగా ప్రయాణం చేస్తున్నా రని, ఈ తరహాలోనే ఇప్పుడు పురుష విద్యార్థులకు కూడా లబ్ధి చేకూ రుస్తూ వారి ఆర్థిక భారాన్ని సులభతరం చేయాలని, విద్య లభ్యతను ప్రోత్సహించాలని భావిస్తున్నామన్నారు. ఢిల్లీలో ప్రస్తుతం మోడల్ కోడ్ ఉన్నందు వల్ల ఇప్పటికిప్పుడు పురుష విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించలేకపోతున్నామని కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఈ ప్రభుత్వం మరోసారి ఎన్నికైన ఈ హామీకే తొలి ప్రాధాన్యత కల్పిస్తా మని చెప్పారు. ఇదిలా ఉండగా, ఢిల్లీ మెట్రోలో కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వం భాగస్వామ్యమై ఉన్నందున డిఎంఆర్‌సి రైళ్లలో రెండు ప్రభు త్వాలు కూడా విద్యార్థులకు కల్పించే రాయితీను భరించాలని కేజ్రీ వాల్ మోదీకి రాసిన లేఖలో పేర్కొన్నారు. మెట్రోరైల్ ధరలు విద్యార్థు లకు చాలా భారంగా ఉన్నాయని, అందువల్ల విద్యార్థులకు ఈ పథ కాన్ని అమలు చేయాలని ప్రకటించాలని మోడీకి విజ్ఞప్తి చేస్తూ, అందుకు ఇచ్చే రాయితీలో సగం చెల్లించేందుకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. ఎన్నికల తరువాత చర్యలు ప్రారంభం కావచ్చన్నారు. టివి చర్చల్లో బిజెపి అధికార ప్రతినిధి షెహజాద్ పూనవల్ల ఆప్ ఎమ్మెల్యే రితురాజ్ ఝాపై వేసిన నిందలపై కూడా కేజ్రీవాల్ మండిప డ్డారు.

# చట్టవిరుద్ధమైన పిఎఫ్ఐ మాజీచైర్మన్ అబూబకర్‌కు 'సుప్రీం' బెయిల్ తిరస్కరణ



**న్యూఢిల్లీ :** యాంటీ టెర్రర్ చట్టం యుఎపిఎ (ఉపా) కింద నమోదైన కేసులో చట్టవిరుద్ధమైన పాపులర్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా (పిఎఫ్ఐ) మాజీ చైర్మన్ ఇ.అబూ బకర్‌కు ఆరోగ్యకారణాలపై బెయిల్‌మంజూరుకు శుక్ర వారం సుప్రీంకోర్టు తిరస్కరించింది. 2022లో సంస్థపై భారీ అణచివేత సమయంలో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) అబూబకర్‌ను అరెస్ట్ చేసింది. దీనిని వ్యతిరే కిస్తూ అబూబకర్ పెట్టుకున్న బెయిల్ అప్లికేషన్‌ను ట్రయల్ కోర్టు తిరస్కరించడంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. మెడికల్ రిపోర్టును పరిశీలించిన తర్వాత అబూబకర్‌ను విడుదల చేసేందుకు మొగ్గుచూ పడంలేదని న్యాయమూర్తులు ఎంఎం. సుందరేష్, రాజేష్ బిందల్ నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం తెలి యజేసింది. బెయిల్ కోసం ట్రయల్ కోర్టును ఆశ్రయిం చేందుకు సుప్రీంకోర్టు పిటిషనర్ అబూబకర్‌కు స్వేచ్ఛను ఇచ్చింది. పిటిషనర్‌ను బెయిల్‌పై విడుదల చేయదలచుకోని పక్షంలో అతడిని గృహనిర్బంధంలో ఉంచవచ్చని అబూబకర్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది గోపాల్ శంకరనారాయణ సమర్పించిన సమర్పణను కూడా తోసిపుచ్చింది. దీనిపై సొలిసిటర్ జనరల్ తుషార్‌మెహతా అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఇటీ వల గృహనిర్బంధాన్ని కోరడం 'ఒక కొత్త భావన'గా మారిందని ధర్మాసనానికి తన వాదన వినిపించారు. విచారణ సందర్భంగా శంకరనారాయణ వైద్య నివేది కను ప్రస్తావించారు. పిటిషనర్ అబూబకర్ పార్కిన్‌సన్ వ్యాధితో బాధపడుతున్నారన్నారు. జాతీయ దర్యాప్తు సంస్థ తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్‌వి.రాజు మాట్లాడుతూ అబూబకర్‌కు బెయిల్‌ను వ్యతిరేకిం చారు. అతడు లేవనెత్తిన వైద్యపరిస్థితిని వివిధరకాల చికిత్సలు పొందడం ద్వారా జాగ్రత్తలు తీసుకున్నారని చెప్పారు. బెయిల్‌ను అభ్యర్థిస్తూ అబూబకర్ వేసిన పిటి షన్‌ను హైకోర్ట్ గతేడాది మే 28న కొట్టేసింది. అతడి అప్పీల్‌ను కొట్టివేస్తూ, ఛార్జ్‌షీట్‌లోని ఆరోపణలు, రక్షిత సాక్షుల వాంగ్మూలాలు, అబూబకర్‌కు ఇంతకుముందు మరొక నిషేధిత సంస్థ అయిన స్టూడెంట్ ఇస్లామిక్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా (సిమి)తో సన్నిహితంగా ఉన్నారనే వాస్తవాలతో సహా రికార్డులో ఉన్న విషయా లను హైకోర్టు పేర్కొంది. చట్టవిరుద్ధ కార్యకలాపాల (ని వారణ)చట్టం (యుఎపిఎ) కింద ఈ కేసు ప్రాథమికమై నదిగా ఉందన్నది నిజమని తెలిపింది. అబూబకర్ 70వ దశకంలోఉన్నారని, అతడికి పార్కిన్‌సన్ వ్యాధి ఉన్న దని, క్యాన్సర్ వ్యాధికి చికిత్స కోసం ఆయన శస్త్ర చికిత్స కూడా చేయించుకున్నాడని ఆయన తరపు న్యాయవాది గోపాల్ శంకరనారాయణ వాదనలు వినిపించారు. జాతీయ దర్యాప్తు సంస్థ అబూబకర్‌పై ఒక కేసును దయతో విఫలం చేసినందున ఆయన బెయిల్‌కు అర్హు డని గోపాల్ శంకరనారాయణ వాదించారు.

# కంగనా 'ఎమర్జెన్సీ'కి వ్యతిరేకంగా నిరసన

**చండీగఢ్:** సినీ నటి కంగనా రనౌత్ నటించిన 'ఎ మర్జెన్సీ' చిత్రాన్ని విడుదల చేయవద్దంటూ శుక్ర వారం పంజాబ్‌లో సిక్కులు ఆందోళనకు దిగా రు. అమృత్‌సర్‌లోని ఓ సినిమా హాల్ వద్ద భారీ సంఖ్యలో ఎస్‌జీపీసీ సభ్యులు ఆందోళన చేప ట్టారు. ఎమర్జెన్సీ చిత్రంపై బ్యాన్ విధించాలని ఎస్జీపీసీ పంజాబ్ ప్రభుత్వాన్ని కోరింది. పంజాబ్ లోని అన్ని సినిమా హాళ్లలో షోలను రద్దు చేయా లని విజ్ఞప్తి చేసింది. కాంగ్రెస్ ఎంపీ, పంజాబ్ చీఫ్ అమరిందర్ సింగ్ రాజా మాట్లాడుతూ... ఇటువంటి సినిమాలు తీసినప్పుడు, ఆ చిత్రాల్లో వాస్తవాలను వక్రీకరిస్తారని పేర్కొన్నారు. మసా లా లేకుండా సినిమా విజయవంతం కాదన్నారు. ప్రజలకు వినోదం పంచేందుకు ఇలాంటి సిని మాలు తీయడం సరికాదన్నారు. ప్రభుత్వాలు, సెన్సార్ బోర్డులు ఇలాంటి చిత్రాలపై నిఘా పెట్టాలన్నారు. చిత్రంలో చూపించింది నిజం కాదు అని, అది కేవలం ఓ స్క్రిప్టు మాత్రమే అని ఆయన పేర్కొన్నారు. కాగా, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జీవితకథ ఆధారంగా ఈ చిత్రాన్ని నిర్మించారు.

# దొరకని దుండగుడు.. గాలింపు ముమ్మరం

## నిలకడగా సైఫ్ ఆరోగ్యం



**ముంబై:** బాలీవుడ్ నటుడు సైఫ్ అలీ ఖాన్‌పై కత్తితో దాడికి పాల్పడిన నిందితుడిని పట్టుకునేందుకు ముంబై పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు. నిందితుడు చివరిసా రిగా బాంద్రా రైల్వే స్టేషన్ సమీ పంలో కనిపించాడని పోలీసులు తెలిపారు. సైఫ్‌పై దాడి తర్వాత ఆ వ్యక్తి గురువారం ఉదయం లోకల్ రైలులో వాసాయివిరార్ వైపు వెళ్లినట్లుగా అనుమానిస్తున్నారు. ఈ క్రమంలో వాసాయి, నల్లసోపారా, విరార్ ప్రాంతాల్లో నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నాయి. కాగా విచారణ కోసం శుక్రవారం ఉదయం బాంద్రా పోలీస్ స్టేషన్‌కు ఓ వ్యక్తిని తీసుకొచ్చారు. అయితే ఆ వ్యక్తికి, సైఫ్ అలీఖాన్ దాడి కేసుతో సంబంధం లేదని పోలీసులు స్పష్టం చేశారు. ఈ కేసులో ఇప్పటివరకు ఎవరినీ అదుపులోకి తీసుకోలేదని ముంబై పోలీసులు పేర్కొన్నారు. కాగా సైఫ్ అలీఖాన్ వెన్నె ముకలో ఇరుక్కున్న హెక్సా బ్లేడ్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఫోరెన్సిక్ బందాలు, డాగ్ స్క్వాడ్ సహా యంతో సైఫ్ అలీఖాన్ ఇంటివద్ద అనేక ఆధారాలను సేక రించినట్లు పోలీసులు తెలిపారు. దాడి చేసిన వ్యక్తిని గుర్తిం చడానికి ముంబైలోని అనేక ప్రదేశాలలో సోదాలు నిర్వహిం చామని వెల్లడించారు. సైఫ్‌పై దాడి జరిగినప్పుడు ఆయన అపార్ట్‌మెంట్ సమీపంలో ఎన్ని మొబైల్ ఫోన్లు క్రియాశీలంగా ఉన్నయన్న విషయాలను క్రైమ్ బ్రాంచ్, స్థానిక పోలీసులు సేకరించారు. కాగా, సైఫ్ పై దాడి జరిగి 30 గంటలకు పైగా గడి చాయి. 20పోలీసు బందాలు నిర్విరామంగా పనిచే సినా నిందితుడి ఆచూకీ ఇప్పటివరకు కనిపెట్టలేకపో యాయి. పోలీసులు సేకరించిన సీసీ టీవీ ఫుటేజ్‌లో దాడి అనంతరం దుండగుడు మెట్ల మీదుగా పారిపోయి నట్లు గుర్తించారు. గురువారం రాత్రి 2.33 గంటల సమ యంలో ఆరో అంతస్తులోని మెట్లవద్ద నిందితుడి చిత్రాలు లభించాయి.

ప్రస్తుతం సైఫ్ పరిస్థితి నిలకడగా ఉందని, ప్రాణాపాయం లేదని వైద్యులు వెల్లడించారు. అయితే సైఫ్‌ను ఐసీయూ నుంచి సాధారణ వార్డుకు ఎప్పుడు తరలించాలన్న విష యంపై ఆయన కుటుంబ సభ్యులు, వైద్యులు నిర్ణయం తీసు కుంటారని లీలావతి ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. దుండ గుడు బలంగా కత్తితో పొడవడంతో వెన్నెముక పక్కన గాయ మైందని వైద్యులు పేర్కొన్నారు. సైఫ్ వారం రోజుల పాటు జాగ్రత్తగా ఉండాలని, వెన్నెముకలో ఫ్లూయిడ్ లీకేజీని అరిక ట్టగలిగామని, సైఫ్ వెన్నెముకకు ఎలాంటి గాయం కాలే దని, ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు. సైఫ్ ప్రస్తుతం నడవగలుగుతున్నారు. నడుస్తున్నప్పుడు తీవ్రమైన నొప్పి లేదా ఇతర ఇబ్బందులను ప్రస్తుతానికి గుర్తించలేదు. ఆయన్ని ఐసీయూ నుంచి ప్రత్యేక గదిలోకి మారుస్తాం. వెన్ను నుంచి కత్తిని తొలగించాం. గాయాల కారణంగా ఇన్ఫెక్షన్ అయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంది. అందుకే ఆయ నకు కొంతకాలం విశ్రాంతి సూచించాం. కొన్ని రోజుల తర్వాత పరిస్థితిని చూసి డిశ్చార్జ్ చేస్తామని వైద్యులు వివరిం చారు. 54 ఏళ్ల సైఫ్ అలీఖాన్ బాంద్రాలోని సద్గురు శరణ్ అపార్ట్ మెంటు 12వ అంతస్తులో ఉంటున్నారు. ఇంట్లో కరీనా కపూర్ తోపాటు నాలుగేళ్ల జేహ్, 8ఏళ్ల తైమూర్ , ఐదుగురు సహాయకులు ఉన్నారు. గురువారం తెల్లవారుజా మున దొంగచాటుగా ఇంట్లోకి ప్రవేశించిన దుండగుడు... జేహ్ గదిలోకి వచ్చాడు. అక్కడే ఉన్న జేహ్ నానీ ఎలియా మాను కోటి రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఆమె ప్రతిఘటించడంతో హెక్సా బ్లేడ్ తో దాడి చేశాడు. శబ్దాలు విని వెంటనే జేహ్ గది వద్దకు వచ్చిన సైఫ్ పై దుండగుడు కత్తి, హెక్సా బ్లేడ్ తో దాడి చేశాడు. ఆయనకు ఆరు చోట్ల గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన సైఫ్ ను ఇంట్లో పనిచేసేవారు ఆటోలో లీలావతి ఆసుపత్రికి తర లించారు. ఇప్పటికే నిందితుడికి సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని పోలీసులు విడుదల చేశారు.

# పోలీసు ఇన్ఫార్మర్ అనుమానంతో ఒకరి హత్య

**బీజాపూర్ :** ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో పోలీసు ఇన్ఫార్మర్ అనే అనుమానంతో 48 ఏళ్ల వ్యక్తిని నక్సలైట్లు హత్య చేసినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, మిర్తుర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హల్లూర్ గ్రామానికి చెందిన సుక్కు హప్కాను గురువారం సాయంత్రం నక్సలైట్ల బృందం అతని ఇంటి నుండి అపహరించి గొంతు కోసి చంపినట్లు ఒక అధికారి తెలిపారు. ఆ వ్యక్తి మృతదేహం తరువాత ఆ ప్రాంతంలో వదిలివెళ్లినట్లు ఆయన చెప్పారు. ఉదయం పోలీసు బృందం ఘటనా స్థలానికి చేరుకున్నట్లు అధికారి తెలిపారు. బాధితుడు పోలీసు ఇన్ఫార్మర్ అని పేర్కొంటూ మావోయిస్టుల భైరామ్‌గఢ్ ఏరియా కమిటీ జారీ చేసిన కరపత్రాన్ని ఘటనా స్థలంలో బృందం కనుగొంది. దుండగులను కనిపెట్టడానికి ఆ ప్రాంతంలో గాలింపు చర్యలు ప్రారంభించినట్లు ఆయన చెప్పారు. పోలీసుల ప్రకారం, గత సంవత్సరం బీజాపూర్‌తో సహా ఏడు జిల్లాలతో కూడిన బస్తర్ ప్రాంతంలో జరిగిన వేర్వేరు మావోయిస్టు హింస ఘటనలలో 68 మంది పౌరులు మరణించారు.

# ఐఇడి పేలుడులో ఇద్దరు బిఎస్ఎఫ్ జవాన్లకు గాయాలు

**నారాయణపూర్ :** ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లాలో శుక్రవారం నక్సలైట్లు ఐఇడి పేల్చడంతో సరిహద్దు భద్రతా దళానికి చెందిన ఇద్దరు సిబ్బంది గాయపడ్డారని పోలీసులు తెలిపారు. గర్పా గ్రామం సమీపంలోని తమ శిబిరం నుండి బిఎస్ఎఫ్ రోడ్డు ప్రారంభ బృందం పెట్రోలింగ్‌కు బయలుదేరినప్పుడు ఉదయం ఈ సంఘటన జరిగిందని ఒక పోలీసు అధికారి తెలిపారు. రోడ్డు ప్రారంభ బృందం శిబిరం గర్పా గ్రామం మధ్య ఉన్నప్పుడు నక్సలైట్లు ఐఇడి పేల్చడంతో ఇద్దరు జవాన్లు గాయపడ్డారని ఆయన చెప్పారు. గాయపడిన జవాన్లను ఆసుపత్రికి తరలిస్తున్నట్లు ఆయన తెలిపారు. గురువారం, పొరుగున ఉన్న బీజాపూర్ జిల్లాలో నక్సలైట్లు అమర్చిన ప్రెజర్ ఐఇడి పేలినప్పుడు సిఆర్‌పిఎఫ్ ఎలైట్ జంగిల్ వార్‌ఫేర్ యూనిట్ అయిన కోబ్రాకు చెందిన ఇద్దరు కమాండోలు గాయపడ్డారు. జనవరి 12న, సుక్మా జిల్లాలో 10 ఏళ్ల బాలిక గాయపడింది, బీజాపూర్ జిల్లాలో ఇలాంటి ప్రెజర్ ఐఇడి పేలుళ్లలో ఇద్దరు పోలీసులు గాయపడ్డారు. రెండు రోజుల క్రితం, నారాయణపూర్ జిల్లాలోని ఓర్చా ప్రాంతంలో జరిగిన రెండు వేర్వేరు సంఘటనలలో ఒక గ్రామస్థుడు మరణించగా, మరో ముగ్గురు గాయపడ్డారు. జనవరి 6న బీజాపూర్ జిల్లాలో నక్సలైట్లు ఐఇడితో వాహనాన్ని పేల్చివేయడంతో ఎనిమిది మంది పోలీసు సిబ్బంది, వారి డ్రైవర్ మరణించారు.

# వివాదాలను సామరస్యంగా పరిష్కరించుకోండి

## తమిళనాడు ప్రభుత్వం, గవర్నర్‌కు సుప్రీం హెచ్చరిక

**న్యూఢిల్లీ:** తమిళనాడు ప్రభుత్వం, గవర్నర్ మధ్య నెలకొన్న వివాదాన్ని పరిష్కరించుకోవా లని సుప్రీంకోర్టు సూచించింది. లేనిపక్షంలో తాము జోక్యం చేసుకుని పరిష్కరిస్తామని పేర్కొంది. వివరాల్లోకి వెళితే... తమిళనాడులోని విశ్వవిద్యాలయాలకు వైస్ ఛాన్సలర్ల (వీసీ) నియామకంపై సీఎం స్టాలిన్ ప్రభుత్వం, గవ ర్నర్ ఆర్.ఎన్. రవి మధ్య చాలా కాలంగా వివాదం కొనసాగుతోంది. గవర్నర్ వీసీగా వ్యవహ రించే అధికారాన్ని ప్రభుత్వం రద్దు చేసింది. దీంతో పాటు వివిధ నియామకాల్లో గవర్నర్ అధి కారాలను పరిమితం చేసింది. అయితే ఈ బిల్లు లను ఆమోదించడానికి గవర్నర్ నిరాకరించారు. కాగా, మద్రాస్ విశ్వవిద్యాలయం, భారతియార్ విశ్వవిద్యాలయం, తమిళనాడు ఉపాధ్యాయ శిక్షణ విశ్వవిద్యాలయాలకు వైస్‌ఛాన్సలర్లను నియమించడానికి గవర్నర్ రవి ఒక కమిటీ ఏర్పాటు చేశారు. అయితే ఈ చర్య చట్టవిరుద్ధ మని రాష్ట్ర ప్రభుత్వం ఆరోపించింది. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలోని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నుంచి సభ్యులను తొలగించ డంతోపాటు ఆ కమిటీని పునరుద్ధరించింది. ఈ వివాదం సుప్రీంకోర్టుకు చేరింది. తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్బీ పార్దివాలా నేతత్వం లోని ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ఇరువురు కలిసి బిల్లుల పెండింగ్ వివాదాన్ని పరిష్కరించుకోవడం మంచిదని సూచించింది. లేనిపక్షంతో ఈ సమస్యను తాము పరిష్కరిస్తా మని హెచ్చరించింది.

# 255 మంది అధికారులకు నోటీసులు

## నేడు ఉపలోకాయుక్త విచారణ

బళ్లారి: ప్రభుత్వ అధికారుల పనితీరుపై బళ్లారి జిల్లాలో 95 ఫిర్యాదులు నమోదు కాగా... వాటిని ఈ నెల 18వ తేదీన ఉప లోకాయుక్త అధికారి జస్టిస్ బి.వీరప్ప విచారించనున్నారు. వివిధ శాఖలకు చెందిన 255 మంది అధికారు లపై 95 మంది లోకాయుక్తకు ఫిర్యాదు చేశారు. వీరందరికీ జిల్లా లోకాయుక్త ఎస్పీ ఇప్పటికే నోటీసులు జారీ చేశారు. ఈ నెల 18వ తేదీన జరగనున్న ఉప లోకాయుక్త విచారణకు హాజరు కావాలని నోటీసులో సూచించారు. అన్ని కేసులు విచారణ జరపనున్న ఉప లోకాయుక్త అధికారి అదేరోజు ఫిర్యాదులు పరిష్కరించనున్నట్లు సమాచారం. చాలా వరకు కేసులు ఇప్పటికే విచారణ జరిగాయి. ఇంకా కొన్నికేసులు విచా రణ చేయాల్సి ఉంది. ఉప లోకాయుక్త అధికారి బళ్లారి పర్యటన నేపథ్యంలో జిల్లా పాలనామండ లికి గుబులు పట్టుకుంది. లోకాయుక్త అధికా రులు ఏ ప్రభుత్వ కార్యాలయానికి ఎపుడు వస్తా రోనని అధికారుల గుండెల్లో రైళ్లు పరుగెడుతు న్నాయి. దీంతో రాత్రిపగలు తేడాలేకుండా ఆఫీ సుల్లో ఫైళ్లు సర్దేపనిలో నిమగ్నమయ్యారు. జిల్లా అధికారి అధ్వర్యంలో ఇప్పటికే వివిధ శాఖల అధికారులతో సమావేశా లు నిర్వహించి కార్యా లయాల్లో ఎలాంటి దోషాలు తలెత్తకుండా చూసుకోవాలని అధికారులకు సూచించినట్లు తెలుస్తోంది. దీంతో క్రిందిస్థాయి ఉద్యోగులు, సిబ్బందికి కార్యాలయం ముఖ్యులు విశ్రాంతి లేకుండా పనులు చేయిస్తున్నారు.

# కన్నడ పిసిసి పదవిపై మాటలయుద్ధం



**బెంగళూరు:** కర్నాటక కాంగ్రెస్‌లో రాజకీయం రసవత్తరంగా మారింది. కాంగ్రెస్ నేతల మధ్య అంతర్గత పోరు నడుస్తోంది. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో మరో మంత్రి మాటల యుద్ధానికి దిగారు. కర్నాటక కాంగ్రెస్ అధ్యక్షుడి పోస్టుపై ఇద్దరు నేతల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. దీంతో అధికార పార్టీ వ్యవహారంపై ప్రతిపక్ష బీజేపీ వ్యంగ్యాస్త్రాలు సంధిస్తోంది. కన్నడ కాంగ్రెస్‌లో కలహాలు ఉధతమయ్యేలా ఉన్నాయి. డిప్యూటీ సీఎంతో మరో మంత్రి మాటల యుద్ధానికి దిగారు. నాయకులు ఇష్టానుసారం మాట్లాడరాదని ఇటీవలే అధిష్ఠానం ఆదేశించినా పట్టించుకునే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ విలేకరులతో మాట్లాడుతూ కేపీసీసీ అధ్యక్ష పదవి అంగడిలో దొరకదు. మీడియా ముందు మాట్లాడితే లభించదు. మనం పార్టీకి చేసిన సేవలు, శ్రమను గుర్తించి సరైన పదవి ఇస్తారని, కొంతమంది మీడియా ముందుకొచ్చి పదవి కోరుతున్నారని అన్నారు. పార్టీలో అందరూ క్రమశిక్షణ పాటించాలని రాహుల్‌గాంధీ, సీఎం సిద్దరామయ్య సూచించారన్నారు. కాంగ్రెస్ పార్టీని తానొక్కడే కాదు, కార్యకర్తలు, ప్రజలు కలిసి గెలిపించారన్నారు. ఈ వ్యవహారంపై మంత్రి సతీశ్ జార్కిహోళికి కేపీసీసీ నుంచి నోటీసులు వెళ్లాయి. మరోవైపు, కేపీసీసీ నుంచి నోటీసులు ఇచ్చినప్పటికీ ఏమీ కాదు, దీనికి స్పష్టమైన సమాధానం అధ్యక్షుడి ముందు ఇస్తానని మంత్రి సతీశ్ చెప్పారు. డీకేపై తరచూ విమర్శలు చేస్తున్న ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నోటీస్ ఇచ్చే అధికారం ఆయనకు ఉందన్నారు. కేపీసీసీ రేసులో ఉన్నానని తాను ఎక్కడా చెప్పలేదన్నారు. తన మాటలతో ఎవరికీ ఇబ్బంది లేదని, తాను చేసిన వ్యాఖ్యలను తప్పుగా అర్థం చేసుకున్నారన్నారు. మీడియా ఉదయం హీరోను చేసి, సాయంత్రం విలన్‌ను చేస్తుందని, ఇది సబబు కాదని చెప్పారు.

# మంగళూరు బ్యాంకులో రూ.15 కోట్ల లూటీ

**మంగళూరు:** కర్నాటకలో వరుస దోపిడీలు హడలెత్తిస్తున్నాయి. బీదర్ ఘటన మరవకముందే మంగళూరులో మరో చోరీ జరి గింది. మంగళూరులోని ఉల్లాల్ కేసీ రోడ్డులో కోఆపరేటివ్ బ్యాంకులో ఉద్యోగులను గన్‌తో బెదిరించి ట్రెజరీలోని నగదు, బంగారం దొంగలు దోచుకెళ్లారు. రూ.15 కోట్ల నగదు, 5 లక్షల విలువైన నగలతో పరారయ్యారు. బ్యాంక్ సిబ్బంది భోజన సమ యంలో దోపిడీ జరిగింది. ఐదుగురు దొంగలు చోరీకి పాల్పడ్డా రని ఉద్యోగులు తెలిపారు. బీహార్ గ్యాంగ్ పనిగా అనుమానాలు వ్యక్తం చేశారు. గురువారం బీదర్‌లో పట్టపగలే దోపిడీ దొంగలు రెచ్చిపోయారు. ఏటీఎంకు డబ్బులు తరలిస్తున్న వాహనంపై దోపిడీ దొంగలు దాడి చేశారు. బైక్‌పై వచ్చిన దుండగులు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో ఇద్దరు సెక్యూరిటీ గార్డులు మృతి చెందారు. దాడి అనం తరం డబ్బు పెట్టెతో దుండగులు అక్కడి నుంచి ఉడాయించారు. అందులో రూ.93 లక్షల నగదు ఉన్నట్లు సమాచారం. మరోవైపు దాడి సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిని అక్కడికి చేరుకొని పరిస్థితిని పరిశీలిం చారు. దొంగలు తెలంగాణ వైపు వెళ్లినట్లు బీదర్ పోలీసులు నిర్ధా రించుకున్నారు. దీంతో పోలీసులు బీదర్ నుంచి హైదరాబాద్ చేరుకున్నారు. అఫ్జల్‌గంజ్ వద్ద దొంగలకు బీదర్ పోలీసులు కని పించారు. దొంగల ముఠా తప్పించుకునేందుకు అఫ్జల్‌గంజ్‌లో ఉన్న ఓ ట్రావెల్స్ కార్యాలయంలోకి ప్రవేశించారు. పోలీసులపై కాల్పులు జరుపుతుండగా... అక్కడే ఉన్న ట్రావెల్స్ కార్యాలయం మేనేజర్‌కు బుల్లెట్లు తగిలాయి.అప్రమత్తమైన హైదరాబాద్ పోలీ సులు బీదర్ పోలీసులతో పాటు దొంగల ముఠాను పట్టుకునేం దుకు గాలింపు చేపట్టారు.

# ఆగి ఉన్న బస్సును ఢీకొట్టిన మినీవ్యాన్

## తొమ్మిది మంది మృతి



**పుణే :** పూణే–నాసిక్ హైవేలో శుక్రవారం ఉదయం ఒక టెంపో మినీవ్యాన్‌ను ఢీకొట్టడంతో ఆగి ఉన్న బస్సును ఢీకొట్టిన ప్రమాదంలో కనీసం తొమ్మిది మంది మరణించారని పోలీసులు తెలిపారు. ఉదయం 10 గంటల ప్రాం తంలో నారాయణగావ్ సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. మినీవ్యాన్ నారా యణగావ్ వైపు వెళుతుండగా వెనుక నుండి ఒక టెంపో ఢీకొట్టడంతో రోడ్డు పక్కన ఆగి ఉన్న ఖాళీ బస్సును ఢీకొట్టిందని పూణే రూరల్ పోలీసు సూపరిం టెండెంట్ పంకజ్ దేశ్‌ముఖ్ తెలిపారు. మినీవ్యాన్‌లో ఉన్న తొమ్మిది మంది మరణించారని, మరిన్ని వివరాలు తెలియాల్సి ఉందని ఆయన అన్నారు.

## తక్షణమే ఆరు గ్యారంటీల అమలు

**ప్రజాపక్షం/గుండాల:** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీలను తక్షణమే అమలు చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కూసుమాని హరిచంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా కేవలం మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ఉచిత విద్యుత్ తప్పా నూతన రేషన్ కార్డుల మంజూరు, మహిళలకు రూ. 2500లు, పెన్షన్లు ఇప్పటి వరకు అమలు చేయలేదని అన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలలో భాగంగా ప్రతి ఒక్క హామీని నేరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులకు రైతు భరోసా, రైతు బీమా, రైతు రుణమాఫీ ఇంకా చాలా మంది రైతులకు పూర్తి కాలేదని వాటిని కూడా ప్రభుత్వం తక్షణమే పూర్తి చేయాలని కోరారు. గ్రామాలలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని, ఇంటి స్థలం ఉండి ఇంటిని నిర్మించుకోవడానికి అర్హులకు రూ. 5లక్షలు, కళ్యాణ లక్ష్మీ కింది ఇస్తానన్న తులం బంగారాన్ని అమలు చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## పట్టాలు అందించాలని సబ్ కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** దామరచర్ల మండలంలోని కల్లెపల్లి సర్వే నెం.148లోని భూములను పహాణీలో పెట్టి పట్టాలివ్వాలని గ్రామ ఎస్సీ, ఎస్టీ, బీసీ రైతులు శుక్రవారం స్థానిక సబ్ కలెక్టర్ నారాయణ్‌అమిత్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాతల నాటి నుంచి వ్యవసాయ భూమిలో సేద్యం చేసుకుంటూ ఉన్నామని, అప్పటి తహసీల్దార్ పట్టాలు కూడా ఇచ్చారన్నారు. ఇటీవల తమకు తెలియకుండా పహాణీ నుంచి తమ భూమి పట్టాలను తొలగించారని వారు పేర్కొన్నారు. టీఎం 33 కింద దరఖాస్తు చేసుకున్నామని, ఇప్పటికైనా మా భూమి పట్టాలను ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు జానకిరాములు, నాగయ్య, సైదులు, దాయమ్మ,కోటయ్య, పిచ్చమ్మ, నాగమ్మ, రమణ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## యువత క్రీడల్లో రాణించాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** యువత క్రీడల్లో రాణించి మంచి గుర్తింపు సాధించాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఎన్‌వీఆర్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఆయన బహుమతులు అందచేసి మాట్లాడారు. యువత చదువుతోపాటు క్రీడాల్లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. క్రీడల వల్ల యువకుల్లో మానసిక, శారీరక దారుఢ్యం అలవరుడుతుందన్నారు. కార్యక్రమంలో ఎన్‌వీఆర్ ఫౌండేషన్ ఛైర్మన్ నూకల వేణుగోపాల్‌రెడ్డి, నాయకులు చిలుకూరు బాలు, రవినాయక్, జానిపాషా, ముదిరెడ్డి నర్సిరెడ్డి, ధర్మానాయక్, రమేష్‌నాయక్, చక్రినాయక్, శరత్, అశోక్, అనిల్‌కుమార్, కృష్ణ, నాని పాల్గొన్నారు.

## సుధా బ్యాంక్ రజతోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/సూర్యాపేట:** జిల్లా కేంద్రంలోని సుధా బ్యాంక్ ప్రారంభించి 25 సంవత్సరాలు పూర్తి కావడంతో బ్యాంకు రజతోత్సవ వేడుకలను శుక్రవారం చైర్మన్ మీలా మహాదేవ్, మేనేజింగ్ డైరెక్టర్ పెద్దిరెడ్డి గణేష్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వేడుకలు మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు. రేపు(శనివారం) బహుళ పంచమి సందర్భంగా 22వ త్యాగరాజ ఆరాధన ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యఅతిథిగా ఎన్‌ఆర్‌ఐ, ఆప్త ఫౌండేషన్ చిమటా శ్రీనివాస్ పాల్గొంటున్నట్లు తెలిపారు. ప్రముఖ సంగీత విధ్వంసరాలు డాక్టర్ ద్వారం లక్ష్మి ని సన్మానించిన అనంతరం పోపూరి పల్లవి కర్ణాటక గాత్ర కచేరితో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం బ్రాంచ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూం, లాకర్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ వైస్ చైర్మన్ పొనుగోటి నిర్మల, డైరెక్టర్లు భువనగిరి భాస్కర్, కక్కిరేణి చంద్రశేఖర్, శంకర్‌లాల్, ఏపూరి శ్రావణ్ కుమార్, సుజాత, డాక్టర్ సందీప్, పెద్దిరెడ్డి రాజా, తోట శ్యామ్, గుడిపూడి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## గ్రామసభల ద్వారా ప్రభుత్వ పథకాలు

**ప్రజాపక్షం/ ఉండవెల్లి :** ఈనెల 21 నుంచి ప్రభుత్వము అందించే నాలుగు పథకాలనను అర్హుల ఎంపిక గ్రామసభల ను ఏర్పాటు చేసి అభ్యర్థులు ఎంపిక చేస్తున్నట్లు ఉండవెల్లి తాసిల్దార్ హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో సమావేశ నిర్వహించి ప్రణాళిక రూపొందించినట్లు వారు తెలిపారు. 24 వరకు గ్రామ సభల ద్వారా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలోనూ ప్రభుత్వం పథకాలపై రైతు భరోసా ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక ఇందిరమ్మ ఆత్మీయ భరోసా రేషన్ కార్డులు ఎంపిక కార్యక్రమాన్ని గుర్తించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధి అధికారి తిరుపత న వ్యవసాయ అధికారి అనిత పశువైద్యాధికారి శిరీష తదితరులు పాల్గొన్నారు.

## అధిక ధరలకు అమ్మితే చర్యలు

**ప్రజాపక్షం/ నాంపల్లి:** ఎవరైనా సీతల పానీయాలు అధిక ధరలకు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని లీగల్ మెట్రాలజీ జిల్లా అధికారి శ్రీనివాస్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలో శీతల పానీయాలు అధిక ధరలకు అమ్ముతున్నా సమాచారంతో పలు దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు పలు దుకాణాలకు ఇతరులను పంపించి అధిక ధరలకు అమ్ముతున్నారని తెలిసినా అనంతరం దుకాణాల యజమానులపై కేసు నమోదు చేసి ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశానుసారం ఏ వస్తువులు కూడా ఎమ్మార్పీ కంటే అధిక ధరకు అమ్మకూడదని ఈ నిబంధనను ఎవరు అధికమైన సహించేది లేదని తెలిపారు. ఎక్కడైనా వస్తువులను ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధరకు అమ్ముతున్నట్టు తెలిస్తే తమకు సమాచారం అందించాలని సూచించారు. ఆయన వెంట సిబ్బంది తదితరులు ఉన్నారు.



# ప్రజలు పనులకు వెళ్ళినప్పుడు సర్వే నిర్వహించొద్దు

### రాష్ట్ర మహిళ, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి, జిల్లా ప్రత్యేక అధికారి అనితా రామచంద్రన్




**ప్రజాపక్షం / నల్లగొండ ప్రతినిధి :** రైతు భరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు,ఇందిరమ్మ ఇండ్లపై నిర్వహించనున్న గ్రామసభలను ఓపికతో, పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర మహిళ, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి, జిల్లా ప్రత్యేక అధికారి అనితా రామచంద్రన్ జిల్లా అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆయా పథకాలకు ఎంపిక సంబంధించి నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల స్థాయి సూపర్వైజర్లు అధికారులు, జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నాలుగు పథకాలకు సంబంధించి విధివిధానాలను గ్రామ సభలో ప్రజలకు వివరించి జాబితాను చదివి వినిపించి జాబితాలో అనర్హులు ఉన్నట్లయితే నిర్ధారించుకొని అర్హులను మాత్రమే ఆయా పథకాలకు ఎంపిక చేయాలని ఆమె తెలిపారు. గ్రామ సభలను ప్రజలు అందుబాటులో ఉన్నప్పుడే నిర్వహించాలని, ప్రజలు పనులకు వెళ్ళినప్పుడు నిర్వహించవద్దని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన ప్రకారం కొన్ని పథకాల కింద లబ్ధిదారుల సంఖ్య ఎక్కువ ఉన్నప్పటికీ మొదటి విడతన ప్రాధాన్యత క్రమంలో లబ్ధిదారులకు ఆయా పథకాల లబ్ధిని అందజేయడం జరుగుతుందని ,ఈ విషయాన్ని స్పష్టంగా తెలియజేయాలని ఆమె అన్నారు. జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ రైతు భరోసా సర్వేకు జిల్లాలో 140 బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందని ,ఈ నెల 16 నుండి రైతు భరోసా క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహిస్తున్నామని, ఇప్పటివరకు 138 రెవెన్యూ గ్రామాలలో సర్వేను పూర్తి చేయడం జరిగిందని , ఎప్పటికప్పుడు అర్హత జాబితా డేటా నమోదు చేస్తున్నామని తెలిపారు. అలాగే రేషన్ కార్డులకు సంబంధించి వచ్చిన అర్హత జాబితాను, దరఖాస్తులను ఆయా మండలాల వారిగా సిబ్బంది ద్వారా క్షేత్ర స్థాయి పరిశీలన చేయిస్తున్నామని ,ఇప్పటివరకు 70 సర్వేను పూర్తి చేసినట్లు ఆమె వెల్లడించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో భాగంగా రాష్ట్రస్థాయి నుండి వచ్చే జాబితాకు ఆధార్ కార్డు, జాబ్ కార్డు అనుసంధానం చేసి లబ్ధిదారులను గుర్తించడం జరుగుతుందని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల కింద అర్హత ఉన్న జాబితాను 21 నుండి 24 వరకు నిర్వహించే గ్రామ సభలో ప్రజలకు వివరించి గ్రామ సభల ఆమోదం పొందిన తర్వాత ఇంచార్జ్ మంత్రివర్యులతో అనుమతి తీసుకోవడం జరుగుతుందని కలెక్టర్ వెల్లడించారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్ , అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# నిజమైన లబ్ధిదారులకు అందించడానికే సర్వే

### యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు వంటి ప్రభుత్వ పథకాలు అర్హులైన లబ్ధిదారులకు అందజేయడం కోసం క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహిస్తున్నామని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. శుక్రవారం యాదగిరిగుట్ట మున్సిపాలిటీలోని యాదగిరి పల్లి, తుర్కపల్లి మండలంలోని వెలుపులపల్లి, బొమ్మలరామారం మండలంలోని ప్యారారం గ్రామం, బీబీనగర్ మండలం ,గ్రామ పంచాయతీ, భువనగిరి మండలంలోని అనంతారం గ్రామాలలో రైతు భరోసా, రేషన్ కార్డుల జారీ ప్రక్రియను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా సర్వే నంబర్లు లలో గల రైతులకు సంబంధించిన పట్టా భూములను, అసైన్డ్ స్థలాలను పరిశీలించి అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. సర్వేలో భాగంగా వ్యవసాయ భూమి దగ్గరికి వెళ్లి రైతు దగ్గర నుండి వివరాలు సేకరించారు. కలెక్టర్ రైతు తో మాట్లడుతూ ఎంత వ్యవసాయ భూమి ఉందని, దానిలో ఎంత మేరకు ఇల్లు, ప్లాట్లు చేయడం జరిగిందని ఆరా తీశారు. ప్రభుత్వ మార్గదర్శకాలకూ అనుగుణంగా రైతు భరోసా పథకానికి సంబంధించిన వ్యవసాయ యోగ్యమైన భూములకు మాత్రమే రైతు భరోసా వర్తిస్తుందని కలెక్టర్ తెలిపారు. భూభారతి (ధరణి ) పోర్టల్‌లో నమోదైన వ్యవసాయ భూములకే రైతు భరోసా చెల్లిస్తుందని, లేఅవుట్లు చేసిన భూములు,రాళ్లు, రప్పలు, నాలా కన్వర్షన్, చేసిన భూములు, సాగుకు అనువుగా లేని భూములను నిశితం గుర్తించి రైతు భరోసా తొలగించాలని సంబంధిత అధికారులకు సూచించారు. రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి వివరాల ప్రకారం పలు లబ్ధిదారుల ఇళ్ల కు వెళ్లి వారి పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఇంటి సభ్యులతో మాట్లాడారు ఇంట్లో ఎంతమంది కుటుంబ సభ్యులు వుంటారని , ఏమి వృత్తి చేస్తారు, ఇల్లు ఎవరి పేరు మీద ఉందని, ఏమి అయినా పొలం వుందా అని వివరాలు సేకరించారు. రికార్డులను పరిశీలించారు.ఫీల్ వెరిఫికేషన్ లో తప్పిదాలకు తావు లేకుండా పూర్తి పారదర్శకంగా లబ్ధిదారుల జాబితాను రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దారిద్ర రేఖకు దిగువన ఉన్న వారికీ ఈ పథకం వర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యాదగిరిగుట్ట మండల తహసీల్దార్ దేశ్య, వ్యవసాయ అధికారి సుధా రాణి, తుర్కపల్లి ఎంపీడీవో ఝాన్సీ భాయ్, శ్రీ ఉమా, బొమ్మలరామారం తహసీల్దార్ శ్రీనివాస్, బీబీనగర్ తహసీల్దార్, భువనగిరి ఎంపీడీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

## బాలలు, మనోవైకల్యం హక్కుల రక్షణకు కృషి




**ప్రజాపక్షం/సూర్యాపేట:** బాలలు, మానసిక వికలాంగుల హక్కుల రక్షణకు న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు కృషి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గోవర్ధన్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని న్యాయసేవ అధికార సంస్థ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల, బాలికలు, మనో వైకల్యం ఉన్న బాలలకు హక్కులు ఉంటాయని, మానసిక వికలాంగుల రక్షణకు ఎవరైన విఘాతం కలిగిస్తే వెంటనే జిల్లా న్యాయ సేవా సంస్థను ఆశ్రయించాలని కోరారు. జిల్లా న్యాయసేవ అధికార సంస్థ కార్యదర్శి పి శ్రీవాణి మాట్లాడుతూ ప్రజల్లో న్యాయ పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు జిల్లాలోని అనేక ప్రాంతాల్లో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాల, బాలికల హక్కుల పరిరక్షణ కోసం సంస్థ ఎల్లవేళలా సిద్దంగా ఉంటుందని తెలిపారు. శిక్షణ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ లీగల్ ఎడ్ డిఫెన్స్ కౌన్సిల్ మెంబర్స్ సత్యనారాయణ పిళ్లై, డిప్యూటి లీగల్ ఎయిడ్ కౌన్సిల్ బొల్లెద్దు వెంకటరత్నం, డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫిసర్ బి రవికుమార్, సిడబ్ల్యూసి చైర్మన్ రమణారావు, జెజెబి మెంబర్ మోహన్ రావు, సైకియాట్రిస్ట్ డాక్టర్ ఎన్ స్రవంతి, అరోరా లా కాలేజ్ ప్రిన్సిపల్ ఎన్ యాదగిరి, రిటైర్డ్ జ్యూడిషియల్ ఆఫిసర్ నరసింహచారి, ప్యానల్ న్యాయవాదులు, లీగల్ ఎడ్ డిఫెన్స్ కౌన్సిల్ సభ్యులు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

## వెంకటయ్య ఆశయాలు సాధిద్దాం



**ప్రజాపక్షం/మోత్కూర్ :** కొంపల్లి వెంకటయ్య ఆశయాలను సాధిద్దామని సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెడ చంద్రయ్యలు కోరారు. శుక్రవారం మోత్కూరు మున్సిపల్ కేంద్రంలోని కేఆర్ భవన్‌లో కామ్రేడ్ కొంపల్లి వెంకటయ్య 14వ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ కొంపల్లి వెంకటయ్య తన చిన్ననాటి నుండి విద్యార్థి సంఘంలో పనిచేస్తూ జిల్లా సహాయ కార్యదర్శిగా మోత్కూరు సిపిఐ పార్టీ మండల కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికై పార్టీ ఇచ్చిన పోరాటాల పిలుపులకు ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసేవాడని అతని మరణం పార్టీకి ఆ కుటుంబానికి తీరనిలోటు అని వారి ఆశయ సాధన కోసం అందరం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాసికంటి లక్ష్మీ నరసయ్య, సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పల ముత్యాలు, సిపిఐ మం డల కార్యదర్శి అనెపు వెంకట్, గీత పనివాళ్ల సంఘం జిల్లా అధ్యక్షులు చాపల అంజయ్య, ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు బుష్పాక నరసింహ, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శ మహేష్, మోత్కూరు పట్టణ కార్యదర్శి పుల్కరం మల్లేష్, కొంపల్లి వెంకటయ్య, కుమారుడు కొంపెల్లి తేజ నివాళులర్పించారు.

## డ్రోన్ సహాయంతో టిబి శాంపిల్స్

**ప్రజాపక్షం/అడ్డగూడూరు:** మండలంలోని గట్టు సింగారం గ్రామంలో శుక్రవారం టీబీ లక్షణాలు ఉన్నవారి నుండి శాంపిల్స్ తీసి రామన్నపేట ఏరియా ఆసుపత్రికి పంపి అక్కడినుండి బీబీనగర్ ఎయిమ్స్ ఆస్పత్రికి తరలింపు చేయడం జరిగింది. ఈ సందర్భంగా అడ్డగూడూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ భరత్ రాథోడ్ మాట్లాడుతూ ఈ డ్రోన్ వల్ల ప్రతి ఒక్క మారుమూల గ్రామాలకు వెళ్లి అక్కడున్నటువంటి టీబి లక్షణాలు కలిగిన వారి నుంచి శాంపిల్స్ తీసి త్వరగా ఆస్పత్రులకు పంపించడం వల్ల వారికి ఈయొక్క లక్షణాలు ఉన్నట్లయితే పేదవారికి మెరుగైన వైద్యం అందించడంతో పాటు తక్కువ సమయంలో టీబీ లక్షణాలున్న వారికి మెడిసిన్ అందించడం ఈ డ్రోన్ చాలా ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్స్ శారదా సూపర్వైజర్ సరోజన, ఎంఎల్‌హెచ్‌పి మౌనిక, ఏఎన్ఎం విజయ, ఎయిమ్స్ సిబ్బంది, ఎస్.విద్యాసాగర్, నందాకిశోర్, డ్రోన్ పైలెట్స్, ఆశ కరకర్తలు ఈ.దుర్గమ్మ, ఎస్.మదనమ్మ, ఎస్‌టిఎల్‌ఎస్ జానకి తదితరులు పాల్గొన్నారు.



# అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు

### డేటాను సక్రమంగా నమోదు చేయాలి
### కలెక్టర్ తేజస్ నందాలాల్ పవార్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్(మఠంపల్లి):** ప్రభుత్వ పథకాలకు అర్హులైన వారి వివరాలను జాగ్రత్తగా పరిశీలించి అవసరమైన డేటాను సక్రమంగా నమోదు చేయాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందాలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన రైతుభరోసా,ఇందిరమ్మ ఆత్మీయ భరోసా,నూతన ఆహార భద్రత కార్డులు,ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారుల ఎంపికకై హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని మఠంపల్లి మండలంలోని పెదవీడు,చౌటపల్లి గ్రామాలలో జరుగుతున్న సర్వేను కలెక్టర్ శుక్రవారం ఆకస్మీకంగా తనిఖీ చేశారు. పెదవీడు,చౌటపల్లి గ్రామాలలో రైతు భరోసా పథకంలో భాగంగా రైతులకు సంబంధించిన పట్టాభూములు,అసైన్డ్ భూములను పరిశీలించారు. పెదవీడులోని 252,253,540,సర్వేనంబర్‌లలో ఉన్న మైనింగ్ లీజు ఏరియా,విశ్వంభర సిమెంట్ భూములను కలెక్టర్ పరిశీలించారు. 252,253 సర్వే నంబర్‌లలో సేద్యం అవుతున్న భూములను,సేద్యం చేయని భూములను,చౌటపల్లిలోని 875 సర్వే నంబర్‌లో లావుణి పట్టా భూములను,540 సర్వేనంబర్‌లో వ్యవసాయ,వ్యవసాయేతర భూములను కలెక్టర్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డేటా నమోదులో ఎటువంటి తప్పిదాలు జరగకుండా చూడాలని,అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేటట్లుగా బాధ్యతగా సర్వేను నిర్వహించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. 252,253, సర్వేనంబర్‌లలో కొంత సాగు చేయని భూమిని గుర్తించినట్లుగా తెలిపారు. ఈ కార్యక్రమంలో హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు,తహశీల్దార్ మంగ,డిప్యూటీ ల్యాండ్ సర్వేయర్ వంశీ,ఏడీఏ రవికుమార్,ఏఈఓ రమ్య,మండల సర్వేయర్ సమీర్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్యం కోసం డబ్బులు అడుగుతున్నారా...

### దేవరకొండ ఏరియా ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ ఏరియా ఆసుపత్రిని శుక్రవారం నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని మాత శిశు సంరక్షణ విభాగాన్ని, క్యాజువాలిటిని, డయాలసిస్ విభాగాలను తనిఖీ చేసి అక్కడ సౌకర్యాలు, రోగుల వివరాలను సూపరింటెంట్ మంగ్త్యనాయక్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. అంతేకాక ఆసుపత్రికి వస్తున్న రోగుల వివరాలను, అవుట్ పేషెంట్, ఇన్ పేషెంట్ రిజిస్టర్లను తనిఖీ చేసి పరిశీలించారు. ఆసుపత్రికి చికిత్స నిమత్తం వచ్చిన రోగులతో ముఖా ముఖి మాట్లాడి సమయానికి వైద్యులు ఆసుపత్రికి వస్తున్నారా, ఏవరైనా మిమ్మల్ని వైద్యం కోసం డబ్బులు అడుగుతున్నారా, వైద్య చికిత్సలు ఎలా అందిస్తున్నారు అని ఆరా తీశారు. ఆసుపత్రి సూపరింటెంట్, వైద్యులతో మాట్లాడుతూ ఆసుపత్రిలో అన్ని సౌకర్యాలు ఉన్నాయా అని అడగగా నీటి సమస్య ఉందని, సూపరింటెండెంట్ జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. దీంతో పాటు రాత్రి సమయాల్లో కొంత మంది మద్యం తాగి ఆసుపత్రికి వస్తున్నారని అందు వల్ల ఆసుపత్రి ఆవరణలో పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేయగా, పోలీస్ అధికారులతో మాట్లాడి పోలీస్ అవుట్ పోస్టు ఏర్పాటు చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఆసుపత్రిలో నెలకొన్న నీటి సమస్యను తక్షణమే తీర్చాలని దేవరకొండ మునిసిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్య ఎలా ఉందని, డాక్టర్ల పనితీరు తదితర విషయాలను అడిగి కనుకున్నారు. దేవరకొండ ప్రాంతంలో మొత్తం గిరిజనులు ఎక్కువగా ఉంటారని, వారందరికి మంచి వైద్య సేవలు అందించాలని, ముఖ్యంగా దేవరకొండ పరిధిలో మాత, శిశు మరణాల సంఖ్య ఎక్కువగా ఉందని వీటిని తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని ఆమె డాక్టర్లను ఆదేశించారు. ఆసుపత్రిలోకి పశువులు, జంతువుల వంటివి రాకుండా గేటు వద్ద పశువుల ట్రాప్ ఏర్పాటు చేస్తామని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ దేవరకొండ మునిసిపల్ పరిధిలోని తాటికోల్ రోడ్‌లో నిర్వహిస్తున్న రేషన్ కార్డుల సర్వే ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే ఎలా చేస్తున్నారని సర్వే బృందాలతో అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించిన మేరకు నూతన రేషన్ కార్డులకు అర్హత ఉన్న వాటిని ఎంపిక చేయాలని, ప్రత్యేకించి ఇతర అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని అర్హులైన వారికి మాత్రమే ఎంపిక చేసే విధంగా చూడాలని కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. కలెక్టర్ వెంట ఆర్డీవో రమణారెడ్డి, తహశీల్దార్ సంతోష్‌కిరణ్, ఏరియా ఆసుపత్రి సూపరిండెంట్ మంగ్త్యనాయక్, సిఐ నర్సింహా ఉన్నారు.

## సత్యంను పరామర్శించిన నేతలు



**ప్రజాపక్షం /మునుగోడు:** సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం మాతృమూర్తి పార్వతమ్మ ఇటీవల మృతి చెందారు. మునుగోడు మండలం ఎల్లగూడెం గ్రామంలో శుక్రవారం పార్వతమ్మ చిత్రపటానికి వరంగల్ మాస్టర్ జీ విద్యాసంస్థల చైర్మన్ సంగంరెడ్డి సుందర్ రాజ్ యాదవ్, కవి, రచయిత, రామన్నపేట డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా బెల్లి యాదయ్య, యాదవ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు తరాల పరమేశ్ యాదవ్, యాదవ జర్నలిస్టుల ఉమ్మడి జిల్లా కన్వీనర్ మామిడి దుర్గాప్రసాద్ యాదవ్, బిజెపి రాష్ట్ర నాయకులు పిల్లి రామరాజు యాదవ్ లు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నెల్లికంటి సత్యం కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సురిగి చలపతి,టి వెంకటేశ్వర్లు,పందుల యాదయ్య, నెల్లికంటి రమేష్ యాదవ్, ఏర్పుల క్రాంతి కుమార్,పేరుమాల్ల శ్రీరామ్,బాతుక శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.



## అర్హులందరికీ రేషన్‌కార్డులు ఇవ్వాలి

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్(గరిడేపల్లి):** ప్రభుత్వం ఎటువంటి ఆంక్షలు లేకుండా అర్హులైన వారందరికీ ప్రభుత్వం రేషన్ కార్డులు ఇవ్వాలని గరిడేపల్లి సిపిఐ మండల కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శుక్రవారం సిపిఐ మండల కమిటీ ఆధ్వర్యంలో గరిడేపల్లి ఎంపిడిఒ కార్యాలయం ముందు ధర్నా చేసి ఎంపిడిఒకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరుగ్యారంటీల హామీలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తూచా తప్పకుండా అమలు చేయాలన్నారు. ప్రభుత్వ పథకాల అమలుకై జరిగే ఎంపికలో పూర్తిస్థాయిలో అర్హులను గుర్తించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు త్రిపురం సుధకార్ రెడ్డి,మండల కార్యవర్గసభ్యులు కడియాల అప్పయ్య,యడ్ల అంజిరెడ్డి,కుందూరు వెంకటరెడ్డి,గోధుమల ఈశ్వరీచారి,దైద చద్రాక్,గోవిందు,బాలకృష్ణ,చందాల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** చౌటుప్పల్ మున్సిపాలిటీ రాష్ట్రంలోనే మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ఐదు సంవత్సరాలుగా పనిచేశానని మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు అన్నారు. చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు.మున్సిపల్ అభివృద్ధి కొరకు 150 కోట్ల రూపాయలతో అన్ని వార్డులలో రోడ్ల నిర్మాణాన్ని చేపట్టామని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో మున్సిపల్ లో ఎన్ని అభివృద్ధి పనులు చేశామని అన్నారు. మున్సిపాలిటీలో ప్రధాన సమస్య అయిన మంచినీటి కోసం నాలుగు ట్యాంకుల నిర్మాణానికి పనులు ప్రారంభించామని అవి ప్రస్తుతం పురోగతిలో ఉన్నాయని మాట్లాడారు. తంగడపల్లి రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేశామని లైటింగ్ ఏర్పాటు చేయాల్సి ఉందని తెలిపారు. చిన్న కొండూరు రోడ్డు విస్తరణకు పనులు త్వరలో ప్రారంభమవుతాయని ఎమ్మెల్యే ఆ వైపుగా ప్రయత్నం చేస్తున్నారని కాంట్రాక్టర్ ఇతర నిర్లక్ష్యం వల్ల కాస్త అసంపూర్తిగా ఉందని ఐన కూడా పూర్తి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సురివి నరసింహ గౌడ్ పాల్గొన్నారు.

## కన్న కొడుకును కత్తితో నరికి చంపిన తండ్రి




ప్రజాపక్షం/మనోహరాబాద్: కన్న కొడుకును కనికరం లేకుండా కత్తితో నరికి చంపిన సంఘటన లింగారెడ్డిపేట గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మనోహరాబాద్ మండలంలోని లింగారెడ్డిపేట గ్రామానికి చెందిన మాదాసు శ్రీకాంత్ 29 సం॥ ప్రతిరోజు ఆకతాయిలా తిరుగుతూ విచ్చలవిడిగా మద్యం సేవిస్తూ చెడు అలవాట్లకు బానిస అవుతున్నాడని తల్లిదండ్రులు కొడుకుని మందలించడంతో రాత్రి పగలు తేడా లేకుండా మద్యం సేవిస్తూ కుటుంబ సభ్యులందరినీ చంపుతానని బెదిరించేవాడు. రోజులాగే శ్రీకాంత్ మద్యం సేవించి గురువారం సాయంత్రం తల్లిదండ్రులను చంపుతానంటూ ఘర్షణకు దిగాడు. కొడుకు పెడుతున్న చిత్రవధను తట్టుకోలేక అర్ధరాత్రి శ్రీకాంత్ గాడ నిద్రలో ఉండగా తండ్రి దుర్గయ్య కొడుకుపై కనికరం లేకుండా కారంపూడి చల్లి కత్తితో దాడి చేసి నరికి చంపేశాడు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయాడు. విషయం తెలుసుకున్న సీఐ రంగా కృష్ణ, మనోహరాబాద్ ఎస్సై సుభాష్ గౌడ్‌లు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం తూప్రాన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కేసు నమోదు చేసుకుని నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సిఐ రంగా కృష్ణ తెలిపారు.

# లేని భూమి కోసం 65 ఏళ్లకుపైగా న్యాయ పోరాటం

### ఆస్మాన్ జాహి పైగా భూములపై పిటిషన్లు మూసేసిన హైకోర్టు
### 1958 నుంచి జరుగుతున్న లిటిగేషన్‌కు తెర

ప్రజాపక్షం/హైదరాబాద్ : క్షేత్ర స్థాయిలో లేని భూమి కోసం ఆస్మాన్ జాహి పైగా వారసులు, వాళ్ల నుంచి భూమిని కొనుగోలు చేసిన వాళ్లు గత 66 ఏండ్లుగా న్యాయపోరాటంపై హైకోర్టు తీర్పు వెలువరించింది. రాజీ విధానంలో భాగస్వామ్య పరిష్కారం చేసుకోవాలనే నిర్ణయానికి కక్షిదారులు వచ్చినప్పటికీ అసలు అక్కడ భూమే లేదని హైకోర్టు వెల్లడించింది. భూమే లేనప్పుడు భాగస్వామ్య పరిష్కారమనే అంశమే ఉత్పన్నం కాబోదని తేల్చి చెప్పింది. 25 గ్రామాల్లో భౌతికంగా ఉనికిలో లేని భూముల కోసం ఆస్మాన్ జాహి పైగా వారసులు, వారి నుంచి కొనుగోలు చేసినవారు 66 ఏళ్లుగా న్యాయపోరాటం చేయడంపై హైకోర్టు ఆ విధమైన తుది నిర్ణయానికి వచ్చింది. కమిషనర్ ఆఫ్ సెటిల్మెంట్ సర్వే 1977లో ఇచ్చిన నివేదికను తోసిపుచ్చుతున్నట్లు వెల్లడించింది. 2022లో నియమితులైన కమిషనర్ కమ్ కోర్టు రిసీవర్ సమర్పించిన రిపోర్టు ప్రకారం ఆయా గ్రామాల్లో పిటిషనర్లు చెబుతున్న భూములు లేవని గుర్తు చేసింది. లేని భూముల కోసం ఇనేళ్లుగా లిటిగేషన్ కొనసాగడంపై విస్మయాన్ని వ్యక్తం చేసింది. క్షేత్ర స్థాయిలో భూములే లేనప్పుడు వాటిపై 66 ఏళ్ల క్రితం అంటే 1958 ఏడాది నాటి కేసులో విచారణ కొనసాగింపు అవసరం లేదని వెల్లడించింది. పిటిషన్‌పై విచారణను మూసేస్తున్నట్లు ప్రకటించింది. 1977 ఏడాదిలో కమిషనర్ ఆఫ్ సెటిల్మెంట్ సర్వే రిపోర్టు మేరకు జారీ చేసిన ఫైనల్ డిక్రీ చెల్లదని చీఫ్ జస్టిస్ ఆలోక్ ఆరాదే, జస్టిస్ ఎన్ వి శ్రవణ్ కుమార్‌లతో కూడిన డివిజన్ బెంచ్ ఇటీవల తీర్పు చెప్పింది.

**ఏం జరిగిందంటే..**

నవాబ్ మొయిన్ –దౌలా బహదూర్, అస్మాన్ జహ్ బహదూర్‌ల చట్టపరమైన వారసుల్లో, కుటుంబ మాతృక ఆస్తులపై రాయదుర్గ్, షంషిగుడాల్లో అనేక మక్తాలు ఉన్నాయి. మాతృక అస్తులకు సంబంధించి భాగపరిస్కారానికి సుల్తానా జహాన్ బేగం 1953లో సిటీ సివిల్ కోర్టులో కేసు వేశారు. ఆ తర్వాత ఈ వివాదం 1958లో హైకోర్టుకు చేరింది. రాజీ డిక్రీ ద్వారా 1950 ఏప్రిల్‌లో ప్రిలిమనరీ డిగ్రీ జారీ కూడా వెలువడింది. ప్రిలిమినరీ డిక్రీ అమలు చేయాలని కోరుతూ రాజా కిషన్‌దాస్, నవాబ్ సలీం ఖాన్‌లు కమిషనర్/ రిసీవర్లుగా నియమితులయ్యారు. 1959 ఏప్రిల్ 6న ప్రిలిమినరీ డిక్రీ జారీ సూట్‌లోని ఆస్తుల వ్యవహారాలను పరిశీలించేందుకు కమిషనర్ల నియామకం జరిగింది. ఏడాదికి పొడిగిస్తూ వచ్చారు. 230 నుంచి 254 వరకు 25 గ్రామాల్లోని సుమారు 320 ఎకరాల అస్తులు రెన్యూ శాఖ వివాదంలో ఉన్నాయి. ఇవి ప్రభుత్వం నుంచి విడుదలై ఆస్మాన్ జాహి పైగాకు చెందినప్పుడు వాటిని రిసీవర్లు తమ భాగాలను పంపిణీ చేయాలన్నది రాజీ డిక్రీ సారాంశం. దీనిపై దాఖలైన పిటిషన్‌లో 1968 నుంచి ఒకటి తర్వాత మరొకటి చొప్పుడు అప్లికేషన్లు దాఖలౌతూ వచ్చాయి. దీనిపై ప్రాదమిక డిక్రీ ఆధారంగా తుది డిక్రీ జారీకి 2012 డిసెంబరు 20న జిల్లా మాజీ జడ్జీలు మహ్మద్ బాండే అలి, కె.అజిత్ సింహారావులను రిసీవర్ కమ్ కమిషనర్సగా హైకోర్టు నియమించింది. నివేదిక సమర్పించాలన్న ఆదేశాల మేరకు 2023 జులై 6వ తేదీన కమిషనర్ సమర్పించిన నివేదికలో అందుబాటులో ఉన్న భూముల పంపిణీ జరిగిందని, 230 నుంచి 251 వరకు ఉన్న 25 మక్రాల భూములు ప్రభుత్వం నుంచి విడుదల కాలేదని పేర్కొన్నారు. 1977 నాటి రిసీవర్ నివేదిక మేరకు రాయదుర్గ్ పైగా, షంషీగూడ పైగా గ్రామాల భూములకు తుది డిక్రీ జారీ అయినట్లు కూడా పేర్కొన్నారు. వాస్తవాలను పరిశీలించకుండా నివేదిక జారీ అయ్యిందన్నారు.

**వాదప్రతివాదనలు :**

1977 నివేదిక ఆధారంగా ఫైసల్ డిగ్రీ జారీ అయిందని, ఆస్మాన్ జాహి వారసుల నుంచి భూములు కొనుగోలు చేశామని, వాటిని తమకు అప్పగించాలని కోరుతూ ఇతరులు కూడా పిటిషన్లు వేశారు. సీసీఎల్‌ఏ ప్రొసీడింగ్స్, కోర్టు ఉత్తర్వులను పరిశీలించకుండా రిసీవర్ సమర్పించిన నివేదిక చెల్లదన్నారు. రిసీవర్ నివేదిక ఆధారంగా హైకోర్టు, సుప్రీం కోర్టుల తీర్పులు చెల్లవనడం సబబుకాదన్నారు. ప్రిలిమనరీ డిక్రీలో పేర్కొన్న ప్రకారం ఆస్తులను భాగపరిష్కారం చేయాలేగానీ పరిధిని అతిక్రమించి రిసీవర్ భూములు లేవనడం చెల్లదన్నారు. ప్రభుత్వం తరపున అదరపు అడ్వొకేట్ జనరల్ ప్రతివాదన చేస్తూ జాగీర్ రద్దు అయినందున భూములన్నీ ప్రభుత్వానివేనని చెప్పారు. కొందరు మోసపూరితంగా భూముల్ని పొందాలనే ప్రయత్నాలను అడ్డుకోవాలని కోరారు.


**లేని భూమి కోసం 66 ఏళ్లుగా లిటిగేషన్ :**

వాదనల అనంతరం హైకోర్టు, 1959 ఏప్రిల్ 8న ప్రాథమిక డిక్రీలోని 230 నుంచి 254 వరకు ఆస్మాల్ జాహి పైగాకు అనుకూలంగా విడుదల చేసినట్లు లేదని తేల్చింది. కమిషనర్ ఆఫ్ సెటిల్మెంట్ సర్వే మక్తా భూములను రిలీజ్ చేస్తూ 1977 డిసెంబరు 30న ఇచ్చిన ఉత్తర్వులు ఉన్నాయని పిటిషనర్లు చెబుతున్నప్పటికీ, 230 నుంచి 251 వరకు విస్తీర్ణం ఎంతో చెప్పలేదని ఆక్షేపించింది. 1977 నివేదిక ద్వారా విడుదలైందనే పిటిషనర్ల వాదనలకు అనుగుణంగా ఆధారాలు చూపలేదని తప్పు పట్టింది.

నిజంగానే 1977లో విడుదలైతే భూముల్ని ఎందుకు స్వాధీనం చేసుకోలేదో పిటిషనర్ల నుంచి వివరణ లేదని పేర్కొంది. ప్రభుత్వం నుంచి భూములు విడుదలైతేనే భాగపరిష్కారానికి ఆస్కారం ఉంటుందని, ఇక్కడి కేసులో ప్రభుత్వం నుంచి భూమి విడుదల కానప్పుడు భాగపరిష్కారానికి తావే ఉండదని స్పష్టం చేసింది. ఉనికిలో లేని భూముల కోసం 66 ఏళ్లుగా లిటిగేషన్‌ను కొనసాగించారని వ్యాఖ్యానించింది. కక్షిదారులకు చట్ట ప్రకారం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టేందుకు సీఎస్ 7/1958 ... పిటిషన్‌పై విచారణను మూసేస్తున్నట్లు తీర్పులో పేర్కొంది.

# నీటి వాటాల పాపం బిఆర్‌ఎస్‌దే

### పదేళ్ల పాటు తెలంగాణకు తీరని ద్రోహం
### నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



హైదరాబాద్: నీటి వాటాల పాపం బిఆర్‌ఎస్‌దేనని, పదేళ్ల పాటు తెలంగాణకు తీరని ద్రోహం చేశారని నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మండిపడ్డారు. కృష్ణా జలాలను పదేళ్లుగా పట్టించుకోని బిఆర్‌ఎస్ నేతలు ఇప్పుడు నీతులు చెబుతున్నారని ఆక్షేపించారు. ఉమ్మడి ఎపికి కేటాయించిన 811 టీఎంసీల్లో తెలంగాణకు 299, ఎపికి 512 టిఎంసిలు వాడుకునేలా ఒప్పందం చేసుకొని రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టుపెట్టిందని విమర్శించారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం చేసుకున్న చీకటి ఒప్పందంతోనే తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందన్న ఆయన.. తాత్కాలిక కేటాయింపులపై ప్రతి ఏడాది సంతకాలు చేసింది భారాస నేతలు కాదా? అని ప్రశ్నించారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు 70 శాతం వాటా రావాలనే వాదనను లేవనెత్తింది కాంగ్రెస్ ప్రభుత్వం అని మంత్రి పేర్కొన్నారు. తెలంగాణకు దక్కాల్సిన వాటా విషయంలో బిఆర్‌ఎస్ ప్రభుత్వ వైఖరిని కాంగ్రెస్ నిలదీసినందుకే సెక్షన్ (3) అంశం తెరపైకి వచ్చిందన్నారు. ఎన్నికలకు కొద్ది రోజుల ముందు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్‌కు ఓకే చెప్పిందని పేర్కొన్నారు. ఇందులో బిఆర్‌ఎస్ గొప్పతనమేమీ లేదని ఉత్తమ్ వ్యాఖ్యానించారు. బ్రిజేశ్ కుమార్ ట్రైబ్యునల్ నిర్దిష్ట కాల వ్యవధిలో కేటాయింపులు జరిగేలా గడిచిన పదేళ్లలో ఎందుకు ఒత్తిడి చేయలేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతే బ్రిజేశ్ కుమార్ ట్రైబ్యునల్ ద్వారా త్వరగా నీటి కేటాయింపులు చేయాలని కేంద్రంపై ఒత్తిడి పెంచినట్లు వివరించారు. బిఆర్‌ఎస్ హయాంలోనే ఎపి ప్రభుత్వం కృష్ణా జలాలను అడ్డగోలుగా తరలించిందని, పోతిరెడ్డిపాడు సామర్థ్యాన్ని అదనంగా మరో 44 వేల క్యూసెక్కులకు పెంచిందని ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆరోపించారు. రాయలసీమ ఎత్తిపోతల, 80 వేల క్యూసెక్కుల సామర్థ్యంతో పోతిరెడ్డిపాడు విస్తరణ పనులకు ఎపి అనుమతులు జారీ చేస్తే బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఎందుకు చూసీ చూడనట్లు వ్యవహరించిందని ఆరోపించారు.

### మహానగర నగర పాలక సంస్థకు
# సర్కార్ మహా తోడ్పాటు

### రూ.3030 కోట్ల స్టాంప్ డ్యూటీ నిధుల విడుదల
### 2019నుంచి పేరుకుపోయిన నిధులు విడుదల చేయని గత సర్కార్
### బల్దియాకు భారీ ఊరట కల్పించిన రేవంత్ సర్కార్

ప్రజాపక్షం/హైదరాబాద్ : మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి)కి ప్రభుత్వం ఆర్థిక తోడ్పాటును అందించింది. 2019 నుంచి రిజిస్ట్రేషన్ శాఖ వద్ద పేరుకుపోయిన స్టాంప్ డ్యూటీ బకాయిలను పూర్తి స్థాయిలో విడుదల చేసింది. సుమారు రూ.3030 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం జిహెచ్‌ఎంసి ఖాతాకు బదిలీ చేసింది. ఈ నిధులు ప్రస్తుతం పి అండ్ డి ఖాతాలో జమ అయ్యాయి. గత ప్రభుత్వానికి జిహెచ్‌ఎంసి అధికారులు ఎన్నిసార్లు మొర పెట్టుకున్నా పట్టించుకోలేదు. దీంతో స్టాంప్ డ్యూటీ నిధులు సంవత్సరాల తరబడి పేరుకుపోయాయి. ప్రస్తుతం రేవంత్ రెడ్డి సర్కార్ ఈ నిధులను జిహెచ్‌ఎంసి ఖాతాకు బదిలీ చేస్తూ నిర్ణయం తీసుకోవడంతో బల్దియా అధికారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం(ఎస్‌ఆర్‌డిపి) పేరుతో గత సర్కారు చేపట్టిన అభివృద్ధి పనులకు జిహెచ్‌ఎంసి రూ.7వేల కోట్ల నిధులను రుణాలు, బాండ్ల జారీ ద్వారా సేకరించింది. ఆ అప్పుల కోసం ప్రస్తుతం నెలకు రూ.180 కోట్ల రుణ వాయిదాలను చెల్లిస్తోంది. ఉద్యోగుల జీతాలు, పింఛన్లకు ప్రతి నెలా మరో రూ.120 కోట్లు ఖర్చవుతోంది. వాయిదాలు, జీతాలు, పింఛన్లకు ఏడాదికి రూ.3,600 కోట్లు అవసరమవుతాయని అధికారులు చెబుతున్నారు. రోజువారీ కార్యాలయాల నిర్వహణ, పారిశుద్ధ్యం, రోడ్ల నిర్వహణ, ఇతరత్రా కార్యక్రమాలకు ఏడాదిపాటు రూ.1,500 కోట్ల మేర వెచ్చించాల్సి ఉంటుంది. అన్ని ఖర్చులకు ఏటా రూ.5,100కోట్లు ఖర్చు కావాలి. ఆస్తి పన్ను, భవన నిర్మాణ అనుమతులు, ట్రేడ్‌లైసెన్స్‌ల ద్వారా వస్తున్న ఆదాయం రూ.2,500 కోట్లు మాత్రమే వస్తుంది. దీంతో కొత్తగా అప్పులు చేయడానికి జిహెచ్‌ఎంసికి అవకాశాలు లేకుండా పోయాయి. గతంలో తీసుకున్న రుణాలకు సంబంధించిన వాయిదాల చెల్లింపులకే ఆదాయం పోతుందంటున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ.700 కోట్లు కాంట్రాక్టర్లకు బ్యాంక్ ద్వారా చెల్లించేందుకు గానూ బడ్జెట్‌లో ప్రతిపాదించడం జరిగిందని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ప్రభుత్వం స్టాంప్ డ్యూటీ నిధులను విడుదల చేయడంతో ప్రస్తుతం జీతాలకు, నిర్వహణకు జిహెచ్‌ఎంసి ఎదురుచూసే పరిస్థితి లేదని, ఇక నుంచి ఒకటో తేదీన జీతాలు ఖాతాలో పడుతాయని అధికారులు అన్నారు.

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో..**

ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గ్రేటర్ హైదరాబాద్‌లో హెచ్‌సిటి పేరుతో రూ.5 వేల కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. హెచ్‌సిటీ ప్రాజెక్టు కింద 38 ప్రాంతాల్లో ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు, ఆర్‌ఓబి, ఆర్‌యుబిల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. వివాదాలతో రద్దయిన కెబిఆర్ పార్కు జంక్షన్‌ల వద్ద ఫ్లైఓవర్లు డిజైన్‌ల మార్పుతో తిరిగి ప్రాణం పోసింది. పురోగతిలోని ఎస్‌ఆర్‌డిపి పనులకు రూ.2,500 కోట్లు కావాలి. ఈ నేపథ్యంలో సిఎం రేవంత్ రెడ్డి జిహెచ్‌ఎంసికి ఆర్థిక దన్ను కల్పించారని అధికారులు చెబుతున్నారు.

### నిషేధిత జాబితా నుంచి తొలగించిన భూములపై
# అధ్యయనానికి మంత్రుల కమిటీ

అమరావతి: నిషేధిత జాబితా నుంచి అక్రమంగా తొలగించిన భూములపై నిర్ణయం తీసుకునేందుకు మంత్రి వర్గ ఉపసంఘం ఏర్పాటుకు ఎపి కేబినెట్ నిర్ణయించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం సచివాలయంలో కేబినెట్ సమావేశం జరిగింది. వైసిపి హయాంలో దాదాపు 7 లక్షల ఎకరాల భూములు నిషేధిత జాబితా నుంచి తొలగించారు. దీనిపై అధ్యయనం చేసి ఆయా భూములను ఏం చేయాలన్న దానిపై మంత్రుల కమిటీ ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనుంది. వచ్చే కేబినెట్ భేటీలోపు భూముల అవకతవకలపై నివేదిక ఇవ్వాలని ఆయా జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులను సిఎం ఆదేశించారు. రాష్ట్రంలోని సత్యసాయి, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో నిషేధిత జాబితా నుంచి భారీగా భూములు తొలగించినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చింది. కాగా, ధాన్యం కొనుగోలుకు రూ.700 కోట్లు రుణం తీసుకోవడం, ఎపి మార్క్‌ఫెడ్‌కు ప్రభుత్వ హామీ ప్రతిపాదనకు, గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల హేతుబద్ధీకరణకు గ్రామ, వార్డు సచివాలయాల్లో ఆర్‌టిజిఎస్ ఏర్పాటు, తోటపల్లి బ్యారేజీపై మినీ హైడల్ ప్రాజెక్టుల నిర్మాణాలకు, కడప జిల్లా సీకేదిన్నెలో 2,595 ఎకరాల బదిలీకి స్టాంప్ డ్యూటీ మినహాయింపుకు, అభ్యంతరం లేని ఆక్రమిత స్థలాల క్రమబద్ధీకరణ ప్రతిపాదనలకు, ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు విద్యుత్ టారిఫ్ తగ్గింపు ప్రతిపాదనపై, 62 నియోజకవర్గాల్లో 63 అన్న క్యాంటీన్ల ప్రారంభానికి కేబినెట్ ఆమోదం తెలిపింది.

## ఆర్‌టిసి కార్మికులకు 30 శాతం ఫిట్‌మెంట్‌తో వేతనాలు సవరించాలి




ప్రజాపక్షం/హైదరాబాద్ : వేతన సవరణ కాల పరిమితి ముగింపునకు 11 నెలల ముందే 1.15 కోట్ల మంది ఉద్యోగులు, పెన్షనర్లకు ఆర్థిక లబ్ది చేకూర్చే 8వ వేతన సవరణ కమిషన్‌ను కేంద్రం ప్రభుత్వం నిర్ణయం హర్షనీయమని ఆర్‌టిసి బోర్డ్ మాజీ డైరెక్టర్ ఎం.నాగేశ్వరరావు అన్నారు. అదే వేతన సవరణ కాల పరిమితి ముగిసి 46 నెలలు గడుస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఆర్‌టిసి కార్మికుల వేతన సవరణ చేయకపోవడం దుర్మార్గమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా కారణంగా కార్మికులు తీవ్ర ఆర్థిక నష్టానికి గురి అయ్యారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం 30శాతం ఫిట్మెంట్ 2021 ఏప్రిల్ 1నుంచి వేతనాలను సవరించి, బకాయిలు చెల్లించాలని ఆర్‌టిసి యాజమాన్యాన్ని నాగేశ్వరరావు డిమాండ్ చేశారు.

### చర్లపల్లి టెర్మినల్ స్టేషన్‌లో ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి..
## ‘వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్’ స్టాల్ కేటాయింపు




ప్రజాపక్షం/హైదరాబాద్ : చర్లపల్లి టెర్మినల్ స్టేషన్‌లో ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ సభ్యులకు ‘వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్’ స్టాల్, ట్రాలీ స్టాండ్ కేటాయించారు. ఈ స్టాల్‌ను ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీకి చెందిన వ్యక్తులు నిర్వహించనున్నారు. ఈ స్టాల్‌లో స్నాక్స్, జూట్ బ్యాగులు, సబ్బులు, అనేక రకాల చేతితో తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించనున్నారు. జాస్మిన్ (ట్రాన్స్‌జెండర్ ఎంటర్‌ప్రెన్యూర్) ‘వన్ స్టేషన్ వన్ ప్రొడక్ట్’ స్టాల్‌ను ప్రారంభించిన సందర్భంగా మాట్లాడుతూ ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ చాలా కాలంగా, ఉద్యోగ అవకాశాల కొరతను ఎదుర్కొంటోందన్నారు. కానీ ఇప్పుడు, తాము స్వంత వెంచర్లను ప్రారంభించడానికి కలిసి వచ్చామన్నారు. కొత్తగా ప్రారంభించిన చర్లపల్లి రైల్వే టెర్మినల్ స్టేషన్‌లో తమకు ఒక స్టాల్, ట్రాలీ స్టాండ్ కేటాయించారని తెలిపారు. తద్వారా తమ యొక్క చేతి వృత్తుల నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి అవకాశం కలిగిందన్నారు. స్టాల్‌లో, తమ సంఘంలోని సభ్యుల ఉత్పత్తుల శ్రేణిని కొనుగోలుదార్లకు అందిస్తామన్నారు. తాను చిరు తినుబండారాల వ్యాపారాన్ని నడుపుతున్నానని, స్వయంగా తయారు చేసే క్రిస్పీ ట్రీట్లను విక్రయిస్తాను అన్నారు. త్రిపుర, సహస్ర అనే ఇద్దరు ప్రతిభావంతులైన ట్రాన్స్ వుమెన్‌లు ప్రత్యేకించి చేతితో తయారు చేసిన జనపనార సంచులను ఇక్కడ విక్రయిస్తారన్నారు. ఇక్కడ ప్రతి ఒక్క ఉత్పత్తి ప్రత్యేకమైనదే కాకుండా ఇది తమ మనోబలాన్ని, సృజనాత్మకతను పెంపొందిస్తుందన్నారు. కిరణ్ రాజ్ అనే ట్రాన్స్ మ్యాన్ సబ్బులు తయారు చేస్తాడన్నారు. తమ స్టాల్‌లో అతని సబ్బులను అమ్మకానికి ఉంచినందుకు తాను సంతోషంగా ఉన్నానని తెలిపారు. తద్వారా తాము ప్రజలతో మమేకం కావడానికి, సామర్థ్యాన్ని ప్రజలు గుర్తించేందుకు ఇది ఒక సదావకాశంగా భావిస్తామన్నారు. రైల్వే అధికారులకు, రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే జోన్ సమాజంలోని అన్ని వర్గాల వారి సృజనాత్మకత, ప్రతిభను ప్రదర్శించడానికి ఒక సరైన వేదిక, సమాన అవకాశాలను అందించడానికి కట్టుబడి ఉందని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ తెలిపారు. చర్లపల్లి టెర్మినల్ స్టేషన్‌లో ఓఎస్‌ఓపి స్టాల్‌ను నిర్వహించే అవకాశం ట్రాన్స్‌జెండర్‌లకు లభించడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ స్టాల్ స్వయం సహాయక సంఘాలు, సామాజిక పారిశ్రామికవేత్తలకు మాత్రమే కాకుండా ప్రయాణీకుల అవసరాలకు కూడా ఉపయోగపడుతుందని ఆయన తెలిపారు.

## అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు

### జాతీయ ఎస్‌సి కమిషన్ సభ్యుడు వడ్డేపల్లి రాంచందర్

ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి : ప్రభుత్వ పథకాలు అర్హులైన షెడ్యూల్ కులాలకు చెందిన లబ్ధిదారులకు అందాలని జాతీయ ఎస్‌సి కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్ అన్నారు. శుక్రవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలో షెడ్యూల్ కులాలకు అందిస్తున్న వివిధ పథకాలు, కార్యక్రమాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా పరిధిలోని మండలాలు, షెడ్యూల్ కులాల జనాభా, ఎస్‌సి స బ్ ప్లాన్ నిధులు, బ్యాక్ లాగ్ ఉద్యోగాలు, ప్రమోషన్లు, ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా మంజూరు చేసిన రుణాలు, శిక్షణ కార్యక్రమాలు, దళిత బంధు, ఎస్‌సి స్ట డీ సర్కిల్ శిక్షణా కార్యక్రమాలు, సంక్షేమ హాస్టల్స్, బెస్ట్ అవైలబుల్ స్కీమ్, అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం, వైద్య ఆరోగ్య, ఉపాధి హామీ, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో షెడ్యూల్డ్ కులాలకు అందించే వివిధ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలు, తదితర అంశాల గురించి సంబంధిత శాఖల అధికారులు జాతీయ ఎస్సీ కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్‌కు వివరించారు. సంబంధిత శాఖల అధికారులతో ఆయా పథకాల అమలు తీరుతెన్నుల గురించి సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా జాతీయ ఎస్‌సి కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రామచందర్ మాట్లాడుతూ షెడ్యూల్ కులాలు అభివృద్ధి చెందే విధంగా రుణాలను అందించి ప్రోత్సహించాలన్నారు. సకాలంలో సబ్సిడీ రుణాలు అందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. సబ్సిడీ రుణాలు సకాలంలో అందకపోవడం వలన షెడ్యూల్ కులాల లబ్ధిదారుల సిబిల్ స్కోర్ తగ్గిపోవడం జరుగుతుందని, ప్రభుత్వం, అధికారులు సబ్సిడీ రుణాలు సకాలంలో అందే విధంగా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో జాతీయ షెడ్యూల్డ్ కులాల రీసెర్చ్ అధికారి వరప్రసాద్, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, సెంట్రల్ జోన్ డిసిపి సలీమా, జిల్లా సంక్షేమ శాఖ అధికారి శ్రీలత, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు, ఎసిపిలు, తహసిల్దార్లు, తదితరులు పాల్గొన్నారు.




**ఎస్‌సిలకు అందే సంక్షేమ పథకాలపైనే సమీక్ష**

అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జాతీయ ఎస్‌సి కమిషన్ సభ్యులు వడ్డేపల్లి రాంచందర్ మాట్లాడుతూ షెడ్యూల్ కులాల వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుండి అందించాల్సిన పథకాలు సకాలంలో అందుతున్నాయా లేదా అనేది వివిధ శాఖల అధికారులతో సమీక్షించినట్లు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లాలో బ్యాక్ లాగ్ ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. హనుమకొండ జిల్లాలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కు ప్రభుత్వం కేటాయించిన అసైన్డ్ ల్యాండ్ వేరే వ్యక్తులు రిజిస్ట్రేషన్ చేసుకున్నా, సాదా బైనామా ద్వారా వేరే వ్యక్తులు చేయించుకున్నా అది చట్టబద్ధత కాదన్నారు. ఎస్‌సి ఎస్‌టిలకు ఇచ్చిన అసైన్డ్ భూములకు లబ్ధిదారుల కుటుంబ సభ్యులే అసలైన హక్కుదారులు అని అన్నారు. ఇదే విషయాన్ని పోలీసు, రెవెన్యూ అధికారులకు తెలియజేసినట్లు చెప్పారు ఎస్సీ, ఎస్టీలకు సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాలన్నారు.

## ప్రభుత్వ భూములు పేదలకివ్వాలి

### సిపిఐ జిల్లా కార్యదర్శి గుంటివేణు

ప్రజాపక్షం/రాజన్నసిరిసిల్ల ప్రతినిధి: రాజన్నసిరిసిల్లా జిల్లాలో భూ అక్రమణలకు పాల్పడ్డ వారి నుండి పట్టాలు స్వాధీనం చేసుకోవడంతో పాటు భూములను స్వాధీనం చేసుకున్నట్లుగా గ్రామసభలు ఏర్పాటు చేసి అదే గ్రామంలో భూమిలేని నిరుపేదలకు ఆ భూములను పంచాలని సిరిసిల్లా జిల్లా సీపిఐ కార్యదర్శి గుంటివేణు ప్రభుత్వాన్ని కోరారు.శుక్రవారం సుభాష్‌నగర్ సిపిఐ జిల్లా కార్యాలయంలో సమావేశంలో మాట్లాడారు. ఆక్రమించుకున్న వారినుండి ఇప్పటివరకు దాదాపుగా 300 ఎకరాల ప్రభుత్వభూమిని స్వాధీనం చేసుకున్నట్లుగా వార్తలు వస్తున్నాయని ఇదిమంచి పరిణామం అన్నారు. దీన్ని కమ్యూనిస్టు పార్టీ స్వాగతిస్తుందని, కలెక్టర్‌కు అభినందనలు తెలిపారు. భూ ఆక్రమణలకు పాల్పడ్డవారు దాదాపుగా టిఆర్‌ఎస్‌కు చెందిన నాయకులే ఉన్నారన్నారు. జిల్లాలో 448 మంది ఏడువేల ఎకరాలకు పైచిలుకు ఆక్రమణకు గురైందన్నారు.అసైన్డ్ భూములకు పట్టాలు ఇవ్వడానికి ఎకరానికి రెండు లక్షల రూపాయల చొప్పున వీఆర్‌వో, ఆర్‌ఐ, ఎమ్మార్వో, చివరికి ఆర్డీవో స్థాయి అధికారులే ఈ పాసుబుక్కులు ఇచ్చారని అన్నారు. కార్యక్రమంలో అజ్జువేణు, సోమనాగరాజు పాల్గొన్నారు.


# క్రీడాకారులను ప్రోత్సహిస్తే మెరుగైన ఫలితాలు

### నియోజకవర్గంలో క్రీడాకారులకు సౌకర్యాలు కల్పించేందుకు ఎమ్మెల్యే కూనంనేని ప్రత్యేక కృషి
### సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా

ప్రజాపక్షం/పాల్వంచ : క్రీడాకారులను ప్రోత్సహిస్తే మెరుగైన ఫలితాలు వస్తాయని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా అన్నారు. గెలుపు, ఓటమిని క్రీడాకారులు సమానంగా తీసుకొని క్రీడా స్ఫూర్తిని ప్రదర్శించాలని ఆయన సూచించారు. పాల్వంచ మండల పరిధి కిన్నెరసాని కొమరం భీమ్ యూత్ ఆధ్వర్యంలో ఆశ్రమ పాఠశాల గ్రౌండ్‌లో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ నాలుగు రోజుల పాటు నిర్వహించారు. పోటీల్లో మండలం నుండి 20టీములు పాల్గొనగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న సాబీర్ పాషా మొదటి బహుమతి జగన్నాధపురం, రెండవ బహుమతి కిన్నెరసాని జట్లకు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటైన సమావేశంలో సాబీర్‌పాషా మాట్లాడుతూ క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న కిన్నెరసాని కొమరం భీమ్ యూత్‌ను అభినందించారు. భద్రాద్రి జిల్లాలో క్రీడాకారులకు కొదవలేదని, వారికి కావాల్సిన సదుపాయాలు, సౌకర్యాలు కల్పించేందుకు ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల విశ్వనాథం, పట్టణ కార్యదర్శి అడుసుమల్లి సాయిబాబ, మండల కార్యదర్శి వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, నాయకులు నిమ్మల రాంబాబు, కొంగర అప్పారావు, ఎస్‌కె ఖాసీం, విజయ్‌కుమార్, కొమరం భీమ్ యువత వజ్జా రామకృష్ణ, వజ్జా విక్రాంత్, తాటి సురేష్, ఆరీఫ్, ఉదయ్, రాంబాబు, అప్పారావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

**ఉద్యమకారులకు న్యాయం చేస్తాం..** తెలంగాణ ఉద్యమకారులకు న్యాయం చేస్తామని, వారిని ఆదుకుంటామని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా అన్నారు. శుక్రవారం పాల్వంచ జై తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం కార్యాయలంలో ముఖ్యనాయకుల సమావేశం నిర్వహించారు. సమావేశానికి సాబీర్ పాషా ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా ఎమ్మెల్యే కూనంనేని ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అలాగే ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో అర్హులైన ఉద్యమకారులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జై తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు సయ్యద్ రషీద్, సంఘం సభ్యులు ఉబ్బన శీను, ఆరవెల్లి పెద్దబాబు, ఎస్‌కె గౌస్, జయరాజు, మహమ్మద్ సద్దా, రాము, ఆసిఫ్, పాషా, నయీం, పఠాన్, సత్తార్, సందీప్, నివాస్, ఇబ్రహీం, ఇమ్రాన్, సోహెల్, అక్రమ్, అజ్మల్, అంజద్, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థులకు తపస్ మద్దతు




ప్రజాపక్షం/హైదరాబాద్ : రాష్ట్రంలో త్వరలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బిజెపి బలపరిచిన ముగ్గురు అభ్యర్థులకు తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. శుక్రవారం హైదరాబాద్‌లో తపస్ రాష్ట్ర కమిటీ, జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులతో రాష్ట్ర అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి హన్మంతరావు, నవాత్ సురేష్‌లు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉమ్మడి కరీంనగర్ నిజామాబాద్ మెదక్ ఆదిలాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గ బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమరయ్య, ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ పట్టభద్రుల నియోజకవర్గ బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి సి.అంజిరెడ్డి, ఉమ్మడి వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గ బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థి సరోత్తం రెడ్డిలకు తపస్ సంపూర్ణ మద్దతు ఇవ్వనున్నట్లు నాయకులు వెల్లడించారు. ఈ సమావేశంలోబిజెపి ఎమ్మెల్సీ ఎవిఎన్ రెడ్డి ,బిజెపి ఎమ్మెల్సీ అభ్యర్థులు మల్క కొమరయ్య, సి.అంజిరెడ్డి, పులి సరోత్తం రెడ్డి, ఎబిఆర్‌ఎస్‌ఎం ప్రతినిధులు లక్ష్మణ్, విష్ణువర్ధన్ రెడ్డి, వెంకట్రావు, రాష్ట్ర పదాధికారులు నరేందర్ రావు, పాపిరెడ్డి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శులు బండి రమేష్, తెల్కలపల్లి పెంటయ్య, రామకృష్ణ రెడ్డిలు పాల్గొన్నారు.

# 20లోగా క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి

## మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిర బోయి



ప్రజాపక్షం/ మహబూబ్‌నగర్ ప్రతినిధి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న రైతు భరోసా, రేషన్ కార్డులు జారీకీ అర్హులైన వారికి లబ్ధి చేకూర్చేందుకు నిర్వహిస్తున్న ప్రక్రియను కలెక్టర్ విజయేందిన బోయి శుక్రవారం పరిశీలించారు. నవాబ్ పేట మండలం పోమాల్‌లో సర్వే బృందం పని తీరును తనిఖీ చేశారు. ఇంటింటికి తిరుగుతూ సేకరిస్తున్న వివరాలను కలెక్టర్ పరిశీలించారు. అర్హుల జాబితారూపొందించి ఈ నెల 21 నుండి 24 వరకు గ్రామ సభలలో ప్రదర్శించి చదివి ఆమోదించాలని, ఏమైనా అభ్యంతరాలు ఉంటే స్వీకరించి పరిష్కరించాలన్నారు. త్వరితగతిన ఫీల్డ్ వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని,తప్పిదాలకు తావు లేకుండా పూర్తి పారదర్శకంగా లబ్ధిదారుల జాబితా రూపొందించాలని ఆదేశించారు.

# మెరుగైన వైద్యసేవలు అందించాలి




ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సూచించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో తెలంగాణ మెడికల్ ఉద్యోగుల సంఘం, కాంట్రాక్టు వర్కర్స్ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ముఖ్య అతిథిగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో పనిచేయడం డ్యూటీగా కాకుండా బాధ్యతగా భావించాలని సూచించారు. సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్ కుమార్‌సింగ్, హాస్పిటల్ డెవలప్మెంట్ కమిటీ సభ్యులు డాక్టర్ సామ్యూల్ బెజ్జుగం రాఘవేందర్, ఐఎన్టీయుసి రాష్ట్ర నాయకులు సత్యనారాయణ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మ ణ్ యాదవ్, ఐఎంఎ అధ్యక్షులు డాక్టర్ రాంమోహన్, రెడ్ క్రాస్ సంస్థ చైర్మన్ లయన్ నటరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# రేషన్‌కార్డుకు కులగణనతో లింకు వద్దు



ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః కొత్త రేషన్ కార్డుల జారీకి ప్రభు త్వం కుల గణన సర్వే లింకు పెట్టాలని చూడడం పలు అనుమానాలకు తావిస్తుందని బీసీ సమాజ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఏం. శ్రీనివాస్ సాగర్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని తప్పు పట్టారు. ఇటీవల కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ కులగణన 96% పూర్తయిందని చెప్పడం జరిగిందన్నారు. కానీ క్షేత్రస్థాయిలో దాదాపు 80 శాతమే పూర్తయినట్లు తెలుస్తుందని ఉపాధి, ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి వివరాలు, చాలామంది ప్రజలు ఈ సర్వేలో పాల్గొనలేరు. సర్వేలో ఒకవేళ తప్పులు దొర్లితే అర్హులైన వారికి రేషన్ కార్డులు వచ్చే అవకాశం పోతుందని శ్రీనివాస్ సాగర్ అన్నారు.

# బాధితుడికి ఎల్‌ఒసి అందజేత



ప్రజాపక్షం/నర్వః నారాయణపేట నర్వ మండలం లంకాల గ్రామానికీ చెందిన జములయ్యల వెంకటేష్ కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ విషయాన్ని నర్వ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బీసం చెన్నయ్య సాగర్ స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ వాకిటీ శ్రీహరికి తెలియజేశారు. ఎమ్మెల్యే స్పందించి వెంకటేష్ వైద్య ఖర్చుల నిమిత్తం రూ.1.50 లక్షలు ఎల్‌ఓసి ని బాధితుడికి అందజేశారు. నర్వ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చెన్నయ్య సాగర్ లంకాల గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కోట్ల శ్రీనివాసులు బీసం రవి, బి. పాండు సాగర్, జీకే మూర్తి, దొరకుంట కృష్ణయ్య టి లక్ష్మారెడ్డి, సత్యనారాయణ బాలు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో శివదీక్ష స్వీకరణ



ప్రజాపక్షం / కొత్తకోట: కొత్తకోట మండలం కానాయపల్లి స్టేజీ దగ్గర గల సుప్రసిద్దమైన శైవక్షేత్రం శ్రీ కోటిలింగేశ్వర దత్తదేవస్థానంలో శివస్వాములు భక్తి శ్రద్దలతో శివదీక్షను స్వీకరించారు. అర్చకులు వేదమంత్రాలతో సంకల్ప పూజలు జరిపి రుద్రాక్ష మాలలను శివస్వాముల మెడలో అలంకరింపజేసి ధ్యానమందిరంలో ప్రతిష్టించిన పాదరస సహిత నవరత్నాలంకృత స్వర్ణ కవచ పంచలోహ శివలింగానికి అభిషేకం చేయించి శివదీక్ష నయామాలు తెలిపి ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు.

# అతిథి అధ్యాపకుల కోసం నోటిఫికేషన్




ప్రజాపక్షం/మద్దూరు : మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యా కమిషనర్ ఆదేశానుసారం హిస్టరీ, పొలిటికల్ సైన్స్ , బాటని, జువాలజీ, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టుకి సంబంధించి వాటికి అధ్యాపకుల కొరకు అర్హులైన అభ్యర్థుల నుంచి ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ నారాయణగౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు పిజిలో 55 శాతం మార్కులు ఎస్సీ, ఎస్టీలు అయితే 50 శఆతం మార్కులు కలిగి ఉన్న అభ్యర్థులు ఈ నెల 21 లోగా మద్దూర్ ప్రభుత్వడిగ్రీ కళాశాల లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

# సిఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ

ప్రజాపక్షం / మద్దూర్ : ప్రజా పాలనలో భాగంగా మద్దూరు పట్టణం కేంద్రంలోని ఖుర్షీద్ బేగం భర్త మహమ్మద్ గౌస్‌కు రూ. 85వేల సీఎంఆర్ ఎఫ్ చెక్కును కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు బాధిత కుటుంబ సభ్యులు గౌస్ ఇంటికి వెళ్లి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం సహాయ నిధి పేద ప్రజలకు వరం లాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట జిల్లా మైనార్టీ జనరల్ సెక్రటరీ అబ్దుల్ రహీం , కాంగ్రెస్ పార్టీ మండల మైనార్టీ నాయకులు హుసెన్ , సలాం, భారి , అహేమద్ , రౌఫ్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రజలు సుభిక్షంగా ఉండాలి

## మంత్రి జూపల్లి కృష్ణారావు



ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి : రాష్ట్రంలో ప్రజలు సుభిక్షంగా ఉండాలని, పాడిపంటలతో రైతాంగం సంతోషంగా, లాభసాటిగా సాగుచేయాలని, తెలంగాణరాష్ట్రం ప్రపంచస్థాయిలోనే ప్రత్యేక గుర్తింపు ఉండాలని స్వామివారి కృపకటాక్షం రాష్ట్రంపై చూపాలని, ప్రభుత్వానికి ప్రజలకు మంచిజరగాలని స్వామివారిని కోరుకుంటున్నట్లు మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నా రు. రథోత్సవం అనేది ఒక భక్తి సంప్రదాయంగా విశేషమైన ఉత్సవం బ్రహ్మోత్సవాల్లో అతిముఖ్యమైన ఘట్టం రథోత్సవం అని స్వామివారి ఊరేగింపు కన్నుల పండుగగా సాగిందని భక్తులు ఆనందంగా రథాన్నిలాగేందుకు పోటిపడతారు. అనేక ప్రాంతాలనుంచి వేలాదిమంది భక్తులు ఈరథోత్సవ మహోత్సవంలో పాల్గొనడం ఆనందదాయకమని ఈ ఉత్సవం ఎంతో వైభవంగా, అంగరంగ వైభవంగా జరుగుతుందని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రజలు సంతోషాలతో జీవించాలని, ప్రజలందరూ సోదరభావంతో ఉండాలని, జిల్లా యంత్రాంగానికి ప్రజలకు మంచిచేకూరాలని సింగోటం లక్ష్మి నర్సింహ్మాస్వామివారిని కోరుకుంటున్నట్లు కలెక్టర్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలంలోని సిం గోటం లక్ష్మి నరసింహ్మాస్వామి రథోత్సవం అంగరంగవైభవంగా జరిగింది. ఈఉత్సవంలో లక్ష్మి నరసింహ్మా స్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం శుక్రవారం సాయంత్రం అత్యం త భక్తిమయంగా జరగడం విశేషం.రథోత్సవాన్ని రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక, సాంస్కృతికశాఖమంత్రి జూపల్లికృష్ణారావు, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ ప్రారంభించారు. అనంతరం మంత్రి జూపల్లికృష్ణారావు, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ పూజలుచేసి రథాన్నిలాగారు. వివిధ ప్రాంతాలనుంచి వేలాదిగా భక్తులు తరలి రావడంతో జాతరప్రాంగణం కిక్కిరిసింది. నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్‌పి గైక్వాడ్‌వైభవ్‌రఘునాథ్, కొల్లాపూర్ సంస్థాన రాజవంశీకులు, ఆలయధర్మకర్త బాలాఆదిత్య లక్ష్మ ణరావు, లక్ష్మి నరసింహ్మా స్వామి రథోత్సవంలో అధికారులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల సమస్యలపై నిరంతర పోరాటం



ప్రజాపక్షం/కల్వకుర్తి : జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాడే ఏకైక సంఘం టియూడబ్ల్యూజే ఐజేయు సంఘం అని రాష్ట్రకార్యదర్శి జి.మధుగౌడ్ అన్నారు. పట్టణంలోని టిఎస్ యుటిఎఫ్‌భవనంలో శుక్రవారం నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు జి.సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన కల్వకుర్తి డివిజన్ టియూడబ్ల్యూజే ఐజేయుశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా రాష్ట్రకార్యదర్శి మధుగౌడ్ హాజరై మాట్లాడుతూ నిబద్ధత, నిబంధనలుకలిగిన ట్రేడ్ యూనియన్ అంటే టియూడబ్ల్యూజే ఐజేయు సంఘం అన్నారు. నిరంతరం జర్నలిస్టులహక్కులసాధన, పరిరక్షణ లక్ష్యంగా పనిచేస్తుందన్నారు. అనంతరం కల్వకుర్తిడివిజన్ పరిధిలోని సంఘం 74మంది సభ్యత్వం తీసుకున్నారు. అట్టి సభ్యత్వం డబ్బులు జిల్లాఅధ్యక్షుడు సంఘం సభ్యులు రాష్ట్రకార్యదర్శికి అందించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు బి.రామకృష్ణ, రాష్ట్రకార్యవర్గ సభ్యులు కర్నయ్య,శ్యామ్, జిల్లా ప్రధానకార్యదర్శి రాములు, డివిజన్ పరిధిలోని అన్నిమండలాలకు చెందిన సంఘం సభ్యత్వం పొందిన ప్రింట్‌అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

# జైపాల్ యాదవ్..అసత్య ప్రచారాలు మానుకో..



ప్రజాపక్షం/వెల్దండ : కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యేజైపాల్‌యాదవ్ అసత్య ప్రచారాలుమానుకోవాలని కల్వకుర్తి మార్కెట్‌కమిటిడైరెక్టర్ చెర్క రాజశేఖర్ అన్నారు. శుక్రవారం మండలపరిధిలోని చెరుకూరు గ్రామంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాజీసర్పంచ్ రేవతితోకలిసి రాజశేఖర్ మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా ఎమ్మెల్యేగా జైపాల్‌యాదవ్‌ఉండి నియోజకవర్గానికి ఏమి చేయలేకపోయాడని, కసిరెడ్డి నారాయణరెడ్డి ఎమ్మెల్యేగా గెలిచినతర్వాత చెరుకూరు గ్రామాన్ని రూ.2కోట్ల అభివృద్ధిపనులకు మంజూరుచేశాడని గుర్తుచేశారు. అదేవిధంగా ఎమ్మెల్యేగా గెలిచిన రెండునెలలకాలంలోనే డి82 పెండింగ్ కాల్వపనులను పూర్తిచేశారని అన్నారు. జైపాల్‌యాదవ్ ఎమ్మెల్యేగా ఉండి డిండి నార్లాపూర్ ప్రాజెక్టుగురించి ఏమాత్రం పట్టించుకోలేదని, ఓడిపోయినతర్వాత డిండి నార్లాపూర్ ప్రాజెక్టు గుర్తుకొచ్చిందని ప్రశ్నించారు. భూములు కోల్పోయినరైతులనుమాజీ ఎమ్మెల్యేజైపాల్‌యాదవ్ ఏమాత్రం పట్టించుకోలేదని, ఎమ్మెల్యే కసిరెడ్డినారాయణరెడ్డి భూనిర్వాసితులకు నష్టపరిహారం ఇప్పించారని అన్నారు. ఈ సమావేశంలో చంద్రమౌళి, బాలకృష్ణ, అన్వర్, నర్సింహ్మా, లక్ష్మ య్య, వెంకటయ్య, అశోక్, రామకృష్ణ, యాదయ్య, బాల్‌నారాయణ, బాలయ్య పాల్గొన్నారు.

# సిసి కెమెరాలతో ప్రయోజనాలెన్నో..

ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధిః డీజీపీ మహబూబ్‌నగర్ పోలీసు ప్రధాన కార్యాలయంలో కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్ ప్రారంభించారు. కంట్రోల్ రూమ్ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించారు. నేరాల పర్యవేక్షణ అత్యవసర సమయాల్లో వేగవంతమైన స్పందనకు ఉపయోగపడుతుంది. ఈ కంట్రోల్ రూమ్ ద్వారా సీసీటీవీ పుటేజ్, కమ్యూనికేషన్ వ్యవస్థలు, ఇతర సాంకేతిక పరికరాలు పర్యవేక్షించబడతాయి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేయుటకు సహకరించిన వారికి డీజీపీమెమోంటోతో సత్కరించారు. అనంతరం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయం నందు కాన్ఫరెన్స్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. మహబూబ్‌నగర్ , నారాయణపేట జిల్లాల పోలీసు నేరాల స్థితిగతులు, పరిష్కారంగా చేపట్టిన చర్యలు, ప్రజలకు అందించిన సేవలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.మహబూబ్‌నగర్ ఎస్‌పి డి.జనకి మహబూబ్‌నగర్ జిల్లాలో శాంతిభద్రతల నిర్వహణ, ప్రాధాన్యమైన కేసులు, నేరాల పరిశీలన అంశాలను వివరించారు. జిల్లా తరపున అదనపు ఎస్పీ రాము లు, ఎఆర్ అదనపు ఎస్పి సురేష్‌కుమార్, డిఎస్పి వెంకటేశ్వర్లు, డిసిఆర్‌బి డిఎస్పి రమణారెడ్డి, వర్టికల్ డిఎస్పి సుదర్శన్ డిటిసి డిఎస్పి గిరిబాబు, సైబర్ క్రైమ్ డిఎస్పి సుదర్శన్‌రెడ్డి, సిఐఎస్, ఇన్స్పెక్టర్స్ ఆర్‌ఐఎస్ నారాయణపేట జిల్లా నుండి అడిష నల్ ఎస్పి యండి రియాజ్‌హుల్‌హక్, డిఎస్పీ ఎన్. లింగయ్య,సిఐలుశివశంకర్,చంద్రశేఖర్‌ఉన్నారు.

# ఆత్మరక్షణకు కరాటే అవసరం




ప్రజాపక్షం / నారాయణపేట: నారాయణపేట మినీ స్టేడియం గ్రౌండ్‌లో కరాటే నేర్చుకుంటున్న విద్యార్థులకు నారాయణపేట షీ టీం పోలీసులు ఆత్మరక్షణ గురించి, సైబర్ నేరాలు, అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, శారీరక దారుఢ్యం , చదువుపై శ్రద్ధ, ఉన్నత ఉద్యోగాలు ఎలా సాధించాలి, క్రమ శిక్షణ మొదలఘు అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. షీ టీం పోలీసులు బాలరాజ్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండి కరాటపై శ్రద్ధ వహించడం వల్ల శారీరక దారుఢ్యంతో పాటు మంచి క్రమశిక్షణ అలవడుతుందని, ఆపద సమయంలో అపరిచిత వ్యక్తుల నుండి ఎలా రక్షణ పొందవచ్చని తెలిపారు. చదువుపై శ్రద్ధ కనబర్చి బాగా చదువుకోవాలని చదువుతో పాటు కరాటే నేర్చుకోవడం వల్ల తమకు తాము రక్షించుకోవచ్చని తెలిపారు. ఒకవేళ సైబర్ నేరానికి గురైతే 1930 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం ఇవ్వాలని అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

# అర్హులైన ప్రతి ఒక్కరిని ఎంపిక చేయాలి



జిల్లా అదనపు కలెక్టర్ బెన్ శాలం

ప్రజాపక్షం / నారాయణపేట : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు , ఇందిరమ్మ ఇండ్లు అయినా సంక్షేమ పథకాల అమలులో చేపడుతున్న సర్వేను శుక్రవారం అదనపు కలెక్టర్ బెన్ షాలం కోస్గి మండలం సర్జకణపేట, మక్తల్ మండలం దాసరి దొడ్డి గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించి లబ్దిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కుటుంబంలోని ఆరుగురిని హత్య చేసిన జంటకు మరణశిక్ష

లక్నో: భార్యాభర్తలు కలిసి కుటుంబంలోని ఆరుగురు సభ్యులను హత్య చేశారు. ఐదేళ్ల కిందట జరిగిన ఈ కేసుపై కోర్టు విచారణ జరిపింది. ఆ జంటను దోషులుగా నిర్ధారించడంతోపాటు వారికి మరణ శిక్ష విధించింది. ఉత్తరప్రదేశ్ రాజధాని లక్నోలో ఈ సంఘటన జరిగింది. 2020 లో అజయ్ సింగ్ తన భార్య రూపా సింగ్‌తో కలిసి దారుణానికి పాల్పడ్డాడు. తండ్రి అమర్ సింగ్, తల్లి రామ్ దులారి, సోదరుడు అరుణ్ సింగ్, వదిన రామ్ సఖి, వారి పిల్లలైన సౌరభ్, సారికలను కాల్చి చంపారు. కాగా, అజయ్ సింగ్ సోదరి దుర్గావతి అలియాస్ గుడ్డీ సింగ్, లక్నోలోని బంత్రా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. సోదరుడు అజయ్ సింగ్ తమ తండ్రి నుంచి డబ్బులు డిమాండ చేసేవాడని తెలిపింది. భూమిని అమ్మిన డబ్బు మొత్తం అన్నా, వదినలకు తండ్రి ఇస్తాడేమోనని ఆందోళన చెందేవాడని చెప్పింది.

ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు, అన్నావదినలు, వారి పిల్లలను హత్య చేశారని ఆరోపించింది. అజయ్ సింగ్, అతడి భార్య రూపా సింగ్, వారి మైనర్ కుమారుడు కలిసి దీనికి కుట్రపన్నినట్లు ఫిర్యాదులో పేర్కొంది. మరోవైపు కుటుంబంలోని ఆరుగురు వ్యక్తుల హత్యలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులైన అజయ్ సింగ్, అతడి భార్య రూపా సింగ్‌ను అరెస్ట్ చేశారు. ఎనిమిది మంది సాక్షులను ప్రాసిక్యూషన్ విచారించింది. 31 డాక్యుమెంటరీ ఆధారాలను కోర్టుకు సమర్పించింది. దీంతో గత ఏడాది డిసెంబర్ 16న భార్యాభర్తలైన అజయ్ సింగ్, అతడి భార్య రూపా సింగ్‌ను దోషులుగా లక్నో కోర్టు నిర్ధారించింది. శుక్రవారం శిక్షలు ఖారారు చేసిన కోర్టు ఆ జంటకు మరణ శిక్ష విధించింది.

# ఉప ఎన్నికను బహిష్కరించిన విజయ్ పార్టీ

చెన్నై: తమిళనాడులోని ఈరోడ్ తూర్పులో జరుగనున్న ఉప ఎన్నికను నటుడు విజయ్ పార్టీ తమిళగ వెట్రి కజగం (టివికె) బహిష్కరించింది. అన్నాడిఎంకె, బిజెపి, డిఎండికె సహా పలు ప్రధాన రాజకీయ పార్టీలు కూడా ఈ ఉప ఎన్నికను బహిష్కరించినట్లు ఇప్పటికే ప్రకటించాయి. విజయ్ పార్టీ కూడా ఈ జాబితాలో చేరింది. గతంలో విక్రవాండి ఉప ఎన్నికను బహిష్కరించిన ఆ పార్టీ తన వైఖరిని తాజాగా సమర్థించుకున్నది. ఉప ఎన్నికలో గెలవడానికి సిఎం ఎంకె స్టాలిన్ నేతృత్వంలోని డిఎంకె ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నట్లు ఆరోపించింది. కాగా, టివికె జనరల్ సెక్రటరీ ఎన్ ఆనంద్ మీడియాతో మాట్లాడారు. తమిళనాడులోని పాలక ప్రభుత్వాలు ప్రజాస్వామ్య నిబంధనలు పాటించకుండా, ఉప ఎన్నికలలో గెలవడానికి తమ అధికారాన్ని ఉపయోగించినట్లు చరిత్ర చెబుతోందని విమర్శించారు. గతంలో విక్రవాండి ఉప ఎన్నికల సమయంలో తమ పార్టీ తీసుకున్న వైఖరిని ప్రస్తుతం కూడా కొనసాగిస్తున్నట్లు చెప్పారు. అందుకే ఉప ఎన్నికల్లో ఏ పార్టీకి మద్దతు ఇవ్వబోమని అన్నారు. మరోవైపు 2026లో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికలపైనే తమ పార్టీ దృష్టిసారించిందని టివికె ఏర్పాటు సందర్భంగా విజయ్ తెలిపారు. ఈ నేపథ్యంలో తాత్కాలిక ఎన్నికల్లో తమ పార్టీ పోటీ చేయదని చెప్పారు. అలాగే ఉప ఎన్నికల్లో ఏ పార్టీకి కూడా మద్దతు ఇవ్వబోమని స్పష్టం చేశారు. కాగా, ఈరోడ్ తూర్పు అసెంబ్లీ స్థానానికి ప్రాతినిధ్యం వహించిన కాంగ్రెస్ ఎమ్మెల్యే ఈవీకేఎస్ ఎలంగోవన్ డిసెంబర్‌లో మరణించారు. దీంతో ఖాళీ అయిన ఈ స్థానానికి ఫిబ్రవరి 5న ఉప ఎన్నిక జరుగనున్నది. డీఎంకే అభ్యర్థిగా వీసీ చంద్రకుమార్ నామినేషన్ దాఖలు చేశారు. ఎన్‌టీకే అభ్యర్థి ఎంకే సీతాలక్ష్మి ఆయనపై తలపడుతున్నారు. ఉప ఎన్నికకు మిగతా పార్టీలు దూరంగా ఉన్నాయి. దీంతో డీఎంకే, ఎన్‌టీకే మధ్య పోటీ నెలకొన్నది.

# ఆయుష్మాన్‌భారత్ అమలుకు బ్రేక్!

## ఢిల్లీ హైకోర్టు ఆదేశాలపై స్టే..!




న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మిషన్ పథకం అమలును నిలిపివేస్తూ సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. ఆయుష్మాన్ భారత్ విషయంలో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వశాఖ, ఢిల్లీ ప్రభుత్వం ఒప్పందం చేసుకోవాలని గతంలో ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వుల్లో ఆదేశించింది. దాంతో ఆయుష్మాన్ భారత్ పథకం అమలు చేయాల్సిన పరిస్థితి ఎదురైంది. దాంతో ఢిల్లీలోని ఆమ్ ఆద్మీ పార్టీ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ అగస్టిన్ జార్జ్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ జరిపింది. ఆయుష్మాన్ భారత్‌ను అమలు చేయడానికి ఒప్పందం చేసుకోవాలన్న ఢిల్లీ హైకోర్టు ఆదేశాలపై స్టే విధించింది. ఈ విషయంలో స్పందన చెప్పాలని కేంద్రంతో పాటు పలువురికి నోటీసులు జారీ చేసింది. ఢిల్లీ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి సుప్రీంకోర్టుకు హాజరయ్యారు. రాష్ట్ర జాబితాలోని 1,2, 18 ఎంట్రీల కింద కేంద్ర అధికారాలు పరిమితమని సింఘ్వి వాదించారు. అయితే హైకోర్టు తన ఉత్తర్వుల్లో ఆరోగ్య రంగంలో ప్రభుత్వ అధికారాలను పునర్నిర్వచించిందని.. కేంద్ర ప్రభుత్వంతో ఢిల్లీ ప్రభుత్వం రాజీ పడాలని హైకోర్టు ఒత్తిడి చేస్తోందని సింఘ్వి వాదించారు. 2017లో ఢిల్లీ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. దాంట్లో ఢిల్లీలోని ప్రభుత్వ ఆసుపత్రులలో ఐసీయూలు, వెంటిలేటర్ల లభ్యతపై ఆందోళన వ్యక్తం వ్యక్తం చేశారు. ఆ పిటిషన్‌లో పీఎం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని సైతం అమలు చేయాలని డిమాండ్ చేశారు. దాంతో పథకాన్ని పూర్తిగా అమలు చేసేందుకు కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వం మధ్య ఓ ఒప్పందం చేసుకోవాలని హైకోర్టు ఆదేశించింది. దేశంలో ఆరోగ్య సంరక్షణ మౌలిక సదుపాయాలను బలోపేతం చేసేందుకు కేంద్రం ఈ పథకానికి శ్రీకారం చుట్టింది. ఈ పథకం జాతీయ ఆరోగ్యమిషన్ కంటే భిన్నంగా ఉంటుంది. ఇదిలా ఉండగా.. పీఎం ఆయుష్మాన్ భారత్ పథకంలో భారీ జరిగిందని మాజీ సీఎం, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. కేంద్రంలో ప్రభుత్వం మారక దర్యాప్తు జరిపితే భారీ అవినీతి గురించి ప్రజలకు తెలుస్తుందంటూ వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేశారు.

# బిసి పొలిటికల్ జెఎసి జిల్లా కార్యదర్శిగా బత్తుల జితేందర్‌గౌడ్

ప్రజాపక్షం / కొత్తకోట: బిసి పొలిటికల్ జేఏసి కార్యదర్శిగా కొత్తకోట మండలం రాయన్‌పేట గ్రామానికి చెందిన బత్తుల జితేందర్ గౌడ్‌ని నియమిస్తూ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు కొత్తకోట మండలం వడ్డెవాట గ్రామంలోని రాచాల వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా జితేందర్ గౌడ్ మాట్లాడుతూ బీసీలను చైతన్యం చేసి బీసీల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ బీసీల రాజ్యాధికారం కోసం పాటు పడతానన్నారు. నాపై నమ్మకం ఉంచి జిల్లా కార్యదర్శిగా బాధ్యత అప్పజెప్పిన స్టేట్ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్‌కి జిల్లా అధ్యక్షుడు వనం తిరుపతయ్య యాదవ్‌కి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# బిసిల అభివృద్ధికి నిరంతరం కృషి

ప్రజాపక్షం / పెద్దమందడి : బిసి పొలిటికల్ జేఏసి పెద్దమందడి మండల అధ్యక్షునిగా వెల్టూర్ గ్రామానికి చెందిన అన్నెల రమేష్ సాగర్‌ని నియమిస్తూ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం కొత్తకోట మండలం వడ్డెవాట గ్రామంలోని రాచాల వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా రమేష్ సాగర్ మాట్లాడుతూ బీసీలను చైతన్యం చేసి బీసీల అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తూ, బీసీల రాజ్యాధికారం కోసం పాటు పడతానన్నారు. త్వరలో అన్ని గ్రామ కమిటీలు వేసి రాబోవు పంచాయతీ, స్థానిక సంస్థల ఎన్నికలకు అభ్యర్థులను సిద్ధం చేస్తామని తెలిపారు. నాపై నమ్మకముంచి మండల బాధ్యత అప్పజెప్పిన స్టేట్ చైర్మన్ రాచల యుగంధర్ గౌడ్‌కి జిల్లా అధఅయక్షుడు వనం తిరుపతయ్య యాదవ్‌కి ఈ సందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బిసి పొలిటికల్ జేఏసి రాష్ట్ర కార్యదర్శి వెంకటన్న గౌడ్ , కొత్తకోట మండల అధ్యక్షుడు అంజన్న యాదవ్ , మదనాపూర్ మండల అధ్యక్షుడు మహేందర్ నాయుడు, రాఘవేందర్ గౌడ్ , దేవర శివ, గౌతమ్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.


# కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్న బిఆర్‌ఎస్ నాయకులు

ప్రజాపక్షం/పెద్దమందడి : పెద్దమందడి మండలం జంగమయ్యపల్లి గ్రామానికి చెందిన పలువురు బీఆర్‌ఎస్ నాయకులు,కార్యకర్తలు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ జడ్పీటీసీ రమేష్ గౌడ్ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన 22 మంది నాయకులకు, కార్యకర్తలకు , వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి కాంగ్రెస్ పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి సాధనంగా ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే వారికి సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఫోకస్


# సైన్స్

## వేల సంవత్సరాలు పనిచేసే బ్యాటరీ!



ఒకటి రెండు సంవత్సరాలు కాదు... వేల సంవత్సరాలు పని చేసే బ్యాటరీ అందుబాటులోకి వస్తే ఎలా ఉంటుంది? ఈ అసాధ్యాన్ని సుసాధ్యం చేసే పనిలో ఉన్నారు శాస్త్రవేత్తలు. ఇటీవల 'కార్బన్ 14 డైమండ్'గా పిలిచే బ్యాటరీ అత్యాధునిక సాంకేతికతను అభివృద్ధి చేశారు. ఇది వేల సంవత్సరాల పాటు పరికరాలకు శక్తినిస్తుందని అంటున్నారు. కార్బన్ రేడియోధార్మిక ఐసోటోప్‌ను బ్యాటరీ కార్బన్ 14 (సి14) ఉపయోగిస్తుంది. ఇది వేల సంవత్సరాల తర్వాత కూడా సగం శక్తిని పదిలంగా ఉంచుకుంటుంది. కార్బన్14 నిర్మాణంలో ఒక డైమండ్‌ను సురక్షితంగా నిక్షిప్తం చేస్తారు. ఇది రేడియేషన్ లీకేజీని నివారిస్తుంది. ఈ బ్యాటరీ సౌర ఫలకాల మాదిరిగానే పనిచేస్తుంది. అయితే, కాంతి కణాలకు బదులుగా డైమండ్ నిర్మాణంలో వేగంగా కదిలే ఎలక్ట్రాన్లను సంగ్రహిస్తుంది. వినికిడి పరికరాలు, పేస్‌మేకర్లు, వంటి వైద్య పరికరాలలో ఈ బ్యాటరీని ఉపయోగించవచ్చు, ఇది రీప్లేస్‌మెంట్స్ అవసరాన్ని గణనీయంగా తగ్గిస్తుంది. ఈ బ్యాటరీ భూమిపై నేగాక, అంతరిక్షంలోని తీవ్రమైన వాతావరణాలలో సంభావ్య అనువర్తనాలను ఈ బ్యాటరీ కలిగి ఉంటుంది. ఇక్కడ సాంప్రదాయ బ్యాటరీలను మార్చడం అసాధ్యమవుతుంది. న్యూక్లియర్ ఫిషన్ పవర్ ప్లాంట్లలోని గ్రాఫైట్ బ్లాక్స్ నుండి సేకరించిన కార్బన్14ను ఉపయోగించి అణు వ్యర్థాలను నిర్వహించడానికి బ్యాటరీ సురక్షితమైన మార్గాన్ని అందిస్తుంది. న్యూక్లియర్ ఫిషన్ పవర్ ప్లాంట్లలో ఉపయోగించే గ్రాఫైట్ బ్లాకుల నుండి సి14 ను సంగ్రహిస్తుంది కాబట్టి ఇది గ్రాఫైట్ బ్లాకుల రేడియోధార్మికతను తగ్గిస్తుంది, అణు వ్యర్థ నిల్వ సవాళ్లను పరిష్కరిస్తుంది. దీర్ఘకాలిక అణు వ్యర్థాల నిల్వ ఖర్చును, సంక్లిష్టతను తగ్గిస్తుంది.

## ఎన్‌జిసి గెలాక్సీ టైడల్ టెయిల్ గుర్తింపు



ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐఐఎ) పరిశోధకుల నేతృత్వంలోని జరిపిన ఒక అధ్యయనంలో భూమి నుండి 430 మిలియన్ కాంతి సంవత్సరాల దూరంలో ఉన్న ఎన్‌జిసి 3785 గెలాక్సీతో సంబంధం ఉన్న అతి పొడవైన టైడల్ టెయిల్‌ను గుర్తించారు. దీని చివరిలో అల్ట్రాడిఫ్యూజ్ గెలాక్సీ ఏర్పడిందని ఈ తాజా అధ్యయనం వెల్లడించింది. టైడల్ టెయిల్ అనేది గెలాక్సీలు సంకర్షణ చెందినప్పుడు లేదా విలీనమైనప్పుడు ఏర్పడే నక్షత్రాలు, వాయువుతో కూడిన పొడవైన ప్రవాహం. ఒకరకంగా ఇది తోకచుక్కగా గోచరిస్తుంది. ఈ పరస్పర చర్యల సమయంలో, గురుత్వాకర్షణ శక్తులు గెలాక్సీల బయటి ప్రాంతాల నుంచి పదార్థాన్ని ఆకర్షించి, అంతరిక్షంలోకి వెదజల్లుతాయి. ఫలితంగా ఈ నక్షత్రాలు, ధూళి, ఇతరత్రా ఖగోళ పదార్థాల ప్రవాహంగా ఆ ప్రాంతం గోచరిస్తుంది. ఈ టైడల్ టెయిల్స్ విలీనం తర్వాత చాలా కాలం పాటు కొనసాగుతాయి, ప్రస్తుతం శాస్త్రవేత్తల బృందం కనిపెట్టిన టైడల్ టెయిల్ ఎంతకాలం కొనసాగుతుందనేది ప్రస్తుతానికి సమాధానం లేని ప్రశ్న. గెలాక్సీలకు ఈ టెయిల్స్ లేదా తోకలు ఏ విధంగా అభివృద్ధి చెందుతాయి? నక్షత్రాలను ఎలా ఏర్పరుస్తాయి అనే అంశాలపై ప్రపంచ వ్యాప్తంగా విస్తృత పరిశోధనలు కొనసాగుతున్నాయి. గెలాక్సీల నక్షత్ర సముదాయం వాటి టైడల్ టెయిల్ ద్వారా తెలుస్తుందని ప్రస్తుతానికి ఒక నిర్ధారణకు వచ్చారు. అయితే, ఆయా నక్షత్రాల కూటముల ప్రరివర్తన... ప్రవర్తనలపై ఇంకా ఎలాంటి స్థిరమైన అభిప్రాయాన్నిగానీ, సిద్ధాంతాన్నిగానీ ఎవరూ ఇవ్వలేకపోతున్నారు.

## ప్లాస్టిక్ రసాయనాలకు చెక్!



పర్యావరణ కాలుష్యం నుంచి మనిషి అనారోగ్యం వరకూ ఎన్నో అనర్థాలకు కారణమవుతున్న ప్లాసిక్ నుంచి విముక్తి లభించడం అసాధ్యమనే చెప్పాలి. భూమి, నీరు, ఆకాశం.. ఇలా అన్నింటా వ్యాప్తి చెందిన ప్లాస్టిక్‌ను నివారించడం ఇప్పట్లో కష్టమే. అయితే, ప్లాస్టిక్ సృష్టించే అత్యంత ప్రమాదకరమైన డైథైల్ హెక్సిల్ థాలేట్ ప్లాస్టిసైజర్ (డిఇహెచ్‌పి)ని విచ్ఛిన్నం చేయడానికి బాక్టీరియం సల్ఫోబాసిల్లస్ అసిడోఫిలస్ ద్వారా ఉత్పత్తి చేసిన ఎంజైమ్ ఉపయోగపడుతుందని ఐఐటి రూర్కీ ఒక పరిశోధనా వ్యాసంలో పేర్కొంది. ఈ ప్రయోగం విస్తృతమై, పురోగతి చెందితే ప్లాస్టిసైజర్ల కారణంగా పెరుగుతున్న పర్యావరణ, ఆరోగ్య సమస్యల నుంచి పరిష్కారం లభిస్తుంది. పిల్లల బొమ్మలు, ఆహార పాత్రలు మొదలైన వాటిలో డిఇహెచ్‌పి వంటి ప్లాస్టిసైజర్లు కనిపిస్తాయి. వాటికి మెరుపు తీసుకురావడానికి ఉపయోగించే రసాయనాల వల్ల ఈ ప్లాస్టిసైజర్లు అభివృద్ధి చెందుతాయి. పాలీ వినైల్ క్లోరైడ్ (పివిసి) వంటి దృఢమైన ప్లాస్టిక్‌ను పాలిమర్ చైన్‌లలోని అంతర్ పరమాణు శక్తులను తగ్గించడం ద్వారా మరింత సరళంగా, మృదువుగా చేయడానికి ప్లాస్టిసైజర్లు ఉపయోగపడతాయి. ప్రత్యేకించి కేబుల్స్, గొట్టాలు లేదా పైపులు వంటి మన్నిక అవసరమైన ప్లాస్టిక్ ఉత్పత్తులకు ఇది వర్తిస్తుంది. డిఇహెచ్‌పి కేన్సర్ కారకాలు. చర్మం ద్వారా కూడా ఇవి మనిషి శరీరంలోకి చొరబడే ప్రమాదం ఉంది. అనేక రకాల రోగాలకు దారి తీస్తుంది. నిరంతరం నేలను కలుషితం చేస్తాయి. పర్యావరణ వ్యవస్థలను దెబ్బ తీస్తాయి. జీవులకు హాని కలిగిస్తాయి. ఈ ప్లాస్టిసైజర్లను తగ్గించడంలో బాక్టీరియల్ ఎంజైమ్‌లు సఫలమైతే, మానవాళికి ఎంతో మేలు జరుగుతుంది.

సిద్ధాంతపరంగా చూస్తే, ప్లాస్టిసైజర్లను ఎస్టేరేస్ ఎంజైమ్ రెండు ఉత్పత్తులుగా విచ్ఛిన్నం చేస్తుంది. సవరించిన థాలేట్ జీవ వ్యవస్థను ప్రభావితం చేస్తుంది. ఆల్కాహాల్ సమ్మేళనం పర్యావరణాన్ని ప్రభావితం చేస్తుంది. ఇవి ఇతర ఎంజైమ్‌ల ద్వారా నీరు, కర్బనం వంటి హాని చేయని పదార్థాలుగా విడిపోతాయి. స్ఫటికం యొక్క పరమాణు నిర్మాణాన్ని గుర్తించడానికి ఎక్స్ కిరణాలు ఉపయోగించే సాంకేతిక 'ఎక్స్‌రే క్రిస్టల్లాగ్రఫీ' ద్వారా ఎస్టేరేస్ ఎంజైమ్స్‌ను గుర్తించవచ్చు. ఇది డిఇహెచ్‌పి లక్ష్యంగా, అది విచ్ఛిన్నమయ్యే యంత్రాంగాన్ని అభివృద్ధి చేస్తుంది. మరింత లోతైన పరిశోధనలు జరిగి, ఈ సిద్ధాంతం ఆరణయోగ్యమైతే, ప్లాస్టిక్ సమస్యకు చెక్ పడడం ఖాయం.



## భూమిపై మాత్రమే నీరు!

మన సౌర కుటుంబంలో సూర్యుడి చుట్టూ ఎనిమిది గ్రహాలు, 146 చంద్రులులతోపాటు కొన్ని తోకచుక్కలు, గ్రహశకలాలు, ఉపగ్రహాలు, ప్లూటో వంటి మరిగుజ్జు గ్రహాలు పరిభ్రమిస్తూ ఉంటాయి. వీటిలో కేవలం భూమిపైన మాత్రమే నీరు ఉంది. జూపిటర్ (బృహస్పతి), మెర్క్యురీ (బుధుడు), మార్స్ (కుజుడు) గ్రహాలపై ఒకప్పుడు నీరు ఉండేవన్న ఆనవాళ్లు కనిపించినప్పటికీ, శాస్త్రవేత్తలు ఇంకా ఎలాంటి నిర్ధారణకు రాలేకపోతున్నారు. ప్రస్తుతానికి మాత్రం మరే ఇతర గ్రహంపైనా నీరు లేదు. భూమి ఉపరితలంపై నీరు మూడు దశల్లో ఉంటుంది. మంచులో నీరు ఘన రూపం ఉంటుంది. సముద్రాలు, సరస్సులు ఇతర వనరుల్లోని నీరు ద్రవరూపంలో ఉండి, జీవకోటి ఉనికిని కాపాడుతున్నది. వాయురూపంలోనూ నీరు ఉంటుంది. వాతావరణంలో తేమ, ఆవిరి వంటివి ఇందుకు ఉదాహరణలుగా పేర్కోవాలి. భూమిపై చిన్న చిన్న కుంటల నుంచి మహాసముద్రాల వరకూ అనేక రకాల జల కేంద్రాలు ఉన్నాయి. అందుకే, మిగతా గ్రహాలతో పోలిస్తే భూమి తన కంటూ ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. భూమిలో మూడు వంతుల విస్తీర్ణంలో నీరు ఉంది. మిగతా పావు వంతు పొడి భూమి దాదాపుగా అంగారక గ్రహ ఉపరితల వైశాల్యానికి సమానంగా ఉంటుంది. భూమధ్యరేఖ నుంచి ధ్రువాలకు ఉష్ణాన్ని మోసుకెళ్లడం, వాతావరణంలో రసాయనికంగా మరియు యాంత్రికంగా సంకర్షణ చెందడం వంటి చర్యల ద్వారా, వాతావరణంపై సముద్రాలు బలమైన ముద్ర వేస్తున్నాయి. భూమి వాతావరణం దిగువన ట్రోపోస్పియర్, మధ్యలో స్ట్రాటోస్పియర్, పైభాగంలో థర్మోస్పియర్ ఉంటాయి. సాధారణంగా తూర్పుపడమర గాలులు ఉంటాయి. కానీ తాత్కాలిక హెచ్చుతగ్గులు ఇతర గ్రహాల్లోని వాతావరణంలో కనిపించే దానికంటే భిన్నంగానూ, విస్తృతంగానూ ఉంటాయి. జెట్ స్ట్రీమ్‌లు, హ్యాడ్లీ కణాలు, సుడిగుండాలు, ఉరుములు వంటి అనేక వాతావరణ నమూనాలు మన సౌర కుటుంబంలోని ఇతర గ్రహాలపై కూడా సంభవిస్తాయి. అయితే భూమిపై వాటి అభివ్యక్తి విభిన్నంగా ఉంటుంది. సముద్ర రసాయన శాస్త్రం, గ్రహ కక్ష్య వైవిధ్యాలు, వాతావరణం, అంతర్గత మార్పులకు ప్రతిస్పందనగా వాతావరణ ఉపరితల ఉష్ణోగ్రత హెచ్చుతగ్గులకు లోనవుతూ ఉంటుంది. గత 4.6 బిలియన్ సంవత్సరాలలో, సౌర ప్రకాశంలో 30 శాతం పెరిగింది. దీని వల్ల భూమి వాతావరణం కాలక్రమేణా వేడెక్కుతూ, విపరీత ధోరణులను ప్రదర్శిస్తున్నది. ఈ వైవిధ్యాలు ఉన్నప్పటికీ, భూ వాతావరణం కొంత వరకూ సమశీతోష్ణంగా ఉండడానికి సముద్రాలు, మహాసముద్రాలే కారణం. సముద్ర వాతావరణ వ్యవస్థపైనే జీవావరణం ఆధారపడి ఉంది. ఇటీవల కాలంలో మహాసముద్రాల ఉష్ణోగ్రతలు పెరగడం ఆందోళన కలిగిస్తున్న అంశం. జీవావరణంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్న సముద్రాలు కూడా అగ్ని గుండాలుగా మారితే, భూమి ఉనికే ప్రశ్నార్థకమవుతుంది. కేవలం మన భూమిపైనే ఉన్న నీటిని పరిరక్షించుకుంటూ, కాలుష్యానికి గురికాకుండా జాగ్రత్తలు తీసుకుంటూ ముందడుగు వేయడమే మనిషి ప్రస్తుత కర్తవ్యం.

## నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వాలు

### ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల శ్రీకాంత్




**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** నిరుద్యోగుల జీవితాలతో ప్రభుత్వాలు చెలగాటమాడుతున్నాయని ఎఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల శ్రీకాంత్ ఆవేదన వ్యక్తం చేశారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రాష్ట్ర సమితి ముద్రించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను జిల్లా కేంద్రంలో రావి నారాయణరెడ్డి భవన్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువజనుల హక్కులకు ఎఐవైఎఫ్ ఉద్యమిస్తుందన్నారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి మాట తప్పిందని మండిపడ్డారు. తిరిగి అధికారంలోకి వచ్చినా నిరుద్యోగుల సమస్యలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం కూడా ఇంటికో ఉద్యోగం మరియు నిరుద్యోగ భృతి ఇవ్వక నిరుద్యోగుల ఆగ్రహానికి గురై అధికారం కోల్పోయిందన్నారు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేసింది, కానీ ఉద్యోగాల భర్తీలో జాప్యం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా వచ్చిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇకనైనా ఉద్యోగాలన్నీ భర్తీ చేసి యువతీ యువకులను ఆదుకోవాలన్నారు. యువత సమస్యల పరిష్కారానికి ఎఐవైఎఫ్ ముందుండి పోరాడుతుందన్నారు. కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి సోతుకు ప్రవీణ్ కుమార్, మాజీ ఏఐవైఎఫ్ నాయకులు క్యాతరాజు సతీష్, నేరెళ్ల జోసఫ్, కూనూరి భగత్, పంగ మహేందర్, జోగేష్, సింహాద్రి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## అమరుల స్ఫూర్తితో ఉద్యమాలు




**ప్రజాపక్షం/మహబూబాబాద్ ప్రతినిధి :** తాను నమ్మిన సిద్ధాంతంతో చివరి వరకూ పోరాడి ప్రజా ఉద్యమాలు కొనసాగించిన సురేందర్ కుమార్ స్ఫూర్తితో ఉద్యమాలు కొనసాగించాలని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి నల్లు సుధాకర్‌రెడ్డి పిలుపునిచ్చారు. కురవి మండల కేంద్రం పార్టీ కార్యాలయంలో సురేందర్ కుమార్ రెండవ వర్ధంతి సందర్భంగా సురేందర్ కుమార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సురేందర్ కుమార్ చిన్నతనం నుంచే కమ్యూనిస్టు రాజకీయాలకు ఆకర్షితులై మూడు దశాబ్దాలుగా అనేక ప్రజా పోరాటాలకు నాయకత్వం వహించి, పార్టీ విస్తరణకు కృషిచేశారన్నారు. ఎన్నో ప్రలోభాలు, ఆటంకాలు వచ్చినా తుదిశ్వాస వరకూ పార్టీలోనే కొనసాగిన అంకితభావం ఉన్న నాయకుడని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి కరణం రాజన్న, జిల్లాకార్యవర్గ సభ్యులు పోగుల శ్రీనివాస్‌గౌడ్, బుర్ర సమ్మయ్య, తురక రమేష్, దొంతు రామ్మూర్తి, కన్నె వెంకన్న, దూదికట్ల సారయ్య, బోల్లం ఉప్పలయ్య,కలగూర నాగరాజు, నిలిగొండ నాగేశ్వరావు, కురవి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నారాయణ, రాజేందర్,కుమార్,వేణు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## యువజనోద్యమాలతో సమాజ మార్పు

### యువశక్తికి నిర్వీర్యం చేస్తున్న పాలకులు : బాగం

### ఎఐవైఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ




**ప్రజాపక్షం/ఖమ్మం :** యువజనోద్యమాలతోనే సమాజంలో మార్పు వస్తుందని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు, ఎఐవైఎఫ్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు బాగం హేమంతరావు పేర్కొన్నారు. దేశ జనాభాలో సగానికి పైగా ఉన్న యువశక్తిని సద్వినియో గం చేసుకోవడంలో పాలకులు విఫలమవుతున్నారని, తద్వారా యువశక్తి నిర్వీర్యం అవుతుందన్నారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) రూపొందించిన 2025 క్యాలెండర్‌ను సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్‌తో కలిసి శుక్రవారం గిరిప్రసాద్ భవన్‌లో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హేమంతరావు మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఎఐవైఎఫ్ నిర్వహించిన పాత్ర చిరస్మరణీయమన్నారు. స్వాతంత్ర్య అనంతరం యువజన హక్కుల కోసం, ఉపాధి కల్పన కోసం ఎఐవైఎఫ్ చారిత్రాత్మక పోరాటాలు నిర్వహించిందన్నారు. మతోన్మాదం పెచ్చరిల్లుతున్న వేళ సమాజాన్ని పెను ప్రమాదం నుంచి కాపాడాల్సిన బాధ్యత యువతరంపై ఉందన్నారు. దేశంలో నిరుద్యోగం పెరుగుతుందని ఇది దేశానికి అత్యంత ప్రమాదకరమన్నారు. యువశక్తిని వినియోగించుకోలేని ఏ దేశం ముందుకు సాగలేదని, ఈ చారిత్రక సత్యాన్ని పాలకులు మరిచిపోవడం శోచనీయమన్నారు. సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఉద్యమ కార్యాచరణ రూపొందించుకోవాలని యువజనులకు ఆయన సూచించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు ఎస్‌కె జానిమియా, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎండి గౌస్‌పాషా, నానబాల రామకృష్ణ, ఎఐఎస్‌ఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు ఇటికాల రామకృష్ణ, ఎఐవైఎఫ్ నాయకులు మద్దోజు శ్రావణ్ కుమార్, మునిగ కోటేశ్వరరావు, ఉసికల రవి, జి.ఉపేందర్, మామిళ్ల శ్రీనాథ్‌రెడ్డి, మల్లెబోయిన ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

## హామీల అమలకు ఉద్యమిద్దాం

### సిపిఐ నిజామాబాద్ జిల్లా కార్యదర్శి సుధాకర్

**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీల అమలుకు ఉద్యమిద్దామని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం పార్టీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 18న సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నామని ఆయన తెలిపారు. 18న శనివారం అంబేడ్కర్ కాలనీలోని హమాలీ యూనియన్ కార్యాలయంలో అమరులు గడ్డం వెంకట్‌రెడ్డి 4వ వర్ధంతి సభ ఉంటుంది. అనంతరం సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశం వుంటుందని తెలిపారు. ఈ సమావేశానికి సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ హాజరవుతారన్నారు. సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు, ప్రజాసంఘాల ముఖ్యులు హాజరు కావాలని ఆయన కోరారు. సమావేశంలో పార్టీ జిల్లా నాయకులు ఓమయ్య, సురేష్, భాను, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



## మోదీ విధానాలతో కుదేలవుతున్న వ్యవసాయరంగం

### ఎఐకెఎస్ ఖమ్మం జిల్లా ప్రధానకార్యదర్శి గోవిందరావు

**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** కేంద్రంలోని మోదీ ప్రభుత్వ విధానాలతో దేశంలో వ్యవసాయరంగం కుదేలవుతుందని ఎఐకెఎస్ ఖమ్మం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందరావు ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం రాత్రి ఖమ్మంరూరల్ మండలం గూడూరుపాడు గ్రామంలోని సిపిఐ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం(ఎఐకెఎస్)శాఖ మహాసభను బండి అంజయ్య అధ్యక్షతన నిర్వహించారు. తొలుత అక్కడ ఏర్పాటు చేసిన ఎఐకెఎస్ జెండాను సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్ అవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో గోవిందరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 75శాతం వ్యవసాయరంగం ఉన్నప్పటికీ బడ్జెట్లో 50శాతం నిధులు కేటాయించడం రైతులను విస్మరించడమే అన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే వ్యవసాయరంగం నిర్లక్ష్యానికి గురవుతుందని ఆరోపించారు. కేవలం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తుండటంతో ఆ భారం వ్యవసాయ రంగంపై పడి ఆహార ఉత్పత్తులు తగ్గే ప్రమాద పరిస్థితులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రైతుల న్యాయమైన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని లేనిపక్షంలో తమ సంఘం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వాలపై పోరాడేందుకు రైతులు ఉద్యమాలకు సిద్ధం కావాలని గోవిందరావు పిలుపునిచ్చారు. అనంతరం గూడూరుపాడు(ఎఐకెఎస్) నూతన శాఖను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎర్రబోయిన వెంకటనరసయ్య, ఉపాధ్యక్షులుగా పోడేటి భాస్కర్, బండి ఉపేందర్, కార్యదర్శిగా బండి రమణ, సహాయ కార్యదర్శులుగా వడ్డేపూడి వెంకటేశ్వర్లు, మారుతి నరేష్, ట్రెజరీగా పుచ్చకాయల రాంబాబు, సభ్యులుగా కర్ణం పెద్ద ఉపేందర్, బండి వెంకటయ్య, ఎర్రబోయిన వెంకటనారాయణ, కొలిచలం వీరయ్య, సావిడి గంగయ్య, బండి రాంబాబు, మారుతి వెంకన్న ఎన్నికయ్యారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు సిద్దినేని కర్ణకుమార్, ఎఐకెఎస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు బానోత్ రాంకోటి, పాలేరు నియోజకవర్గం ఇంచార్జ్ ఎడ్లపల్లి శంకరయ్య, రైతుసంఘం మండల ప్రధాన కార్యదర్శి ఏలూరి భాస్కర్ పాల్గొన్నారు.






## రైతాంగ సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు




### సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డా

**ప్రజాపక్షం/కోదాడ(చిలుకూరు):** రైతాంగ సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రాజీలేని పోరాటాలు చేస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డా వెంకటయ్యలు అన్నారు. శుక్రవారం చిలుకూరు సిపిఐ భవన్‌లో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కంబాల శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తామని నేటి వరకు చేయలేదన్నారు. ఇచ్చిన హమీలను నేటి వరకు అమలు చేయలేదని విమర్శించారు. రైతు భరోసా ఎకరానికి 15వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తూ వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు పోరాడేందుకు రైతులు సిద్ధం కావాలని వారు పిలుపునిచ్చారు. వచ్చే నెలలో జరిగే రైతు సంఘం జిల్లా మహాసభలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రైతు సంఘం సభ్యత్వాలను ముమ్మరంగా చేపట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ, అన్నెం పాపిరెడ్డి, బొల్లు ప్రసాద్, కోటినారాయణ, మొక్క వీరబాబు, జక్కుల రమేష్, మామిడి నర్సయ్య, పుట్టపాక అంజయ్య, వెంకటేశ్వర్లు, మాతంగి ప్రసాద్, ధనురాజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ‘బతుకమ్మకుంట’ జోక్యానికి హైకోర్టు నిరాకరణ

**హైదరాబాద్ :** బాగ్‌అంబర్‌పేటలోని ఏడు ఎకరాల బతుకమ్మకుంట భూమి అంటున్నది వాస్తవం కాదని, అది మైదాన భూమని, తనదేనని పేర్కొంటూ ఆదే ప్రాంతానికి చెందిన సుధాకర్‌రెడ్డి దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. ఈనెల మొదటి వారంలో సింగిల్ జడ్జి కూడా ఆయన పిటిషన్‌ను కొట్టేశారు. భూమికి చెందిన ఆధారాలు, రెవెన్యూ రికార్డుల్లో పేర్లు వంటివి చూపలేదని, అయినా సివిల్ వివాదంపై సివిల్ కోర్టును ఆశ్రయించాలని, నేరుగా హైకోర్టులో పిటిషన్ వేయడానికి వీల్లేదని తీర్పు చెప్పారు. దీనిపై అప్పీల్ పిటిషన్ వేయగా, సింగిల్ జడ్జి తీర్పులో జోక్యం చేసుకోలేమని చీఫ్ జస్టిస్ అలోక్ అరాథే ఆధ్వర్యంలోని ద్విసభ్య ధర్మాసనం తీర్పు చెప్పింది.

# మహానగరి

## కళ్యాణలక్ష్మి చెక్కు అందజేత



**ప్రజాపక్షం/కొందుర్గు :** మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం మండల పరిధిలోని ఉమ్మెంత్యాల గ్రామానికి చెందిన నిర్మలమ్మకు కళ్యాణ లక్ష్మి చెక్కు తహసీల్దార్ రమేష్ కుమార్ అందజేశారు. కార్యక్రమంలో తంగళ్లపల్లి మాజీ సర్పంచ్ గోవర్ధన్ గౌడ్, మల్లేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు

### మండల ప్రత్యేకాధికారి సంధ్యారాణి



**ప్రజాపక్షం/యాచారం :** అర్హులైన పేదలందరికీ రేషన్‌కార్డులు అందే విధంగా అధికారులు కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని యాచారం, చింతపట్ల గ్రామాల్లో రేషన్‌కార్డులు, ఇందిరమ్మ అత్మీయ భరోసాపై సర్వే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరై వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేదలకు చేర వేసే విధంగా అధికారులు కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. గ్రామస్తులందరు వెరిపికేషన్‌కు సహకరించాలని కోరారు. ఇందిరమ్మ అత్మీయ భరోసాపై గ్రామాల్లో సర్వే నిర్వహిస్తున్నామన్నారు. పంచాయతి కార్యదర్శులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. అర్హులైన వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. ఈ విషయాన్ని అందరు అర్థం చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నరేంధర్‌రెడ్డి, ఎంపిఒ శ్రీలత, పంచాయతి కార్యదర్శులు తిరుపతయ్య,ఉపాధిహామీ పథకం అసిస్టేంట్ శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రక్తదానం చేయండి.. ప్రాణదాతలు కండి

### మదర్ థెరిసా చారిటబుల్ సొసైటీ చైర్మన్ చేపూరి శంకర్



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** ఎల్‌బి నగర్‌లోని కామినేని హాస్పిటల్‌లో లక్ష్మీ ప్రసన్న బాధితురాలకు ఆపరేషన్ కొరకు ఓ నెగటివ్ బ్లెక్ లేక తీవ్ర ఇబ్బందులు పడ బాదితురాలకు మదర్ తెరిసా చారిటబుల్ సొసైటీ ఆపదలో ఆదుకుని వారికి రక్తదానం అందించి ఆమె ప్రాణాలను నిలబెట్టామని మదర్ తెరిసా చారిటబుల్ సొసాటీ చైర్మన్ చేపూరి శంకర్ తెలిపారు. శుక్రవారం ఒక మహిళ తన ఆపరేషన్ కొరకు చాలా చోట్ల ఓ నెగిటివ్ బ్లెడ్ నిలువ లేక నిరాశకు గుర్రైయారని, చివరికి సామాజిక కార్యకర్త మదర్ తెరిసా చారిటబుల్ సొసైటీ అందుకుందని బాధితురాల బందువులు తెలియా చేశారు. ఈ మేరకు మదర్ తెరిసా చారిటబుల్ సొసైటీ సంస్థకు అభినందలు, కుతజ్ఞతలు తెలిపారు. అనంతరం మదర్ తెరిసా చారిటబుల్ సొసైటీ చైర్మన్ చేపూరి శంకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు బాధ్యతయుతంగా బ్లెడ్ దానం చేయాలని, అవసరమైన వారిని అదుకోవడం కోసం అండగా నిలువాసిన అవసరం మనపై ఉందని శంకర్ తెలిపారు. మాకు తెలిసిన ఓ నెగిటివ్ బ్లెడ్ వ్యక్తి జైపాల్‌రెడ్డి సహాకారంతో బాధితురాలకు అండగా నిలిచామని ఆయన పేర్కొన్నారు. జైపాల్‌రెడ్డిని సామాజిక కార్యకర్త శంకర్ అభినంధించారు. ఈ కార్యక్రమంలో అనంత వేణి నగర్ కాలనీ సెక్రెటరీ రాజేష్, పీయూష్ అగర్వాల్, సొసైటీ సభ్యులు అచ్యుత్ యోగిత తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు

### కేశంపేట మండల ప్రత్యేక అధికారి రాజారత్నం



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని కేశంపేట మండల ప్రత్యేక అధికారి రాజారత్నం వివరించారు. శుక్రవారం కేశంపేట మండల కేంద్రంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. అదే విధంగా మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ళ సర్వేను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి, షాద్‌నగర్ వ్యవసాయ శాఖ ఏడిఏ రాజారత్నం మాట్లాడుతూ అర్హులైన పేదలందరికి సంక్షేమ పథకాలను వర్తించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. లబ్దిదారులకు అభివృద్ధి, సంక్షేమ పథకాలను అంధించేలా అధికారులు కృషి చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇందిరమ్మ ఇండ్లతోపాటు రైతు భరోసా, ఇందిరమ్మ అత్మీయ భరోసా, రేషన్ కార్డులు వంటి నాలుగు పథకాలపై అధికారులు ప్రణాళిక బద్ధంగా సర్వేలు నిర్వహించాలని సూచించారు. పథకాలను అందుకోవాల్సిన లబ్ధిదారులకు అన్యాయం జరిగితే సహించేది లేదని సూచించారు. ప్రభుత్వ పథకాలు అర్హులుకు అంధించాల్సిన బాధ్యత అధికారులపై ఎంతైనా ఉందని పేర్కొన్నారు. సమావేశంలో మండల తహసీల్దార్ రాజమౌళి, వ్యవసాయ శాఖ అధికారిణి శిరీష, ఎంపివో కిష్టయ్య, ఏపిఓ అజిజ్, డిప్యూటి తహశీల్దార్‌తోపాటు ఏఈఓలు పాల్గొన్నారు.

## ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



**ప్రజాపక్షం/కొందుర్గు:** ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని బిఝెశ్రీపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. కొందుర్గు మండలం వెంకిర్యాల శివారులోని సంజీవపురంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహోత్సవాల్లో భాగంగా చివరి రోజు శుక్రవారం స్వామి వారి కళ్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అంతకుముందు బిజేపి సీనియర్ నాయకులు శ్రీవర్ధన్‌రెడ్డి, అందే బాబయ్యలు హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రాఘవేందర్ గౌడ్, లంకాల రామకృష్ణారెడ్డి, రాజేష్ పటేల్, లింగమయ్య గౌడ్, గోవింద్, మాసయ్య గౌడ్,మన్నె నారాయణ యాదవ్, శివారెడ్డి, లక్ష్మీ కాంత్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సుధాకర్, కె రాజుగౌడ్, రవి, రఘు, తదితరులు పాల్గొన్నారు.

# కాంట్రాక్టర్ల బిల్లులపై సోషల్ ఆడిట్

**క్షేత్రస్థాయిలో పరిశీలించిన తరువాతే బిల్లుల మంజూరు**

**సంబంధిత అధికారులను ఆదేశించిన జిహెచ్‌ఎంసి కమిషనర్ ఇలంబర్తి**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కాంట్రాక్టర్లు చేసిన పనులపై నిఘా పెట్టాలని మహానగర పాలక సంస్థ(జిహెచ్ ఎంసి) నిర్ణయించింది. ఈ మేరకు వర్క్ మేనేజ్ సిస్టం(డబ్ల్యూఎంఎస్)లోకి జోనల్ కమిషనర్ కూడా చేర్చి పనుల పై పర్యవేక్షణ చేయాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఇలంబర్తి ఆదేశించినట్లు తెలిసింది. ఇంజనీర్ల పనితీరుపైనా అనుమానాలు, ఆరోపణలు వస్తుండటంతో కమిషనర్ వారి పర్యవేక్షణ, పనితీరుపైనా ప్రత్యేక దృష్టిసారించారు. ఈ నేపథ్యంలోనే గత రెండేండ్ల క్రితం 2021–22, 2022–23 ఆర్థిక సంవత్సరాలలో జరిగిన పనులను, వాటికి సంబంధించిన బిల్లులను మరోసారి తనిఖీ చేయాలని, బిల్లులుంటే అవి ఎందుకు పెండింగ్ అయ్యాయి అనే అంశాలపై ఆరా తీస్తున్నారు. జరిగిన పనులను పునర్ పరిశీలిన చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రేటర్ కాంట్రాక్టర్ల పనులు, వాటి నాణ్యత, వాటి వివరాలపై విమర్శలు బలంగా ఉన్నాయి. పాట్ హోల్స్ ఫిల్ చేసిన విషయంలోనూ, వినాయక నిమజ్జనం సందర్భంగా చేసిన పనులపైనా ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో జోనల్ కమిషనర్ పర్యవేక్షణ చేయాల్సిందిగా కమిషనర్ సూచించినట్టు అధికార వర్గాలు చెప్పుతున్నాయి. గత సంవత్సరంలో కాంట్రాక్టర్లు సమర్పించిన కొన్ని బిల్లులపై కమిషనర్ ఇలంబరితి విచారణకు ఆదేశించారు. వాటికి సంబంధించిన పనులు చాలా కాలం క్రితం మంజూరు చేశారు.

### పాత బిల్లులకు సోషల్ ఆడిట్ తప్పనిసరి..

ఫిబ్రవరి, జూన్, 2024 మధ్య, ఎనిమిది సంవత్సరాల క్రితం మంజూరు చేసిన పనులకు బిల్లుల చెల్లింపు కోసం జిహెచ్‌ఎంసి అభ్యర్థనలు వచ్చాయి. ఇది అక్రమాల గురించి అనుమానాలకు దారితీసిందని అధికార వర్గాల తెలిపాయి. ఈ ఐదు నెలలకాలంలో అందిన 1940 బిల్లులలో 600 కంటే ఎక్కువ 2016–17, 2022–23 ఆర్థిక సంవత్సరాల మధ్య పరిపాలనా అనుమతి ఇచ్చిన పనులకు సంబంధించినవి ఉన్నాయి. బిల్లులు సమర్పించిన మొత్తం రూ.160 కోట్లకు పైగా ఉన్నాయి. 2016–17కి సంబంధించిన పాత బిల్లుల మంజూరు కోసం సమర్పించిన బిల్లులు రూ.15,71,535 ఉన్నాయి. తదుపరి సంవత్సరానికి సంబంధించిన మూడు బిల్లులు రూ.21,02,736, 2022–23 సంవత్సరానికి సంబంధించిన మొత్తం 429 బిల్లులు సమర్పించారు. వీటి విలువ రూ.107 కోట్లకు పైగా ఉంది. 109 బిల్లులు గత సంవత్సరం ఇచ్చిన మంజూరు ద్వారా వచ్చాయి. ఈ బిల్లులన్నీ ఆడిట్ కోసం పంపించాలని కమిషనర్ ఆదేశించారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయి తనిఖీల తర్వాత మాత్రమే కాంట్రాక్టర్లకు విడుదల చేస్తామని అధికారులు తెలిపారు. అంతకుముందు కాంట్రాక్టర్లు చేసిన పనులపై తప్పనిసరి సామాజిక ఆడిట్ ఉండేది, కానీ తెలియని కారణాల వల్ల దీనిని రద్దు చేశారు. నిధుల విడుదలకు ముందు సరైన తనిఖీలు, బ్యాలెన్స్ ఉండేలా ఆడిట్‌ను తిరిగి తీసుకువస్తామని ఉన్నత స్థాయి అధికారి ఒకరు చెప్పారు.

### దశల వారీగా చెల్లింపులు..

గ్రేటర్ చేసిన పనులకు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సింది రూ. 900 కోట్లు మాత్రమేనని, ఇందులో సుమారు రూ. 250 కోట్ల వరకు కమిషనర్ అప్రూవల్ ఉన్నదని, ఇవి తీసేస్తే ఇక మిగిలింది కేవలం రూ. 650 కోట్లు మాత్రమేనని అధికారులు తేల్చేశారు. వీటిని కూడా అతి త్వరలోనే చెల్లించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. కాంట్రాక్టర్లు చేసే పనులపై ఆరోపణలు వస్తున్నాయని, నాణ్యత, సమయానుకూలంగా పనులు పూర్తి చేయకపోవడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, ఇది కూడా బిల్లులు చెల్లింపుల్లో జాప్యానికి ఒక కారణమని అధికారులు చెప్పుతున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రూ. 700 కోట్లు కాంట్రాక్టర్లకు బ్యాంక్ ద్వారా చెల్లించేందుకుగానూ బడ్జెట్ ప్రతిపాదించడం జరిగిందని అధికారులు స్పష్టంచేస్తున్నారు. ప్రస్తుతం జీతాలకు, నిర్వహణకు జిహెచ్‌ఎంసి ఎదురుచూసే పరిస్థితి లేదనీ, క్రమంగా ఒక్కటో తేదీన జీతాలు ఖాతాలో పడుతాయని వెల్లడించారు.

### గణేష్ నిమజ్జనం కోసం అదే రోజు టెండర్లు పిలిచిన వైనం..

వినియక నిమజ్జనం గత సెప్టెంబర్ 17న నిర్వహించారు. అయితే, మల్కాజిగిరి మునిసిపల్ సర్కిల్ ఈఈ మాత్రం గణేష్ నిమజ్జనం సందర్భంగా సిసి రోడ్డు ప్యాచ్ వర్క్ పనులకు వార్డు 141. గౌతంనగర్ చేసేందుకు రూ. 18 లక్షల అంచనా వ్యయంతో చేపట్టాలని 12 సెప్టెంబర్ టెండర్ పిలిచి సెప్టెంబర్ 17న టెండర్లను ఓపెన్ చేయడం జరుగుతుందంటూ టెండర్లను పిలిచారు. సెప్టెంబర్ 17న వినాయక నిమజ్జనం జరుగుతుంటే, అదే రోజు టెండర్లను పిలిచి, టెండర్లను ఎప్పుడు ఖరారు చేస్తారు?, ఆ కాంట్రాక్టర్ వర్క్ ఆర్డర్ ఎప్పుడు ఇస్తారు?, ఆ టెండర్ పనులు ఎప్పుడు మొదలుపెడతారనే విషయం మిలీయన్ డాలర్ల ప్రశ్నగా మారింది. ఆ పనులను ఎప్పుడు పూర్తిచేస్తారు?, సెప్టెంబర్ 17న వినాయక నిమజ్జనమే పూర్తయిన తర్వాత టెండర్లను వినాయక నిమజ్జనం కోసమని పిలవడం ఏమిటానే విషయంపై ఇటు ఇంజనీర్ల పనితీరుపై, అటు కాంట్రాక్టర్ పనులపైనా ఆనుమానాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఇదంతా కేవలం బిల్లులు స్వాహా చేసేందుకు టెండర్లను పిలిచారనేది ప్రధాన ఆరోపణ. ఇదే తరహాలో గోషామహాల్ సర్కిల్ పరిధిలోని మంగళ్ హాట్ టెండర్లు పిలిచి మూడు నెలల్లో పనులు పూర్తిచేయాలని వర్క్ ఆర్డర్ ఇస్తే, ఆ పనులను ఆరుమాసాల అనంతరం పనులు చేపట్టినా, వాటికి బిల్లులు ఇవ్వడంపై కాగ్ నివేదిక తప్పుబట్టింది. అక్కడ కూడా ఇంజనీర్ల పనితీరు, కాంట్రాక్టర్ పనులపైనా ప్రధాన ఆరోపణ. ఇక్కడ ఏమి జరిగి ఉంటుందనేది బహిరంగ రహస్యం. ఈ నేపథ్యంలోనే జిహెచ్‌ఎంసి పరిధిలో చేపట్టే పనులపై ఇంజనీర్లపైనా, కాంట్రాక్టర్లపైనా ఆరోపణలు బలంగా ఉన్నాయి.

## క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయి

### మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** క్రీడలతోనే స్నేహ సంబందాలు పెంపొందుతాయని, క్రీడా స్ఫూర్తితోనే ఆటలు అడేందుకు కృషి చేయాలని షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని మినీ స్టేడియంలో నిర్వహించిన షా క్రికెట్ టోర్నమెంట్2025 ముగింపు కార్యక్రమానికి హాజరై విజేతలకు ట్రోఫీలు, బహుతులు అందజేశారు. ఈ సందర్భంగా బాబర్‌ఖాన్ మాట్లాడుతూ యువత క్రీడల పట్ల సమిష్టి నైపుణ్యతను పెంపొందించేందుకు కృషి చేయాలని సూచించారు. క్రీడలు శారీరక, మానసిక శ్రేయస్సుకు ఎంతగానో ఉపయోగపడుతాయని తెలిపారు. క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా భావిస్తూ ముందుకు సాగితేనే విజయాలు వెన్నంటే ఉంటాయని పేర్కొన్నారు. క్రీడలు పోటీల సాదర్థ్యాన్ని, నాయకత్వ గుణాలను జట్టుగా పనిచేసే నైపుణ్యాలను పెంపొందిస్తాయని వివరించారు. క్రీడలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగితేనే మండల స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు వెళ్ళె అవకాశాలు ఉంటాయని సూచించారు. క్రీడలతోనే యువతో ఆత్మవిశ్వాసం పెరుగుతుందని, దాంతో బంగారు భవిష్యత్‌ను మెరుగు పరుచుకునేందుకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రఘునాయక్, చెంది తిరుపతిరెడ్డి, అగ్గనూరి బస్వం, మహ్మద్ ఇబ్రహీం, కబీర్, రవితేజ, అజాస్, మహ్మద్, జాఫర్, అలీసాబ్‌లు పాల్గొన్నారు.



## ‘గణతంత్ర’ వేడుకకు పకడ్బందీ ఏర్పాట్లు



రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్

**ప్రజాపక్షం/రంగారెడ్డిప్రతినిధి:** గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అన్ని శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గణతంత్ర దినోత్సవంకు చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి శాఖల వారీగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎలాంటి లోటు పాట్లకు తావులేకుండా వేడుకలు జరిగేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. వివిధ వర్గాల వారి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా సమగ్ర వివరాలతో జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని తెలిపారు. ఉత్తమ ఉద్యోగుల ఎంపిక కోసం శాఖల వారీగా పరిమితితో కూడిన ప్రతిపాదనలు పంపించాలన్నారు. కలెక్టరేట్ తోపాటు పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉండేలా చూడాలని ఆదిభట్ల మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. గణతంత్ర దినోత్సవం వేడుకలు ఎలాంటి సంఘటనలు జరగకుండా పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని, రాచకొండ పోలీస్ అధికారికి సూచించారు. విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి సుశీందర్‌రావును ఆదేశించారు. కలెక్టరేట్‌లోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది హాజరు కావాలని అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, జిల్లా పరిషత్ సిఇఒ కృష్ణారెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



సాగుకు యోగ్యమైన భూములకే రైతు భరోసా

**యాచారం :** వ్యవసాయ యోగ్యమైన భూములను గుర్తించి అర్హులైన రైతులందరికీ రైతు భరోసా వచ్చే విధంగా అధికారులు కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రతిమాసింగ్ ఆదేశించారు శుక్రవారం యాచారం మండల కేంద్రంలో రైతు వేధికలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ వ్యవసాయ యోగ్యమైన భూములు, యోగ్యం కాని భూములను గుర్తించాలన్నారు. సాగుకు యోగ్యం కాని భూములు, గుట్టలు, లే అవుట్లు చేసిన భూములు, గతంలో ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూములు, మైనింగ్ భూములు గుర్తించాలన్నారు. హైద్రాబాద్ గ్రీన్ ఫార్మాసిటీలో భూములిచ్చిన రైతులు రైతు భరోసా రాదని తెలిపారు. భూములకు సంబంధించిన వివరాలను గూగుల్‌లో పొందుపర్చినట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో భూములు సర్వేచేసి సమగ్రమైన సమాచారం తయారు చేయాలన్నారు. ఎలాంటి అవక తవకలు లేకుండా జాగ్రతలు తీసుకోవాలన్నారు. అర్హులైన వారందరికీ రేషన్‌కార్డులు అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకంలో కూలీలందరికీ పనులు కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలు అర్హులైన వారందరికీ అందే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 21 నుండి 24 వరకు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి వివరాలను వెల్లడిస్తామన్నారు. కార్యక్రమంలో ఇబ్రహింపట్నం ఆర్‌డిఒ అనంతరెడ్డి, వ్యవసాయ శాఖ అసిస్టేంట్ డైరెక్టర్ ఎం.సుజాత, తహసీల్ధార్ అయ్యప్ప, ఎంపిడిఒ నరేంధర్‌రెడ్డి, వ్యవసాయధికారి అర్ రవినాథ్, అర్ఐలు రామకృష్ణ, మురళి, వ్యవసాయ శాఖ ఎఇఒలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి చర్యలు

### శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్

**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని అన్ని ప్రాంతాలలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని శేరిలింగపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్ తెలిపారు. హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని హఫీజ్‌పేట్ ఫ్లై ఓవర్ నుండి హుడా కాలనీ వరకు చెపట్టిన మంజీరా పైపు లైన్ పనులను త్వరగా పూర్తి చేసి, సీసీ రోడ్డు పనులను ప్రారంభించాలని అధికారులను అదేశించారు. శుక్రవారం హఫిజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మైత్రి నగర్ మంజీరరోడ్డునందు నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఇంజనీరింగ్ డిపార్టమెంట్ అధికారులు డీఈ, ఏఈ ఇతర అధికారులతో కలసి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవర్గ అభివృద్ధికి బాటలు వేస్తూ మౌళిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని తెలిపారు. ప్రజలకు సౌకర్యవంతమైన మెరుగైన జీవన విధానాన్ని , రహదారుల ఏర్పాటు చేసి చక్కని ప్రయాణానికి బాటలు వేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర లేబర్ సెల్ ఉపాధ్యాక్షులు నల్లా సంజీవరెడ్డి, జిల్లా ఉపాధ్యాక్షులు వీరేందర్‌గౌడ్, ప్రధానకార్యదర్శి కృష్ణ, సభ్యులు నారయణరావు, కృష్ణమూర్తి, ప్రసాద్, వేంకటేశ్వర్లు పాల్గొన్నారు.



## ప్రతిభతోనే క్రీడాకారులకు గుర్తింపు

### మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



**ప్రజాపక్షం/కొందుర్గు:** ప్రతిభతోనే క్రీడాకారులకు గుర్తింపు వస్తుందరి మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. శుక్రవారం మండలంలో జరిగిన కొందుర్గు ప్రీమియర్ లీగ్ సీజన్ ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరు విజేతలకు బహుమతులు అందజేశారు. కొందుర్గు ప్రీమియర్ లీగ్ సీజన్ 5 విజేతగా ముంబాయి జట్టు నిలిచింది. శుక్రవారం ఫైనల్ మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్, కేకేఆర్ జట్లు తలపడగా, ముంబై ఇండియన్స్ జట్టు గెలుపొందింది. రన్నర్‌గా కేకేఆర్ జట్టు నిలిచింది. టోర్నమెంట్ విజేతగా నిలిచిన ముంబై ఇండియన్స్ జట్టుకు రూ.30వేల నగదును, రన్నర్‌గా నిలిచిన కేకేఆర్ జట్టుకు రూ.20వేల నగదును అందజేశారు. విజేతకు, రన్నర్ జట్లకు షాద్నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ షీల్డ్‌లను అందజేశారు. టోర్నమెంట్‌లో మొత్తం 8 జట్లు పాల్గొన్నాయి. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ క్రీడలతో యువకుల మధ్య స్నేహ సంబంధాలు బలపడుతాయన్నారు. కార్యక్రమంలో నాయకులు వి నారాయణరెడ్డి, గణేష్, శ్రీధర్‌రెడ్డి, రాజేష్ పటేల్, మాణయ్య, కావలి యాదయ్య, దర్గా రాంచంద్రయ్య, ఈరాపురం రఘునాథ్‌గౌడ్, షబ్బీర్, జిబి కృష్ణ, రామగళ్ల సుందర్, కావలి శరత్‌కుమార్, ప్రభాకర్, గుంటి నరేందర్, నర్సింలు, కలాం, కావలి ప్రవీణ్, సాయి, చిన్నరాజుగౌడ్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## పేద ప్రజల మేలు కోరే..

### ఉప్పల వెంకటేశ్‌పై పాట రిలీజ్

**ప్రజాపక్షం/రంగారెడ్డి :** ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ జన్మదినాన్ని పురస్కరించుకుని ప్రముఖ సింగర్ చౌటి విజయ్ కుమార్ సరికొత్త పాటను విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్ర మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, తలకొండపల్లి మాజీ జెడ్‌పిటిసి ఉప్పల వెంకటేశ్ జన్మదినం పురస్కరించుకుని ఉప్పల వేంకటేశ్ ముఖ్య అనుచరుడు, పడకల్ గ్రామనికి చెందిన చౌటి విజయ్ కుమార్ మరో సింగర్, రచయిత భీముడుతో రాసి పాడిచ్చిన సరికొత్త పాటను శుక్రవారం హైదరాబాదులోని ఉప్పల వెంకటేశ్ కార్యాలయంలో విడుదల చేశారు. కల్వకుర్తి నియోజకవర్గంలో ప్రజల కోసంమై కదిలినాడు... అంటూ నూతన ఒరవడిని సృష్టించే కొత్త పాట రిలీజ్ కావడంతో అభిమానుల్లో ఆనందాన్ని రేకెత్తించింది. ఈ పాటలో పేద ప్రజలకు, పేద విద్యార్థులకు చేసిన గొప్ప మేలును అందులో వర్ణించారు. సింగర్ భీముడు, యవ నాయకుడు చౌటి విజయ్ కుమార్‌కు ఉప్పల వెంకటేశ్ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో తలకొండపల్లి మాజీ ఎంపిపి నిర్మల శ్రీశైలం గౌడ్, మండల సర్పంచ్ సంఘం మాజీ మండల అధ్యక్షులు జప్లావత్ గోపాల్ నాయక్, యువ నాయకుడు పబ్బ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



### మేడ్చల్ డిపో మేనేజర్‌కు కౌన్సిలర్ వినతి పత్రం

**ప్రజాపక్షం/దుండిగల్:** దుండిగల్ మున్సిపల్ పరిధిలోని బహదూర్‌పల్లిలో గత కొన్నేళ్లుగా మేడ్చల్ డిపోకు చెందిన 227 టిఎస్‌ఆర్‌టిసి బస్సులు గ్రామంలోని ఓం జెండా దగ్గర ఆపడం జరిగేదని అయితే కొని రోజులుగా ఇందిరమ్మ కాలనీకి వెళ్లే బస్సు స్టాప్ దగ్గర ఆపడం చేత గ్రామానికి చెందిన ప్రజలు, వృద్ధులు, మహిళలు, విద్యార్థులు రోజువారి కూలీలు బస్సు కోసం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే బస్సులను నిలపాలని, మేడ్చల్ డిపో మేనేజర్ సుధాకర్‌ను కలిసి కౌన్సిలర్ నర్సింగం భరత్ కుమార్ పత్రం అందజేశారు.

# మహానగరి

### ఆర్‌యుబి నిర్మాణంలో నష్టం జరుగదు :ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** గౌతంనగర్ రైల్వే గేట్ వద్ద మంజూరైన రైల్వే అండర్ బ్రిడ్జి(ఆర్‌యుబి) నిర్మాణంలో భాగంగా స్థానిక నివాసితులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రీతిలో స్థల సేకరణ జరుగుతుందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి తెలిపారు. ఎవరైనా స్థలం నష్టపోతే వారికి గజానికి లక్ష రూపాయల చొప్పున నష్టపరిహారంగా ఇచ్చేందుకు నిర్ణయం జరిగిందన్నారు. శుక్రవారం జిహెచ్‌ఎంసి, జలమండలి, విద్యుత్ విభాగాల అధికారులతో కల్సి ఆయన ఆర్‌యుబి నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ విషయమై పరిశీలించారు.

## సిఎం సహాయనిధి నిరుపేదలకు వరం : బండి రమేష్



**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:** సిఎం సహాయ నిధి నిరుపేదలకు వరమని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ అన్నారు. అనారోగ్యంతో భాధపడుతున్న ఫతేనగర్ డివిజన్‌కు చెందిన జే. జలంధర్‌కు రూ.60వేలు, అల్లాపూర్ డివిజన్‌కు చెందిన చెరుకూరి తేజేశ్వర్ రావులకు రూ. 60 వేలు ముఖ్యమంత్రి సహయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను శుక్రవారం బాలానగర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్ బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సిఎం రేవంత్ రెడ్డికి, నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేష్‌లకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ లక్ష్మ య్య, డివిజన్ అధ్యక్షులు మోయినుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



## యువత నిత్యం వ్యాయామం చేయాలి

### ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:** యువత శరీర ధృఢత్వాన్ని పెంచుకునేందుకు నిత్యం వ్యాయామం చేయాలని ఫతేనగర్ డివిజన్ కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ అన్నారు. గత ఎన్నికల్లో యువతకు ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు సహకారంతో రూ.18 లక్షల జిహెచ్‌ఎంసి నిధులతో వ్యాయామ పరికరాల పనులను శుక్రవారం ఎఈ రాధా కృష్ణతో కలిసి భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని పార్టీ బస్తీలో యువతకోసం కమ్యూనిటీ హాల్ భవనంలో జిమ్ ఏర్పాటుకు పనులను ప్రారంభించామని తెలిపారు. 10 నుంచి 15 రోజులలో పరికరాలు అమర్చి యువతకు జిమ్‌ని అందుబాటులోకి తేస్తామన్నారు. నిత్యం వ్యాయామంచేసి ఆరోగ్యాన్ని కాపాడుకొని సన్మార్గంలో నడువాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు కంచి భిక్షపతి, జయమ్మ, శోభన్ బాబు, బబ్లు, రాజేశ్వర్, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్ రెడ్డిని లై డిటెక్టర్‌కు రమ్మనే అర్హత కెటిఆర్‌కు లేదు

### టిపిసిసి అధికార ప్రతినిధి సత్యం శ్రీ రంగం

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:** సిఎం రేవంత్ రెడ్డిని లై డిటెక్టర్‌కు రమ్మనే అర్హత కెటిఆర్‌కు లేదని టిపిసిసి అధికార ప్రతినిధి సత్యం శ్రీ రంగం అన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ కెటిఆర్ ఇడి కార్యాలయం నుంచి బయటకు వచ్చి మీసాలు తిప్పుతున్నాడు. సిఎంను లై డిటెక్టర్ టెస్ట్ చేయాలని అంటున్నారన్నారు. కెటిఆర్ వ్యాఖ్యలు చూస్తుంటే కామెడీ సీన్స్ గుర్తుకు వస్తున్నాయన్నారు. ఇడి, ఎసిబి మొదటి విచారణలోనే నీ కళ్ళలో



భయం కనపడిందని, కెటిఆర్‌కు చిప్పకూడు తప్పదన్నారు. నువ్వు లోపల ఎంత భయపడ్డావో అందరికి అర్థం అవుతుందన్నారు. అవినీతే లేదంటాడు. లొట్టపీసు కేసు అంటాడు. లొట్టపీసు కేసు అయితే నీకు ఎందుకు అంత భయమని అన్నారు. రేవంత్ రెడ్డి పై 80 కేసులున్నాయి. ఆరు నెలలో చంచల్ గూడ జైలులో ఉండడం ఖాయమని, నీకు ఏ దారి లేదు జైలుకు పోవడమే తప్ప అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సంధ్య రెడ్డి, శ్రీకాంత్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

## నిజాంపేట్‌లో నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** నిజాంపేట్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ సబ్ స్టేషన్ ఎఇ రాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ నిజాంపేట్ 33/11కెవి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని నిజాంపేట్, శ్రీనివాస కాలనీ, జర్నలిస్ట్ కాలనీ, భవ్యాస్ ఆనందం ఫీడర్ లైన్ మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 14 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని అన్నారు. సబ్ స్టేషన్ పరిధిలోని కొన్ని ప్రాంతాలలో విద్యుత్ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

**కొడంగల్‌లో వారానికి ఒకరోజు కరెంటు నిలిపివేత**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలో ప్రతి వారానికి ఒకరోజు కరెంటు సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు వాట్సప్‌లో మెసేజ్‌లు చేశారు. కొడంగల్‌లో విద్యుత్ వైర్లు, స్థంబాల మార్పిడి పలు మరమత్తుల పేరిట వారానికి ఒక రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పాడుతుందని అందుకు కొడంగల్ మండల ప్రజలు సహకరించాలని విజ్ఞప్తులు చేశారు. గత రెండు మూడు నెలల నుంచి ఇదే తంతు కొనసాగుతుండటంతో పట్టణ ప్రజలే కాకుండా మండలంలోని పలు గ్రామాల ప్రజలు ముఖ్యమంత్రి తీరుపై భగ్గుమంటున్నారు.

## రేషన్‌కార్డుల సర్వే ముమ్మరం

**ప్రజాపక్షం /కొడంగల్ :** కొడంగల్ నియోజకవర్గంలో రేషన్ కార్డులు, రైతు భరోసాపై అధికారుల సర్వే ముమ్మరంగా సాగుతోంది. శుక్రవారం కొడంగల్ మున్సిపల్ పరిధిలోని 11వ వార్డులో తహశీల్దార్ విజయ్‌కుమార్, కమిషనర్ బలరాం నాయక్‌ల సమక్షంలో అధికారులు ఇంటింటి సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతు కొడంగల్ మండల పరిధిలోని ఆయా గ్రామాలలో రేషన్ కార్డుల కొసం 1068 దరఖాస్తులు రాగా, కొడంగల్ మున్సిపల్ పరిధిలో 294 దరఖాస్తులు రావడం జరిగిందన్నారు. అందులో భాగంగానే ఇంటింటికి వెళ్లి సర్వే చేపట్టి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అందించే విధంగా అధికారులు ముందుండి పనిచేస్తున్నట్లు ఏ సమస్య వచ్చిన అధికారుల దృష్టికి తీసుకురావాలని తహశీల్దార్ విజయ్‌కుమార్ తెలిపారు.

## మార్గదర్శకాల మేరకే అర్హుల గుర్తింపు

- వ్యవసాయ భూములున్న వారికే రైతు భరోసా
- రెండు రేషన్ కార్డులుంటే ఏరివేత
- ఇళ్ల కేటాయింపులో జియో ట్యాగింగ్, ఎఐల సహకారం

**కమిషనర్ శశాంక**



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందించనున్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, నూతన రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులాంటి సంక్షేమ పథకాలను అర్హులైన వారికి అందించే దిశగా జిల్లా యంత్రాంగం బాధ్యతాయుతంగా, నిష్పక్షపాతంగా పని చేయాలని మేడ్చల్ జిల్లా స్పెషల్ ఆఫీసర్, స్టేట్ ఫ్లాగ్‌షిప్ ప్రాజెక్టు కమిషనర్ కె.శశాంక ఆదేశించారు. శుక్రవారం జిల్లాలోని శామీర్‌పేట తహసీల్దార్ కార్యాలయంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై జిల్లా కలెక్టర్ గౌతంతో కల్సి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల వారీగా క్షేత్ర స్థాయి పర్యటనలు నిర్వహించి సర్వే నంబరు ప్రకారం వ్యవసాయేతర భూములను గుర్తించి నివేదికలను తయారు చేయాలన్నారు. ఈ నివేదికలను చివరిగా ఆయా తహసీల్దార్లు పరిశీలించాల్సి ఉంటుందన్నారు. గుట్టలు, రాళ్లు, లేఅవుట్లు, కళాశాలలు, గోదాములు, పౌల్ట్రీ ఫారాలు ఉండే భూములను తమ నివేదికల్లో స్పష్టంగా వ్యవసాయేతర భూములుగా ప్రభుత్వ రికార్డులలో నమోదుచేసి చూపించాలన్నారు. గ్రామ స్థాయిలో గ్రామ సభలు, మున్సిపాలిటీ స్థాయిలో వార్డు కమిటీ సభలను నిర్వహించి ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా అభ్యంతరాలను సైతం స్వీకరించి అవసరమైతే పరిష్కరించటం ద్వారా సర్వేను ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు పకడ్బందీగా రూపొందించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం వ్యవసాయ భూములకు పెట్టుబడి సాయంగా ఎకరాకు రూ.6వేల చొప్పున రెండు విడతలుగా రూ.12 వేలు రైతు భరోసా పథకం కింద చెల్లించనుందని స్పెషల్ ఆఫీసర్ శశాంక తెలిపారు. గతంలో వ్యవసాయేతర భూములకు ఇచ్చిన రైతు బంధును పూర్తిగా తొలగించాల్సిందేనన్నారు. ఈ ప్రక్రియలో మండల ప్రత్యేక అధికారులు సమగ్రంగా పర్యవేక్షించాలన్నారు.

2023–24 సంవత్సరానికి గాను కనీసం 20 రోజులు ఉపాధి హామీ పనిదినాలు పూర్తి చేసుకొన్న భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబానికి ఈ పథకం వర్తిస్తుందని, దీనికోసం రాష్ట్ర స్థాయి నుండి జిల్లాల వారీగా వచ్చిన ముసాయిదా అర్హుల జాబితాలో లబ్ధిదారులను గుర్తించే ప్రక్రియలో భాగంగా ఉపాధి హామీ కూలీ గుర్తింపు కార్డును, ఆధార్ కార్డుతో లింక్ చేయాలని, లేని వాటిని నవీకరించాలని, దీనికంతా ఎంపిడిఓలు, ఎంపిఓలు సమన్వయం తో పనిచేసి ప్రతి గ్రామ సభలో ఈ జాబితాను ప్రచురించి ప్రతి ఒక్కరికి స్పష్టంగా తెలియ చేయాలన్నారు. కొత్త రేషన్ కార్డుల జారీచేసే ప్రక్రియ కోసం ఏ వ్యక్తికి రాష్ట్రంలో మరో ప్రదేశంలో మరో రేషన్ కార్డు లేకుండా పరిశీలించి ధృవీకరించుకోవాలని, గ్రామీణ ప్రాంతవాసులకు వార్షిక ఆదాయం రూ.1.5 లక్షలు, అర్బన్ ప్రాంతవాసులకు వార్షిక ఆదాయం రూ. 2లక్షలుగా నిర్దేశించామన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద దారిద్ర రేఖకు దిగువన ఉండి ఇళ్లు, పూరి గుడిసెల్లో, అద్దె ఇళ్లల్లో నివసిస్తూ నిర్మాణానికి స్థలం ఉన్న వారు అర్హులని స్పెషల్ ఆఫీసర్ శశాంక తెలిపారు. వీరిని ఎంపిక చేయటంలో వితంతువులు, దివ్యాంగులు, పారిశుద్ధ్య కార్మికులు, భూమి లేని వ్యవసాయ కూలీలకు మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఒక కుటుంబానికి ఒకే ఇల్లు మంజూరయ్యే విధంగా జియో ట్యాగింగ్, ఎఐ ద్వారా డీ డూప్లికేషన్ చేయాలని ఆయన సూచించారు. మేడ్చల్ జిల్లాలో కొత్త రేషన్ కార్డుల కోసం 12243 ధరఖాస్తులు ఉన్నాయని జిల్లా కలెక్టర్ గౌతం పేర్కొన్నారు. అనంతరం స్పెషల్ ఆఫీసర్ శశాంక, జిల్లా కలెక్టర్ గౌతంలు శామీర్‌పేట మండలంలోని ఆలియాబాద్ గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకొన్న పద్మ ఇంటికి వెళ్లి క్షేత్రస్థాయిలో ఏ విధంగా సర్వే వివరాలు నమోదు చేస్తున్నారన్న విషయాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, శామీర్‌పేట తహసీల్దార్ యాదగిరి, డిఆర్‌డిఓ సాంబశివరావు, జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ, జిల్లా పౌరసరఫరా శాఖాధికారి సుగుణబాయి. హౌజింగ్ ప్రాజెక్టు డైరెక్టర్ రమణ మూర్తి, తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకటగోపాల్, ఎంపిడిఓ సుగుణబాయి తదితరులు పాల్గొన్నారు.



## పెండింగ్ పనులన్నింటినీ తక్షణమే పూర్తి

### మేయర్ కొలను నీలా గోపాల్ రెడ్డి ఆదేశం

**ప్రజాపక్షం/ నిజాంపేట్ :** పెండింగ్ దశలో ఉన్న అభివృద్ధి పనులన్నింటినీ తక్షణమే పూర్తి చేయాలని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ కొలను నీలా గోపాల్ రెడ్డి అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ నీలారెడ్డి అధికారులు, ప్రజాప్రతినిధులతో సాధారణ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ కొలను నీలా గోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రగతినగర్, బాచుపల్లి, నిజాంపేట్ ప్రాంతాల్లోని అన్ని డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను తక్షణమే పూర్తి చేయాలని కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. కార్పొరేషన్‌లో నూతనంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రజలకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు అధికారులు ప్రణాళికలను రూపొందించాలని అన్నారు. ఆయా డివిజన్‌లలో నెలకొన్న సమస్యలు, కావాల్సిన అభివృద్ధి పనుల గురించి సభ్యుల నుండి సూచనలను తెలుసుకున్నారు. కార్పొరేషన్‌ని ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రతిఒక్కరు పనిచేయాలని సూచించారు. సమావేశంలో కమిషనర్ సాబెర్ అలీ, కార్పొరేటర్‌లు చిట్ల దివాకర్, వెంకట రామయ్య, శ్రీరాములు, ఇంద్రజిత్, కొలను వీరేందర్ రెడ్డి, కాసాని సుధాకర్, ఆగం రాజుస కాసాని శిరీష వీరేశ్, గాజుల సుజాత, రాజేశ్వరి, సుజాత, లక్ష్మీ కుమారి, మేకల వెంకటేశ్, రవి కిరన్, ఆవుల పావని, జగన్ యాదవ్, బొర్రా దేవీ చందు, జ్యోతి, ఏనుగుల శ్రీనివాస్ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు సయ్యద్ సలీం, జ్యోతి, తలారి వీరేశ్, అభిషేక్, అధికారులు పాల్గొన్నారు.



## అంతర్రాష్ట్ర డ్రగ్స్ ముఠా అరెస్టు

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** సరికొత్త పంథాలో డ్రగ్స్ సరఫరా చేస్తున్న అంతరాష్ట్ర డ్రగ్స్ ముఠాను రాచకొండ కమిషనర్ పోలీసులు అరెస్టు చేసారు. వీరి నుండి రూ.23 లక్షల విలువైన 190 గ్రాముల హెరాయిన్, ఒక్కో గ్రాము హెరాయిన్‌తో ఉన్న 10 ఎన్వలప్ కవర్లు, 2 బైకులు, 2 మొబైల్ ఫోన్లు, వేయింగ్ మిషన్‌లను స్వాధీనం చేసుకొన్నారు. రాచకొండ పోలీస్ కమిషనర్ జి.సుధీర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం ...విశ్వసనీయ సమాచారంతో గురువారం సాయంత్రం ఎల్‌బి నగర్ జోన్ ఎస్ఓటి బృందం, నేరేడ్‌మెట్ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ఆపరేషన్‌లో సైనిక్‌పురిలో నివసించే రాజస్థాన్ రాష్ట్రంలోని భీయాసార్ ప్రాంతవాసి మహేష్ సరీం(28), సఫిల్ గూడలో నివసిస్తూ గ్యాస్ మెకానిక్ గా జీవనం గడుపుతున్న రాజస్థాన్ రాష్ట్రం భోజ్‌సార్ ప్రాంతానికి చెందిన మహిపాల్(19)లను మాదకద్రవ్యాలతో కస్టమర్లకు అందించే యత్నం చేస్తుండగా రెడ్ హ్యాండెడ్‌గా అదుపులోకి తీసుకొన్నారు. మహేష్ తనకు పరిచయం ఉన్న తన రాష్ట్రానికి చెందిన సంశుద్దీన్ నుండి 200 గ్రాముల హెరాయిన్




మాదకద్రవ్యాన్ని లక్ష రూపాయలు చెల్లించి ఈ నెల పదో తేదీన రైలు మార్గంలో నగరానికి తీసుకొని వచ్చాడు. తన స్నేహితుడైన మహిపాల్‌తో కల్సి చిన్న చిన్న ప్లాస్టిక్ ఎన్వలప్‌లలో ఒక్కో గ్రాము చొప్పున హెరాయిన్ ప్యాక్ చేసి అవసరం ఉన్న మాదకద్రవ్యాలకు అలవాటు పడిన కస్టమర్లకు ఫోన్‌పే ద్వారా డబ్బులు తెప్పించుకొని ర్యాపిడో, ఓలా, ఊబర్ లాంటి బైక్ బుక్ చేసుకొని వారితో పార్సల్ ద్వారా సరఫరా చేస్తున్నారు. ఇప్పటి వరకు నిందితులు గోతెం అలియాస్ ప్రకాష్, వినోద్‌ల ద్వారా భజరంగ్, మహేష్ మరి కొంత మందికి మాదకద్రవ్యాలను సరఫరా చేసారని కమిషనర్ తెలిపారు. మరోపక్క పోలీసులకు ఏ మాత్రం అనుమా నం రాకుండా ఉండేందుకు మాదకద్రవ్యాల ప్యాకెట్లను గ్యాస్ వాల్వ్‌ల ద్వారా సరఫరా చేస్తున్నారని తెలిపారు.

## ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భాగవత్‌ను అరెస్టు చేయాలి

### సిపిఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్




**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** దేశ స్వాతంత్ర్యం పై వక్రీకరించి మాట్లాడిన ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ ను అరెస్టు చేయాలని సీపీఐ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ డిమాండ్ చేశారు. సంక్రాంతి పండుగ రోజు ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ దేశ స్వాతంత్ర్యం పై చేసిన వాఖ్యలను నిరసిస్తూ శుక్రవారం సిపిఐ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట చివరి బస్టాప్‌లో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి నాయకత్వం వారు తరచుగా రాజ్యాంగం పై, అంబేద్కర్‌పై, దేశ స్వాతంత్ర్యంపై వక్రీకరిస్తూ మాట్లాడడం వారికి దేశ స్వాతంత్ర్యంపై ఉన్న ద్వేషాన్ని నిరూపిస్తుందన్నారు. గతంలో జాతీయ పతకాన్ని ఎగురవేయకుండ అవమానించారన్నారు. హిందూ అనే పదాన్ని ఉపయోగించుకుంటున్నారే తప్ప వారి అసలు ఉద్దేశ్యం మను సిద్ధాంతాన్ని ఈ దేశంలో అమలు చేయడేమేనని అన్నారు. గతంలో బిజెపి , ఆర్‌ఎస్‌ఎస్ హిందూ అనే పదాన్ని వాడేదని, కానీ నేడు సనాతన లేక మను ధర్మం అంటున్నారని, అంటే వారికి హిందూ అనే పదం కూడా వాడరని అన్నారు. కింది వర్గాల వారైన బహుజనులు, దళితులు , అగ్రవర్ణాలైన రెడ్డి, కమ్మ, కాపు, వెలమ కులాల ప్రజలు కూడా వారికి మద్దతు పలుకుతున్నారన్నారు. స్వాతంత్ర్యం కోసం అమరులైన భగత్ సింగ్, చంద్ర శేఖర్ ఆజాద్, సుభాష్ చంద్ర బోస్, ఝాన్సీ లక్ష్మీ బాయి, శివాజీ మహారాజ్ లాంటి లక్షలాది త్యాగాలను తక్కువ చేయ్యడేమానని అన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ స్వాతంత్ర్యం పూర్వమే ఆవిర్భవించినప్పటికీ వారు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనకుండా బ్రిటిష్ వారు ఇచ్చే ఉద్యోగాలు తీసుకుని బ్రిటీష్ వారికి మద్దతు ఇచ్చిన చరిత్ర తప్ప వారికి స్వాతంత్ర్య సమరయోధులు లేరన్నారు. ఇది ప్రజలకు తెలిసి చైతన్య వంతులై తే తమ మనుగడకు ప్రమాదమని గ్రహించి చిత్పన్న బ్రాహ్మణులు చేస్తున్న కుట్ర కాబట్టి బ్రాహ్మణ కుట్రలను ప్రజలు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు హరినాథ్, సహయ కార్యదర్శి దుర్గ య్య, ప్రజానాట్య మండలి అధ్యక్షులు ప్రవీణ్, ఉపాధ్యక్షులు రాములు, శాఖ కార్యదర్శులు సహదేవ్ రెడ్డి, వెంకటేష్, నాయకులు ఇమామ్, సోమన్న, యాదగిరి, ఆశప్ప, జంబూలు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులు వేగవంతం చేయండి

### కలెక్టర్ ప్రతీక్ జైన్



**ప్రజాపక్షం / కొడంగల్ :** ప్రజా అవసరాలకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా రోడ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలోని కడ ప్రత్యేక కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి వారికి దిశ నిర్దేశం చేశారు. పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖల ఆద్వర్యంలో చేపట్టే నిర్మాణాలకు దాదాపు 2 వేల కోట్ల నిధులు మంజురు కావడం జరిగిందని. రోడ్లు వేసే క్రమంలో మిషన్ భగీరథ నీటి సరఫరాకు ఎటువంటి ఆటంకం కల్గకుండా ప్రణాళిక బద్దంగా పనులు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. నాణ్యతా ప్రమాణాలతో కూడిన పనులను చేపట్టాలని దీనిపై నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటికే మంజూరు అయినా పనులను త్వరితగతిన ప్రారంభించాలన్నారు. అసంపూర్తిగా ఉన్న అదనపు పాఠశాలల తరగతి గదులు, ప్రహరీ గోడలు అంగన్‌వాడి భవనాల పనులను వేగవంతంగా చేపట్టాలని తెలిపారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధిపై రాజీపడే ప్రసక్తే లేదని దీనిపై సంబంధిత శాఖ అధికారులు పనులలో నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. వచ్చే మరో వారంలో మరోమా రు సమీక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయనున్న ట్లు దీనిపై అభివృద్ధిపై పురోగతి ఉండాలని అన్నారు. కొడంగల్ నియోజకవర్గ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సమావేశంలో తాండూర్ సబ్ కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్, కడ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్‌ఈ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్‌అండ్‌బి ఎస్‌ఈ వసంత్‌నాయక్, విద్యుత్ శాఖ ఎస్ఇ నీలావతి, మిషన్ భగీరథ ఎస్‌ఈ జగన్మోహన్, జిల్లా అటవి శాఖ అధికారి జ్ఞానేశ్వర్, ఇంజనీరింగ్ విభాగం డిఈలు, ఇఇలు, కొడంగల్ మున్సిపల్ కమిషినర్ బలరాం నాయక్, తహశీల్దార్ విజయ్‌కుమార్‌లతో పాటు ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గోన్నారు.



## ‘ప్రజాపక్షం’ క్యాలెండర్ ఆవిష్కరణ

**ప్రజాపక్షం/బంట్వారం :** తెలంగాణ రాష్ట్ర మహిళ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ జెడ్పీటిసి కోటపల్లి సంతోష రాజు చేతులు మీదుగా 2025 ప్రజాపక్షం నూతన క్యాలెండర్ ను శుక్రవారం బంట్వారం మండల కేంద్రంలో అవిష్కారించారు. సందర్భంగా రాష్ట్ర మహిళ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కోటపల్లి సంతోష మాట్లాడూతూ.. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు అను నిత్యం సేకరిస్తూ వాటిని అధీకారుల దృష్టికి తీసుకోరావడంలో పత్రికలు ఎంతో కీలకమైనవని పేర్కోన్నారు. ప్రజాపక్షం పత్రిక ప్రజలకు మరింత చేరువై ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా పత్రికలు పనిచేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు కోటపల్లి రాజు, పిఎసిఎఎస్ డైరక్టర్ నర్సప్ప, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సిద్ది రాములు మరియు నాయకులు ఆనందం, భరత్, అశోక్, నగేష్, కిరణ్‌కూమార్,తదితరులు ఉన్నారు.

### బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

తెలంగాణ రాష్ట్ర మహిళ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మరియు మాజీ జెడ్పీటిసి కోటపల్లి సంతోష రాజు. బంట్వారం మండల పరిధిలో ఉన్న మంగ్రాస్ పల్లి గ్రామానికి చెంది హరిజన్ అంజిలయ్య (33) ఇటీవల గుండె పోటుతో మరణించిన విషయం తెలుసుకోని ఆయన కుటుంమానికి 5 వేల రూ.లు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో వికారాబాద్ జిల్లా ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు కోటపల్లి రాజు, బంట్వారం



పిఎసిఎఎస్ డైరక్టర్ నర్సప్ప, మరియు నాయకులు ఆనందం, భరత్, తదితరులు ఉన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** వికారాబాద్ ఎంఎల్‌ఎ కార్యాలయంలో స్పీకర్ ఆదేశాల మేరకు వికారాబాద్ పట్టణఅధ్యక్షులు సుధాకర్‌రెడ్డి అధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్దిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వైద్యం సకాలంలో అందించడానికి నిరుపేదలకు ఎంతో సహయపడుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, కిషన్‌నాయక్, అనంత రెడ్డి, రమేష్ మురళి, వేణుగోపాల్‌రెడ్డి అసిఫ్ తదితరులు పాల్గోన్నారు.

## 26న రైతు భరోసా, రేషన్ కార్డుల పంపిణీ

### తాండూరు ఎంఎల్‌ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి

**ప్రజాపక్షం/తాండూరు:** అర్హులైన నిరుపేదలందరికి సంక్షేమ పథకాలు అందించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని తాండూరు ఎంఎల్‌ఏ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన పెద్దేముల్‌లోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి , షాదిముబారక్ కింద 119 మంది లబ్దిదారులకు రూ.1.19కోట్ల విలువగల చెక్కులను ఎంఎల్‌ఏ అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఎల్‌ఏ మాట్లాడుతూ ఈ నెల 26నుండి అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలను అందించేందుకు సిఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యాన కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న సంక్షే మ పథకాల గూర్చి గ్రామాలలో వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కోట్‌పల్లి మార్కె ట్ కమిటి చైర్మన్ అంజయ్య, మాజీ డిసిసిబి చైర్మన్, టిపిసిసి ప్రధాన కార్యదర్శి, తదితరులు పాల్గొన్నా రు.

క్రీడ

# ఖేల్‌రత్న పురస్కారాలు ప్రదానం

**2024 ఏడాదికిగాను ఖేల్‌రత్న పురస్కారాలకు ఎంపికైన నలుగురు క్రీడాకారులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అవార్డులు ప్రదానం చేశారు.**

**ఢిల్లీ:** భారత అత్యున్నత క్రీడా పురస్కారమైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న పురస్కారాలను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రదానం చేశారు. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో.. చెస్ ప్లేయర్ డి.గుకేశ్, హాకీ స్టార్ హర్మన్‌ప్రీత్ సింగ్, పారా అథ్లెట్ ప్రవీణ్ కుమార్, షూటింగ్‌లో డబుల్ ఒలింపిక్ పతక విజేత మను బాకర్ ఈ అవార్డులు అందుకున్నారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారిణులు జివాంజీ దీప్తి (పారా అథ్లెటిక్స్), జ్యోతి యర్రాజీ (అథ్లెటిక్స్) పురస్కారాలను స్వీకరించారు. వీరితోపాటు మరో 32 మంది అర్జున, ఐదుగురు ద్రోణాచార్య పురస్కారాలు అందుకున్నారు. లైఫ్‌టైం కేటగిరీలో.. మురళీధరన్ (బ్యాడ్మింటన్), అర్మాండో ఆగ్నెలో కొలాకో (ఫుట్‌బాల్) పురస్కారాలు స్వీకరించారు.

**అర్జున అవార్డులు అందుకుంది వీరే..**

అన్ను రాణి (అథ్లెటిక్స్)
నీతూ (బాక్సింగ్)
స్వీటీ బురా (బాక్సింగ్)
వంతిక అగర్వాల్ (చెస్)
సలీమా (హాకీ)
అభిషేక్ (హాకీ)
సంజయ్ (హాకీ)
జర్మన్‌ప్రీత్ సింగ్ (హాకీ)
సుఖ్‌జీత్ సింగ్ (హాకీ)
స్వప్నిల్ సురేష్ కుసాలే (షూటింగ్)
సరబ్‌జోత్ సింగ్ (షూటింగ్)
అభయ్ సింగ్ (స్క్వాష్)
సజన్ ప్రకాశ్ (స్విమ్మింగ్)
అమన్ (రెజ్లింగ్)
రాకేశ్ కుమార్ (పారా ఆర్చర్)
ప్రీతి పాల్ (పారా అథ్లెటిక్స్)
అజీత్‌సింగ్ (పారా అథ్లెటిక్స్)
సచిన్ సర్జేరావు ఖిలారి (పారా అథ్లెటిక్స్)
ప్రణవ్ సూర్య (పారా అథ్లెటిక్స్)
హెచ్. హోకాటో సీమ (పారా అథ్లెటిక్స్)
సిమ్రాన్ (పారా అథ్లెటిక్స్)
నవ్‌దీప్ (పారా అథ్లెటిక్స్)
నితీశ్ కుమార్ (పారా బ్యాడ్మింటన్)
తులసీమతి మురుగేశన్ (పారా బ్యాడ్మింటన్)
నిత్యశ్రీ సుమతి శివన్ (పారా బ్యాడ్మింటన్)
మనీశా రాందాస్ (పారా బ్యాడ్మింటన్)
కపిల్ పర్మార్ (పారా జూడో)
మోనా అగర్వాల్ (పారా షూటింగ్)
రుబినా ఫ్రాన్సిస్ (పారా షూటింగ్)

**అర్జున అవార్డ్స్ (లైఫ్‌టైమ్)**

సుచా సింగ్ (అథ్లెటిక్స్)
మురళీకాంత్ రాజారాం పెట్కర్ (పారా స్విమ్మింగ్)

**ద్రోణాచార్య అవార్డులు (కోచ్‌లు)**

సుభాష్ రాణా (పారా షూటింగ్)
దీపాలీ దేశ్‌పాండే (షూటింగ్)
సందీప్ సంగ్వాన్ (హాకీ)



## కోహ్లీకి గాయం.. ఆ టోర్నీకి దూరం!



టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ మెడ కండరాల గాయంతో బాధపడుతున్నట్లు తెలుస్తోంది. ఇందుకు సంబంధించి కోహ్లీ ఇంజెక్షన్ కూడా తీసుకున్నారని ఓ స్పోర్ట్స్ జర్నలిస్ట్ సోషల్ మీడియా వేదికగా వెల్లడించాడు. అయితే ఈ గాయం నేపథ్యంలో కోహ్లీ రంజీ ట్రోఫీ ఆడుతాడా? లేదా? అనేదానిపై సందిగ్ధత నెలకొందని పేర్కొన్నాడు. మరోవైపు ఢిల్లీ క్రికెట్ అసోసియేషన్.. విరాట్ కోహ్లీని రంజీ జట్టుకు ఎంపిక చేసేందుకు సిద్ధమవుతోంది. ఒకవేళ అతను ఆడకపోయినా జట్టుతో కలిసి నడుస్తాడని, గాయం నుంచి కోలుకోకుంటే ప్రాక్టీస్‌కు మాత్రమే పరిమితం అవుతారని ఢిల్లీ క్రికెట్ అసోసియేషన్ వర్గాలు పేర్కొన్నట్లు వార్తలు వచ్చాయి. ఛాంపియన్స్ ట్రోఫీ 2025 ముందు కోహ్లీ గాయపడ్డాడనే వార్తలు అభిమానులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. టీమిండియా వరుస పరాజయాల నేపథ్యంలో బీసీసీఐ జట్టు ప్రక్షాళన చేపట్టిన విషయం తెలిసిందే. ఆటగాళ్ల క్రమశిక్షణగా ఉండాలని 10 కఠిన నిబంధనలను రూపొందించింది. అందులో ప్రతీ ఆటగాడు అందుబాటులో ఉన్నప్పుడు దేశవాళీ క్రికెట్ ఆడాలని స్పష్టం చేసింది. దాంతో భారత సీనియర్ ఆటగాళ్లంతా రంజీ ట్రోఫీ సెకండ్ ఫేజ్ ఆడేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే రోహిత్ శర్మ, రిషభ్ పంత్, కేఎల్ రాహుల్‌లు ఆయా రాష్ట్రాల తరపున రంజీ ట్రోఫీలో బరిలోకి దిగేందుకు రెడీ అవుతున్నారు. రిషభ్ పంత్‌కు ఢిల్లీ కెప్టెన్సీ ఆఫర్ చేసినట్లు కూడా వార్తలు వచ్చాయి. విరాట్ కోహ్లీ చివరిసారిగా 2012లో రంజీ ట్రోఫీ ఆడాడు. గత 13 ఏళ్లుగా అతను దేశవాళీ క్రికెట్‌కు దూరంగా ఉన్నాడు. కోహ్లీ గాయాన్ని పరిగణలోకి తీసుకొని బీసీసీఐ మినహాయింపు ఇస్తుందా? లేక ఆడమని పట్టుబడుతుందా? అనేది చూడాలి. మరోవైపు కోహ్లీ గాయంపై సోషల్ మీడియా వేదికగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిజంగానే విరాట్ కోహ్లీకి మెడనొప్పి ఉందా? లేక రంజీ ట్రోఫీ ఆడకుండా ఉండేందుకు సాకుగా గాయాన్ని చూపించే ప్రయత్నం చేస్తున్నాడా? అనే చర్చ జరుగుతోంది. ఏది ఏమైనా ఇప్పటి వరకు కోహ్లీ గాయంపై ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. ఫిబ్రవరి 19 నుంచి ఛాంపియన్స్ ట్రోఫీ ప్రారంభం కానుంది. అంతకు ముందు ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్ జరగనుంది. ఈ సిరీస్‌లో ఆడే జట్టునే ఛాంపియన్స్ ట్రోఫీలో కొనసాగించే అవకాశం ఉంది.

## 'వీరమల్లు' ఫస్ట్ సింగిల్!



పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ సినిమాల్లో దర్శకుడు జ్యోతి కృష్ణ అలాగే క్రిష్ జాగర్లమూడి తెరకెక్కించిన భారీ పాన్ ఇండియా చిత్రం హరిహర వీరమల్లు కూడా ఒకటి. అయితే చాలా కాలం తర్వాత ఈ సినిమా కోసం పవన్ కళ్యాణ్ మళ్ళీ పాట పాడటం జరిగింది. మాట వినాలి అంటూ శుక్రవారం మేకర్స్ సాంగ్‌ని రిలీజ్ చేశారు. మరి ఈ సాంగ్‌తో మళ్ళీ చాలా కాలం తర్వాత పవన్ మార్క్ ఫోక్ సాంగ్‌తో ట్రీట్ ఇచ్చారని చెప్పాలి. కీరవాణి స్లో మ్యూజిక్‌తో పవన్ కళ్యాణ్ తెలంగాణ యాసలో అదరగొట్టేశారని చెప్పాలి. అలాగే పెంచల్ దాస్ సాహిత్యంకి పవన్ మార్క్ రిథమ్‌తో ఇంపుగా ఉందని చెప్పాలి. అయితే ఇందులో సాంగ్ తో పాటుగా పవన్ లుక్స్ సూపర్బ్‌గా ఉన్నాయని చెప్పాలి. దీనితో పాటుగా బ్యాగ్రౌండ్ విజువల్స్ కూడా సాలిడ్ నిర్మాణ విలువలతో కనిపిస్తుండడం విశేషం. ఇలా పాట గానే కాకుండా విజువల్‌గా కూడా ఇంప్రెస్ చేసింది. ఇక ఈ చిత్రంలో నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటించగా బాబీ డియోల్ విలన్‌గా నటిస్తున్నారు. అలాగే ఏ ఎం రత్నం నిర్మాణం వహిస్తున్నారు. అలాగే ఈ మార్చి 28న పాన్ ఇండియా లెవెల్లో ఈ చిత్రం రిలీజ్‌కి రాబోతుంది.

రీల్

## లేడీ గెటప్‌లో విశ్వక్‌సేన్..




మాస్ కా దాస్ విశ్వక్ సేన్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'లైలా' ఇప్పటికే ప్రేక్షకుల్లో సాలిడ్ అంచనాలు క్రియేట్ చేసింది. ఈ సినిమాలో విశ్వక్ సేన్ తొలిసారి ఓ లేడీ గెటప్‌లో కనిపిస్తుండటంతో ఈ సినిమాలో ఆయన పర్ఫార్మెన్స్ ఎలా ఉండబోతుందా అనే ఆసక్తి అందరిలో నెలకొంది. ఇక ఈ ఆసక్తికి తెరదించుతూ లైలా చిత్ర టీజర్‌ను మేకర్స్ తాజాగా రిలీజ్ చేశారు. ఈ సినిమాలో సోను మోడల్ అనే పాత్రలో నటిస్తున్న విశ్వక్ సేన్ లేడీస్ బ్యూటీ పార్లర్‌లో ఆడవారికి మేకప్ చేస్తూ వారిని ఇంప్రెస్ చేస్తూ ఉంటాడు. ఇక మాస్ డైలాగులతో విశ్వక్ మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకున్నాడు. తనదైన మ్యానరిజంతో విశ్వక్ ఈ సినిమాలో కనిపిస్తున్నాడు. ఇక లేడీ గెటప్‌లోనూ విశ్వక్ సేన్ ఆకట్టుకున్నాడు. పూర్తి మాస్ అండ్ ట్రెండీ కంటెంట్‌తో ఈ సినిమాను చిత్ర యూనిట్ రూపొందించినట్లు ఈ టీజర్ చూస్తే అర్థమవుతుంది.

## గరిట తిప్పిన నాగచైతన్య

నాగచైతన్య హీరోగా చందూ మొండేటి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'తండేల్'. సాయిపల్లవి కథానాయిక. వచ్చే నెలలో 7వ తేదీన ఇది విడుదల కానుంది. ఈ సినిమాకు సంబంధించిన ఎక్కువ భాగం చిత్రీకరణ ఉత్తరాంధ్ర ముఖ్యంగా విశాఖపట్నం, శ్రీకాకుళంలో జరిగిన విషయం తెలిసిందే. చిత్రీకరణ సమయంలో చైతన్య విశాఖపట్నంలోని స్థానికులతో మాట్లాడారు. వారి స్టైల్‌లోనే చేపల పులుసు చేసి పెడతానని మాటిచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఓరోజు చేపల పులుసు వండి అక్కడివారికి వడ్డించారు. దీనికి సంబంధించిన స్పెషల్ వీడియోను చిత్ర నిర్మాణ సంస్థ తాజాగా షేర్ చేసింది.



## గోల్డెన్ లెగ్ రష్మిక

రష్మిక ఎక్కడ అడుగుపెట్టినా అక్కడ సక్సెస్ కలిసి వస్తోంది. ఛలో చిత్రంతో నాగశౌర్యకు, గీత గోవిందం చిత్రంతో విజయ్ దేవరకొండకు రష్మిక ప్రధాన అస్సెట్ అయింది. ఈ కన్నడ బ్యూటీ అందచందాలు, నటనకు ప్రజలు ముగ్ధులైపోయారు. అందుకే ఆ సినిమాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాలను అందుకున్నాయి. ఆ తర్వాత కూడా రష్మిక గోల్డెన్ లెగ్ అంటూ కీర్తినందుకుంది. పుష్ప గ్రాండ్ సక్సెస్‌కి ముందే నేషనల్ క్రష్ అంటూ డిక్లేర్ చేయడంతో రష్మిక హవాకు ఎదురే లేకుండా పోయింది. బాలీవుడ్‌లో ఆరంగేట్ర చిత్రాలు ఫ్లాపైనా కానీ, రష్మిక హవా ఎంత మాత్రం తగ్గలేదు. పుష్ప, పుష్ప 2 గ్రాండ్ సక్సెస్‌తో రష్మిక రేంజ్ అమాంతం మారిపోయింది. ఈ కన్నడ బ్యూటీ అడుగుపెడితే చాలు ఆ సినిమా హిట్టే ననే సెంటిమెంట్ బలపడింది. రష్మిక గోల్డెన్ లెగ్ ఇటీవల చాలా సినిమాలకు బాగా వర్కవుటవుతోంది. అయితే ఇప్పుడు సల్మాన్ ఖాన్ 'సికందర్'ని కూడా రష్మిక ఆదుకోవాల్సి ఉంటుంది. రష్మిక నటన, ఛామ్ ఈ సినిమాకి ప్రధాన అస్సెట్ కానున్నాయని అభిమానులు భావిస్తున్నారు. అసలు కెరీర్‌లో కొన్నేళ్లుగా సరైన హిట్టు అన్నదే లేని రణబీర్ కపూర్‌కి 'యానిమల్' లాంటి పాన్ ఇండియా విజయం దక్కిందంటే, ఆ చిత్రంలో రష్మిక గోల్డెన్ లెగ్ వర్కవుటైంది కాబట్టేనని అభిమానులు భావిస్తున్నారు.



# కార్పొరేటుకు దీటుగా మహబూబ్‌నగర్ ఆసుపత్రి

**ఉగాది నుంచి ఎంఆర్‌ఐ స్కానింగ్ సేవలు ప్రారంభం**

**త్వరలో అందుబాటులోకి కార్డియాలజీ సహా పలు సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు**

**ఉమ్మడి జిల్లా ఆసుపత్రుల అభివృద్ధికి సుమారు రూ.100 కోట్ల కేటాయింపు**

**ఉమ్మడి జిల్లా ఎంఎల్‌ఎలతో సమావేశంలో మంత్రి దామోదర రాజనరసింహ వెల్లడి**

**ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఆరోగ్యశాఖ అధికారులకు ఆదేశాలు జారీ**



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రిని కార్పొరేట్ ఆసుపత్రులకు దీటుగా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహ చెప్పారు. ఆసుపత్రిలో ఎంఆర్‌ఐ స్కానింగ్ సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని, సుమారు రూ. 10 కోట్లతో ఎంఆర్‌ఐ యంత్రం ఏర్పాటు చేసి, ఉగాది నుంచి సేవలు ప్రారంభిస్తామన్నారు. త్వరలోనే కార్డియాలజీ, న్యూరో సర్జరీ, యూరాలజీ, నెఫ్రాలజీ వంటి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలను సైతం మహబూబ్‌నగర్‌లో అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. హైదరాబాద్‌లోని మెడికల్ కార్పొరేషన్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమీక్ష సమావేశంలో మెడికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలోని ఆసుపత్రుల పనితీరు, వైద్యారోగ్య సేవలపై మంత్రి సమీక్షించారు. ఎంఎల్‌ఏలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, మధుసూధన్ రెడ్డి, బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, అనిరుద్ రెడ్డి, కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, షాద్‌నగర్ ఎంఎల్‌ఏ శంకర్, టిజిఎంఎస్‌ఐడిసి ఎండి హేమంత్, డిఎంఈ వాణి, టివివిపి కమిషనర్ అజయ్ కుమార్, డిహెచ్ రవిందర్‌నాయక్, డిఎంహెచ్‌ఓలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఉమ్మడి జిల్లాలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులో లేకపోవడం వల్ల వైద్య చికిత్స కోసం పేషెంట్లు హైదరాబాద్ వరకూ వెళ్లాల్సి వస్తోందని ఎంఎల్‌ఏలు మంత్రికి వివరించారు. మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రిలో కార్డియాలజీ, న్యూరో సర్జరీ, యూరాలజీ, నెఫ్రాలజీ వంటి సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి, వీలైనంత తొందరలో సూపర్ స్పెషాలిటీ డిపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న 5 మెడికల్ కాలేజీలు, జనరల్ ఆసుపత్రులు జిల్లా, ఏరియా ఆసుపత్రుల అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఇందు కోసం సుమారు రూ.100 కోట్లు ఖర్చు అవుతాయని ప్రాథమికంగా అంచనా వేశారు. సివిల్ వర్క్స్, ఎక్విప్మెంట్, ఇతర సర్వీసెస్‌కు సంబంధించి పూర్తి వివరాలతో, వేర్వేరుగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మంత్రి సూచించారు. ఉమ్మడి జిల్లాలో కొత్త సబ్ సెంటర్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు బస్తీ దవాఖాన్ల ఏర్పాటుపై సమావేశంలో చర్చించారు. అవసరమైనన్ని కొత్త ఆసుపత్రులను మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు. ఎంఎల్‌ఏలతో చర్చించి జిల్లా భౌగోళిక పరిస్థితులు, ఆసుపత్రుల మధ్య దూరం, జనాభా తదితర అంశాలను పరిగణలోకి తీసుకుని శాస్త్రీయంగా కొత్త సబ్ సెంటర్లు, పిహెచ్‌సిలు ఇతర ఆసుపత్రుల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. పేషెంట్ల సంఖ్యకు అనుగుణంగా డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేస్తామని మంత్రి వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలో కొత్తగా 4 సెంట్రల్ మెడిసినల్ స్టోరేజ్ సెంటర్లు ఏర్పాటు చేశామని మంత్రి తెలిపారు. మెడిసిన్ సప్లై, పర్యవేక్షణ కోసం ప్రతి జిల్లాకో త్రీమెన్ కమిటీ వేశామన్నారు. ఆసుపత్రులలో మంతులు ఉండేలా చూసుకునే బాధ్యత ఈ కమిటీదేనన్నారు. ఎక్కడైనా మంతులు లేవని పేషెంట్లకు ఇబ్బంది కలిగిస్తే కమిటీపై చర్యలుంటాయని మంత్రి హెచ్చరించారు. డాక్టర్లు సిబ్బంది సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత డిఎంహెచ్‌ఓలు, ఆసుపత్రుల సూపరింటెండెంట్లదేనని మంత్రి గుర్తు చేశారు. ఆసుపత్రులలో ఆకస్మిక తనిఖీల కోసం రాష్ట్ర స్థాయిలో టాస్క్‌ఫోర్స్ కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీలు ఎప్పుడైనా తనిఖీలకు వస్తాయని, ఆ సమయంలో డ్యూటీలో లేకపోతే వెంటనే చర్యలుంటాయన్నారు.

# పింఛన్ నిధి సుస్థిరతకు సమష్టిగా కృషి చేయాలి

**సిఎంపిఎఫ్ఓ ట్రస్టీల బోర్డు సమావేశం నిర్ణయం**



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పింఛన్‌దారుల సంక్షేమం దృష్ట్యా పింఛన్ నిధి సుస్థిరతకు సమష్టిగా కృషి చేయాలని కోల్ మైన్స్ ప్రావిడెండ్ ఫండ్ ఆర్గనైజేషన్ (సిఎంపిఎఫ్ఓ) నిర్ణయించింది. సిఎంపిఎఫ్ఓ 183వ బోర్డు ఆఫ్ ట్రస్టీల సమావేశం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో శుక్రవారం జరిగింది. కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్ అధ్యక్షతన తొలిసారిగా హైదరాబాద్ సింగరేణి భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, సిఎంపిఎఫ్ అధికారులు, బొగ్గు కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొగ్గు ఉత్పత్తి ద్వారా దేశ అభివృద్ధికి కృషి చేస్తున్న కార్మికులకు సామాజిక భద్రత కల్పించడం కోసం సిఎంపిఎఫ్ ద్వారా సేవల అందిస్తున్న విషయాన్ని బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్ గుర్తుచేశారు. ఈ పింఛన్ సేవలను మరింత మెరుగు పరచడంతోపాటు, కార్మికులకు పింఛన్ భద్రతను కల్పించడంపై విస్తృతంగా చర్చించారు. పింఛన్ నిధిని ఆర్థికంగా పరిపుష్టి పరచడం, పింఛన్ నిధిని అత్యంత పారదర్శకంగా సమర్థవంతంగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి రూపిందర్ బ్రార్, సంయుక్త కార్యదర్శి, ఫైనాన్సియల్ సలహాదారు నిరుపమా కొట్రూ, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సంతోష్, సిఎంపిఎఫ్ కమిషనర్ విజయ్‌కుమార్ మిశ్రా, యూనియన్ల నుంచి బోర్డు ఆఫ్ ట్రస్టీలు రామేంద్రకుమార్, కె.లక్ష్మారెడ్డి, డిడి.రామానందన్, రాకేశ్ కుమార్, ఆశీశ్ క్రిష్ణ మూర్తి, డి.ఎన్.సింగ్, సింగరేణి సిఎండి ఎన్.బలరామ్, ఎస్ఈసిఎల్ సిఎండి డాక్టర్ ప్రేమ్‌సాగర్ మిశ్రా, కోలిండియా డైరెక్టర్ (పర్సనల్) డాక్టర్ వినయ్ రంజన్, డైరెక్టర్ (ఫైనాన్స్) ముకేశ్ అగర్వాల్ హాజరయ్యారు. సింగరేణి డైరెక్టర్లు డి.సత్యనారాయణరావు, జి.వెంకటేశ్వరరెడ్డి, జిఎం(కోఆర్డినేషన్) ఎస్.డి.ఎం.సుభానీ, జిఎం (వెల్ఫేర్) శ్రీనివాసరావు, సిఎంపిపిఎఫ్ రీజినల్ కమిషనర్ హరి పచౌరి తదితరులు పాల్గొన్నారు.

## మాఫియా గ్యాంగ్ పాత్ర లేదు

**మంత్రి యోగేశ్**



**ముంబై:** బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దుండగుడి దాడి ఘటనతో ముంబై మరోసారి ఉలిక్కిపడింది. గతంలో ప్రముఖులపై మాఫియా గ్యాంగ్‌లు దాడులకు పాల్పడిన ఘటనలను గుర్తు చేసింది. అయితే, సైఫ్ దాడి వెనుక చోరీ ఉద్దేశం మాత్రమే కనిపిస్తోందని మహారాష్ట్ర హోంశాఖ సహాయ మంత్రి యోగేశ్ కదమ్ పేర్కొన్నారు. దీనిలో క్రిమినల్ గ్యాంగ్‌ల ప్రమేయాన్ని తోసిపుచ్చారు. 'సైఫ్‌పై దాడి చేసినట్లుగా భావించి ఓ అనుమానితుడిని ముంబై పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీసీటీవీలో కనిపించిన వ్యక్తి ముఖానికి దగ్గర పోలికలు ఉన్న ఈ యువకుడికి నేర చరిత్ర ఉంది. అయితే, ఈ ఘటనతో అతడికి సంబంధం లేదని గుర్తించాం. కేసు దర్యాప్తు కొనసాగుతోంది' అని మంత్రి యోగేశ్ కదమ్ పూణెలో విలేకరులతో చెప్పారు. మరో వ్యక్తిని కూడా పోలీసులు ట్రాక్ చేస్తున్నారన్నారు. దాడిలో ఘటనలో క్రిమినల్ గ్యాంగ్‌ల ప్రమేయంపై అడిగిన ప్రశ్నకు బదులిస్తూ... అటువంటి కోణం లేదని ప్రాథమిక దర్యాప్తులో తేలినట్లు మంత్రి పేర్కొన్నారు. కేవలం చోరీ కోసమే నిందితుడు వచ్చినట్లు ఇప్పటివరకు తెలిసిందన్నారు. బెదిరింపు వచ్చినట్లు సైఫ్ నుంచి పోలీసులకు ఇప్పటివరకు సమాచారం లేదని, సెక్యూరిటీని కూడా కోరలేదని చెప్పారు. ఒకవేళ భద్రత కోరితే నిబంధనల ప్రకారం కల్పిస్తామన్నారు.

# భవిష్యత్ చలనశీలత..'భారత్‌దే'

(మొదటి పేజీ తరువాయి)

అతిపెద్ద ఆటో ఎక్స్‌పో, చలనశీలత ఎకోసిస్టమ్‌కు సంబంధించిన మొత్తం విలువ గొలుసును తీసుకువస్తుంది. ఆటో మొబైల్ తయారీదారులనుంచి భాగాలు, ఎలక్ట్రానిక్స్ భాగాలు, టైర్, శక్తి నిలువ తయారీదారులు, ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్ సంస్థలు, మెటీరియల్ రీసైక్లర్ల వరకు ఒకే గొడుగుకింద ఉంటాయి. ఆటోమోటివ్ పరిశ్రమ, ఆవిష్కరణలు, సాంకేతికతతో నడపబడుతుందని, భవిష్యత్ తూర్పు ఆసియా భారతదేశానికి చెందినదని నొక్కి చెప్పారు. చలనశీలతలో తమ భవిష్యత్తును చూడాలని చూస్తున్న ప్రతీ పెట్టుబడిదారుకు భారతదేశం ఒక అద్భుతమైన గమ్యస్థానం అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారు. దీనికి ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. 'మేక్ ఇండియా', 'మేక్ ఫర్ ది వరల్డ్' అనే లక్ష్యంతో ముందుకు సాగాలని ప్రధాని ఈ సందర్భంగా ప్రతీ ఒక్కరినీ ప్రోత్సహించారు. భారత ఆటో పరిశ్రమ వృద్ధిని సాధించడంలో 'మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం' కీలక పాత్రను పోషించిందని మోదీ పునరుద్ఘాటించారు. పెర్ఫార్మెన్స్ లింక్డ్ ఇన్‌సెంటివ్ (పిఎల్ఐ) పథకాలు 'మేక్ ఇన్ ఇండియా' ప్రచారానికి కొత్త ఊపునిచ్చాయని తెలియజేశారు.అది రూ.2.25లక్షల కోట్ల విక్రయాలకు దోహదపడిందన్నారు.1.5లక్షల ప్రత్యక్ష ఉద్యోగాల కల్పనకు కూడా దోహదపడిందని ప్రధానమంత్రి వెల్లడించారు. గత దశాబ్దంలో ఇది 640రెట్లు పెరిగిందన్నారు. 10ఏళ్ల క్రితం ఏడాదికి దాదాపు 2,600 ఎలక్ట్రిక్ వాహనాలు మాత్రమే అమ్ముడవగా, 2024లో 16.8లక్షలకు పైగా ఎలక్ట్రిక్ వాహనాలు అమ్ముడుపోయాయని ఆయన చెప్పారు. ఈ దశాబ్దం చివరినాటికి భారతదేశంలో ఎలక్ట్రిక్ వాహనాల సంఖ్య 8రెట్లు పెరగవచ్చని, ఈ విభాగంలో భారతదేశం అపారమైన సామర్థ్యాన్ని ప్రదర్శిస్తున్నదని ప్రధాని నరేంద్రమోదీ తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన రతన్‌టాటా, ఒసాము సుజుకీలను స్మరించారు. భారతీయ ఆటోరంగం వృద్ధికి, అలాగే భారతదేశంలో మధ్యతరగతి కుటుంబాల కలలను నెరవేర్చడానికి ఇద్దరి ప్రముఖుల కృషి వెలకట్టలేని గుర్తుచేశారు. వారి వారసత్వం భారతదేశంలోని మొత్తం చలనశీలత రంగానికి స్ఫూర్తినిస్తుందని ప్రధానమంత్రి మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వాణిజ్య పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ మాట్లాడుతూ భారత్ మొబిలిటీ 2025 భారతదేశ కథను ప్రపంచానికి అందజేసిందని, ఇదిపెట్టుబడులను, దేశానికి వాణిజ్యాన్ని పెంపొందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు నితిన్‌గడ్కరీ, మనోహర్‌లాల్, హెచ్‌డి. కుమారస్వామి, జితన్‌రామ్ మాంఝీ, హర్‌దీప్ సింగ్ పురీ తదితరులు పాల్గొన్నారు.

## విశాఖ ఉక్కుకు రూ.11,440 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

మరో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మతో కలిసి రామ్మోహన్ నాయుడు ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ప్యాకేజీ ప్రకటించిన ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి ఏపీ ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా నెలకొన్న స్టీల్ ప్లాంట్ సమస్యల పరిష్కారానికి అడుగులు పడ్డాయని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు.. ఆంధ్రుల హక్కు నినాదాన్ని కేంద్రం కాపాడిందన్నారు. సీఎం చంద్రబాబు ప్రధాన మంత్రిని కలిసినప్పుడల్లా వైజాగ్ స్టీల్ ప్లాంట్ అంశమే ప్రధాన ఎజెండాగా చర్చించారని చెప్పారు. ప్యాకేజీ రావడానికి కష్టి చేసిన కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామికి రాష్ట్ర ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర మంత్రిగా బాధ్యతలు చేపట్టిన మొదటి నెలలోనే కుమారస్వామి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సందర్శించి, కార్మికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారని గుర్తు చేశారు. ఏపీ ప్రజలకు ఇచ్చిన హామీని ఎన్డీయే ప్రభుత్వం అమలు చేసిందని కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ అన్నారు. ప్లాంటు కార్మికులు, కుటుంబాలకు భద్రతే ధ్యేయంగా కేంద్రం చర్యలు ప్రారంభించిందన్నారు. ప్లాంట్‌ను మరింత సమర్థంగా నడిపించాలని కేంద్రం నిర్ణయించిందన్నారు. ఏపీ ప్రజలు ఉద్యమాలు చేసి స్టీల్ ప్లాంట్‌ను సాధించుకున్నారని తెలిపారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com